ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం 28.07.2026 | సంపుటి :13 సంచిక : 08 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

## కేసుల ఉపసంహరణపై సీజేపీ
# అల్టిమేటం

అసోం, బంగాల్, బిహార్‌లోని విద్యార్థులు, ఇతర నిరసనకారులను వివిధ రాష్ట్ర ఏజెన్సీలు లక్ష్యంగా చేసుకోవడం, నిర్బంధించడం లేదా అరెస్టు చేస్తున్నట్లు తమకు సమాచారం అందింది. బీజేపీ లేదా ఎన్‌డీఏ పాలిత రాష్ట్రాల్లో ఏ నిరసనకారుడిపైనా ఇప్పుడు గానీ, భవిష్యత్తులో గానీ ఎలాంటి చర్యలు తీసుకోబోమని కేంద్రం మాకు హామీ ఇచ్చిన తర్వాతే 'కాక్రోచ్ జనతా పార్టీ' దేశవ్యాప్త నిరసనను విరమించింది. కానీ, ఈ రాష్ట్రాల నుంచి వస్తున్న నివేదికలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. నిర్బంధంలో ఉన్నవారిని విడుదల చేయించడానికి, వారికి న్యాయపరమైన సహాయం అందించడానికి సంబంధిత రాష్ట్రాల్లోని న్యాయవాదులతో మా న్యాయ బృందం సమన్వయం చేసుకుంటోంది. నిర్బంధంలో ఉన్నవారిని విడుదల చేయాలి. దేశంలోని నిరసనకారులపై బలవంతపు లేదా ప్రతీకార చర్యలను ఆపి చర్చల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కేంద్రానికి, ముఖ్యంగా నడ్డా, జితేంద్ర సింగ్‌కు విజ్ఞప్తి చేస్తున్నాం. ఇంకా నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లను కూడా ఉపసంహరించుకోవాలి

- సౌరవ్‌దాస్, సీజేపీ ప్రతినిధి

**24 గంటల్లో తేల్చండి • లేదంటే మళ్లీ పోరుబాట**


ఢిల్లీతో మీడియాతో మాట్లాడుతున్న కాంగ్రెస్ సీనియర్ నేత కపిల్ సిబల్, సీజేపీ ప్రతినిధులు

- కేంద్రం హామీలు బుట్టదాఖలు
- కేసుల ఎత్తివేతపై ఉత్తర్వుల్లో ఇప్పటివరకు కదలికలేదు
- నిరసనకారులపై ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించుకోవాలి
- అదుపులోకి తీసుకున్న విద్యార్థులను విడుదల చేయాలి
- వాలంటీర్లపై నిఘా, వేధింపులను ఆపాలి
- సీజేపీ ప్రతినిధుల డిమాండ్

**న్యూఢిల్లీ,జూలై27(జనంసాక్షి):** నిరసనకారులపై పోలీసు చర్యలు కొనసాగుతున్నాయని, కేసుల ఉపసంహరణనపై కేంద్రం తమకు ఇచ్చిన మాటను ఉల్లంఘిస్తోందని 'కాక్రోచ్ జనతా పార్టీ' ఆరోపించింది. మళ్లీ దేశ వ్యాప్త నిరసనలు ప్రారంభిస్తామని హెచ్చరించింది. కేంద్ర విద్యశాఖ మంత్రిగా ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తర్వాత సీజేపీ తన నిరసనను విరమించింది. కేంద్రంతో చర్చల సమయంలో విద్యార్థులపై కేసులు ఎత్తివేతపై కేంద్రం అంగీకరించిందని సీజేపీ చెబుతోంది. కేసులు విత్ డ్రా చేయకుపోతే నేటి నుంచి మళ్లీ ఉద్యమిస్తామని హెచ్చరించారు. నిరసనకారులపై నమోదైన అన్ని ఎఫ్ఐఆర్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలని, అదుపులోకి తీసుకున్న విద్యార్థులను విడుదల చేయాలని వాలంటీర్లపై నిఘా, వేధింపులను ఆపాలని సీజేపీ డిమాండ్ చేసింది. నిరసనకారులపై ఎలాంటి చర్యలు తీసుకోబోమని ప్రభుత్వం ఇచ్చిన హామీని ఉల్లంఘిస్తోందని సీజేపీ ప్రతినిధి అశుతోష్ రాంకా ఎక్స్‌లో ఆరోపించారు. బీహార్, బెంగాల్‌లలో వందలాది విద్యార్థులను అరెస్ట్ చేస్తున్నారని, ఢిల్లీ, ఇతర రాష్ట్రాల్లో వందలాది మందిపై నిఘా ఉంచి వేధిస్తున్నారని, నిరసనకారులకు లాజిస్టిక్స్ సపోర్ట్ అందించిన వాలంటర్లను వేధిస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు కాక్రోచ్ జనతా పార్టీ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ కీలక వ్యాఖ్యలు చేశారు. కేసుల్లో చిక్కుకున్న విద్యార్థుల న్యాయసహాయం కోసం 'సాక్షి' అనే ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ ప్రారంభించినట్లు సీజేపీ ప్రకటించింది. తమకు ఇచ్చిన హామిని కేంద్రం మిగతా 2లో..

**న్యాయసాయం కోసం సాక్షి ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ ప్రారంభం**



## విద్యార్థులకు క్షమాపణలు చెప్పాల్సిందే

**ఎక్స్ వేదికగా రాహుల్ డిమాండ్**

**న్యూఢిల్లీ,జూలై 27(జనంసాక్షి):** దేశవ్యాప్తంగా నిరసనలు చేపడుతున్న విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం, బీజేపీ పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు అణచివేత ధోరణిని అవలంబిస్తున్నాయని కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ మండిపడ్డారు. మిగతా 2లో..

## శాంతియుత నిరసన రాజ్యాంగహక్కు

- విద్యార్థులపై లాఠీఛార్జి సరికాదు
- కేవలం నిరసన వ్యక్తం చేస్తున్నారనే కారణంతో పోలీసులు
- బలప్రయోగానికి పాల్పడకూడదు
- సుప్రీం కీలక వ్యాఖ్యలు


**న్యూఢిల్లీ,జులై 27(జనంసాక్షి):** నీట్ పేపర్ లీక్ కేసుకు సంబంధించి విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్ వ్యవహారంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కల్పిస్తుందని, కేవలం నిరసన వ్యక్తం చేస్తున్నారనే కారణంతో పోలీసు బలప్రయోగానికి పాల్పడకూడదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. జూలై 20న 'సంసద్ చలో' కార్యక్రమంలో భాగంగా నీట్ పేపర్ లీక్ కేసుపై మిగతా 2లో..



## రంగనాథ్‌ను తొలగించండి

**63 సార్లు కోర్టు ధిక్కరణకు పాల్పడ్డాడు**

- హైడ్రా కమిషనర్ స్థానం నుంచి ఆయనను తప్పించాలని సీఎస్‌కు హైకోర్టు ఆదేశాలు
- ఇలాంటి వ్యక్తి అదే పోస్టులో కొనసాగడం సరికాదని వ్యాఖ్య
- లోతుకుంట భూముల వ్యవహారంపై ధర్మాసనం విచారణ




**హైదరాబాద్,జూలై27(జనంసాక్షి):** హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు తెలంగాణ హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆయన్ను హైడ్రా కమిషనర్ పోస్టు నుంచి తప్పించాలని సీఎస్‌ను ఆదేశించింది. రంగనాథ్‌పై 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు ఉన్నాయని ఉన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టులను ఆశ్రయించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని పేర్కొంది. ఉన్నతాధికారిగా ఉన్న రంగనాథ్.. కోర్టు ఉత్తర్వులను ఇన్నిసార్లు ధిక్కరించడం సరికాదని ఆక్షేపించింది. మల్కాజిగిరి పరిధిలోని లోతుకుంట భూములకు సంబంధించి గతంలో ఉన్నత న్యాయస్థానం ఆదేశాలను హైడ్రా ఉల్లంఘించిందంటూ శాంతా శ్రీరాం కన్‌స్ట్రక్షన్స్ మిగతా 2లో..

### క్షమించండి..

**కోర్టులంటే గౌరవం ఉంది: రంగనాథ్**

అఫిడవిట్‌లో రంగనాథ్ క్షమాపణ కోరారు. కోర్టుల పట్ల పూర్తిస్థాయి నమ్మకముందని పేర్కొన్నారు. లోతుకుంట సర్వే నంబర్ 1, 2లో ఉన్న 40 ఎకరాల భూమిలోకి వెళ్లలేదని తెలిపారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ జోక్యం చేసుకుని దీనిపై పూర్తిస్థాయిలో అఫిడవిట్ దాఖలు చేస్తామని తెలిపారు.

## ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా
# 'అల్పాహార పథకం'

**ఆకలితో ఏ విద్యార్థి అలమటించకూడదనే మా ధ్యేయం : భట్టి విక్రమార్క**

**విద్యార్థుల సంక్షేమమే ప్రజాప్రభుత్వ లక్ష్యం • పథకాన్ని ప్రారంభించిన డిప్యూటీ సీఎం**

**ఖమ్మం,జూలై27(జనంసాక్షి):** తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అల్పాహార పథకాన్ని ఖమ్మం జిల్లాలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఏ విద్యార్థి కూడా అర్ధాకలితో పాఠశాలకు వెళ్లకూడదన్న లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. రాష్ట్రానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఆరోగ్యకరమైన అల్పాహారం అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని భట్టి పేర్కొన్నారు. ఖాళీ కడుపుతో పాఠశాలకు వచ్చే విద్యార్థులు పాఠాలపై ఏకాగ్రత చూపలేకపోతున్నారని, వారి అభ్యాస సామర్థ్యాన్ని పెంచడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని చెప్పారు. సహజ వనరులు ఎంత ముఖ్యమో, మానవ వనరులు కూడా అంతే ముఖ్యమని పేర్కొన్న డిప్యూటీ సీఎం.. మానవ వనరుల అభివృద్ధిపై పెట్టుబడి పెడితేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 22 లక్షల మంది విద్యార్థులకు మిగతా 2లో..





## సీఎం రేవంత్ ఢిల్లీ టూర్

**74వ సారి దేశరాజధానిలో పర్యటించనున్న ముఖ్యమంత్రి**

**హైదరాబాద్(జనంసాక్షి):** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 74వ సారి ఢిల్లీ పర్యటనకు వెళ్తున్నారు. సోమవారం ఢిల్లీలో ఖర్గే అధ్యక్షతన జరిగే ఏఐసీసీ సమావేశంలో పాల్గొననున్నారు. 'సర్' ప్రక్రియ, పార్టీ వ్యవహారాలతో పాటు ఇటీవల ఢిల్లీ విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేపట్టే కార్యాచరణపై చర్చించే అవకాశాలున్నట్టు సమాచారం.

## లోక్‌సభలో
**ఆందోళనలతో ముందుకుసాగని చర్చ**
# యాంటీ పేపర్ లీక్ బిల్లు

- పార్లమెంటులో ప్రతిష్టంభన
- మోడీ, అమిత్ షాల క్షమాపణలకు విపక్షాల పట్టు
- గందరగోళం మధ్యే సభ ముందుకు సవరణ బిల్లు
- బిల్లును ప్రవేశ పెట్టిన కేంద్రమంత్రి జితేంద్ర సింగ్
- బిల్లు ప్రాధాన్యం దృష్ట్యా చర్చకు అనుమతించిన స్పీకర్
- విపక్ష సభ్యుల ఆందోళనతో సభను వాయిదా వేసిన స్పీకర్ ఓంబిర్లా



**న్యూఢిల్లీ,జూలై27(జనంసాక్షి):** పార్లమెంట్ ఉభయసభల్లో గందరగోళం కొనసాగింది. విద్యార్థులపై కేసులు ఎత్తివేత మొదలు, లాఠీఛార్జికి నిరసనగా ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షాలు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ ఉభయ సభల్లో సభ్యులు ఆందోళనకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ క్రమంలో ఉభయ సభలు వాయిదా పడ్డాయి. గందరగోళం మధ్యే ప్రభుత్వం పేపర్ లీకేజీల సవరణ బిల్లును లోక్‌సభలో ప్రవేశ పెట్టింది. దీనిపై మాట్లాడేందుకు స్పీకర్ ఆహ్వానించినా విపక్షాలు ముందుకు రాలేదు. నీట్-యూజీ సహా పలు పోటీ పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీలు, అక్రమాలపై దేశవ్యాప్తంగా తీవ్ర విమర్శలు వ్యక్తమైన వేళ పరీక్షల భద్రతను మరింత పటిష్ఠం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగేసింది. ఇప్పటికే అమల్లో ఉన్న 2024 చట్టాన్ని మరింత కఠినతరం చేస్తూ యాంటీ పేపర్ లీక్(సవరణ) బిల్లును సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. దీనిని ప్రధానమంత్రి కార్యాలయ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ సభ ముందుంచారు. ఈ సవరణల ద్వారా నిందితులకు కఠిన శిక్ష విధించడం సహా వేగవంతమైన దర్యాప్తు, నిర్దిష్ట కాలవ్యవధిలో విచారణ పూర్తయ్యేలా నిబంధనలను రూపొందించారు. ఇకపై ప్రతి రాష్ట్రంలో ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసి, రోజువారీ విచారణల తో కేసులను 90 రోజుల్లో పూర్తిచేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టం ప్రకారం మూడు నుంచి ఐదేళ్ల వరకు జైలు శిక్ష మిగతా 2లో..

## చర్చలకు 3 షరతులు

- ప్రతిపాదించిన ఇరాన్ ప్రతినిధులు
- హర్మూజ్ తమ నియంత్రణలోనే ఉందని ధ్రువీకరించే విషయమై స్పష్టత రావాలి
- ఫ్రీజ్ చేసిన నిధులు విడుదల చేయాలి
- ఈ విషయాలు కొలిక్కి వచ్చాకే అణుసమస్య గురించి మాట్లాడాలని షరతు
- సీమైన్‌ను ఢీకొని హర్మూజ్‌లో పేలిన ట్యాంకర్

**టెహ్రాన్(జనంసాక్షి):** చర్చల నిమిత్తం తాజా ఉద్రిక్తతలకు ఇరాన్, అమెరికా విరామం ఇచ్చాయి. అయితే హర్మూజ్ జలసంధిలో కొత్తమార్గం లేక ప్రత్యామ్నాయ మార్గానికి ఇదిలా ఉంటే.. ప్రస్తుతం హర్మూజ్‌లో రుసుము గురించి ఆ జలసంధికి ఇరువైపులా ఉన్న ఇరాన్, ఒమన్ దేశాలు చర్చలు జరుపుతున్నాయి. తమ సార్వభౌమాధికారానికి నష్టం వాటిల్లకుండా, వాణిజ్య నౌకల రాకపోకలకు అంతరాయం ఏర్పడకుండా ఎలాంటి చర్యలు చేపట్టాలన్న అంశంపై ఇరుదేశాల ప్రతినిధులు చర్చించారు. మిగతా 2లో..

## అమెరికా, ఇజ్రాయెల్‌లను
# ప్రతిఘటించండి

- ఆగడాలు అరికట్టేందుకు అదొక్కటే సరైన మార్గం
- లెబనాన్‌లో ఇజ్రాయెల్ సైనికచర్య ఆగినప్పుడే అమెరికాతో ఇరాన్ సంఘర్షణ ముగుస్తుంది
- స్పష్టం చేసిన మొజ్తబా ఖమేనీ



**టెహ్రాన్(జనంసాక్షి):** లెబనాన్‌లో క్రియాశీలంగా ఉన్న హెజ్‌బొల్లాకు ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ పూర్తి మద్దతు ప్రకటించారు. ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా ఆ సంస్థ చేపడుతున్న చర్యలను ఆయన కొనియాడారు. అమెరికా, ఇజ్రాయెల్‌ను ఎదుర్కోవడానికి ప్రతిఘటించడం తప్ప వేరే మార్గం లేదన్నారు. లెబనాన్‌లో ఇజ్రాయెల్ సైనిక చర్య ఆగినప్పుడే.. అమెరికాతో ఇరాన్ సంఘర్షణ ముగుస్తుందని స్పష్టం చేశారు. ఈ మేరకు హెజ్‌బొల్లా సెక్రెటరీ జనరల్ షేక్ నయీమ్, ఆ సంస్థ సభ్యులను ఉద్దేశించి ఎక్స్ వేదికగా వెల్లడించారు. దీనిని ఓ వ్యూహాత్మక ఆదేశంగా తీసుకొని, అమలు చేయాలని కోరారు. ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్‌కు విధేయులుగా ఉంటామంటూ హెజ్‌బొల్లా ఓ లేఖను విడుదల చేసింది. దీనిపై మొజ్తాబా తాజా సందేశాన్ని విడుదల చేశారు.

## విద్యార్థులపై ఏకే 47తో కాల్పులు



- బీహార్‌లోని సివాన్ జిల్లాలో ఘటన
- లోక్‌సభలో బీజేపీపై కాంగ్రెస్ ఆగ్రహం
- ఎట్టకేలకు పోలీస్ కానిస్టేబుల్ సస్పెన్షన్

**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై బీహార్‌లో ఏకే-47 తుపాకీని, ఢిల్లీలో పెల్లెట్ గన్‌లను ఉపయోగించారని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పార్లమెంటు వేదికగా అధికార బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ నిరసనల అణచివేతపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. జూలై 25న బీహార్‌లోని సివాన్ జిల్లాలో జరిగిన 'బీహార్ బంద్' నిరసనల్లో, ఒక పోలీస్ కానిస్టేబుల్ ఆందోళనకారులపై ఏకే-47 గురిపెట్టి గాలిలోకి కాల్పులు జరిపిన వీడియో సోషల్ మిగతా 9లో..

### అయోధ్య విరాళాల చోరీ కేసు..
## దర్యాప్తు పురోగతిపై నివేదిక సమర్పించండి



**సిట్‌ను ఆదేశించిన సుప్రీం కోర్టు**

**న్యూఢిల్లీ,జూలై27(జనంసాక్షి):** అయోధ్య రామమందిర విరాళాల చోరీ ఆరోపణల సంబంధిత కేసులో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీచేసింది. కేసు దర్యాప్తు పారదర్శకంగా, సమగ్రంగా చేపట్టేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)లో ఫోరెన్సిక్ ఆడిటర్‌ను తప్పనిసరిగా చేర్చాలని ఉత్తర్వులిచ్చింది. అలాగే దర్యాప్తు పురోగతిపై కూడా రెండు వారాల్లోగా స్టేటస్ రిపోర్ట్ సమర్పించాలని సిట్‌ను ఆదేశించింది. ఈ కేసు విచారణ కోసం ఐజీ కిరణ్ నేతృత్వంలో సిట్‌ను ఏర్పాటుచేసినట్లు ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. కేసు విచారణ వేగంగా, మిగతా 9లో..

## పరారీలో ఉదయ్ కృష్ణారెడ్డి

- ట్రైనీ ఐపీఎస్ లైంగిక వేధింపుల కేసులో కీలక మలుపు
- సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తున్నట్లు తెలిపిన పోలీసులు
- నిందితుడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు
- హైకోర్టు తదుపరి విచారణ మరోసారి ఎల్లుండికి వాయిదా

2లో..



జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
28.07.2026

## రంగనాథ్‌ను తొలగించండి

ప్రైవేట్ లిమిటెడ్ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. హైకోర్టు ఆదేశాలు ఉన్నా.. ఫెన్సింగ్‌ను హైడ్రా సిబ్బంది తొలగించారని పేర్కొంది. ఒకే పిటిషన్‌కు సంబంధించి పలుమార్లు కోర్టు ఉత్తర్వులను హైడ్రా కమిషనర్ ధిక్కరించడం నేరమని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ క్రమంలో కోర్టుకు ఆయన హాజరుకావాలని ఆదేశించింది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ జోక్యం చేసుకుని దీనిపై పూర్తిస్థాయిలో అఫిడవిట్ దాఖలు చేస్తామని తెలిపారు. అఫిడవిట్‌లో రంగనాథ్ క్షమాపణ కోరారు. కోర్టుల పట్ల పూర్తిస్థాయి నమ్మకముందని పేర్కొన్నారు. లోతుకుంట సర్వే నంబర్ 1, 2లో ఉన్న 40 ఎకరాల భూమిలోకి వెళ్లలేదని తెలిపారు. దీనిపై స్పందించిన హైకోర్టు.. రంగనాథ్‌పై 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు ఉన్నాయని, దీనికి కారణమేంటని ప్రభుత్వం తరపు న్యాయవాదిని ప్రశ్నించింది. ఈ క్రమంలో రంగనాథ్‌ను తొలగించాలని పేర్కొంటూ.. ఆయన స్థానంలో మరొకరిని నియమించాలని ఆదేశించింది. లోతుకుంట భూముల వ్యవహారానికి సంబంధించి తెలంగాణ హైకోర్టులో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ కేసు విచారణ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. హైడ్రా కమిషనర్ పదవి నుంచి రంగనాథ్‌ను తొలగించాలంటూ.. తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆదేశాలు జారీ చేసింది. సెక్రటరీ ర్యాంక్ స్థానంలో ఉన్న ఉన్నతాధికారి.. కోర్టు ఉత్తర్వులను ధిక్కరించడం ఏ మాత్రం సమంజసం కాదని ధర్మాసనం పేర్కొంది. అర్హత కలిగిన అధికారిని హైడ్రా కమిషనర్‌గా నియమించాలని హైకోర్టు సూచించింది. 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లపై ఆగ్రహం వ్యక్తం చేసిన న్యాయస్థానం.. లోతుకుంట ప్రైవేటు భూములపై హైడ్రా జోక్యాన్ని తప్పుబట్టింది. హైడ్రా కమిషనర్‌గా రంగనాథ్ కొనసాగితే రూల్ ఆఫ్ లా తప్పుతుందని పేర్కొంది. ఇన్ని ఉల్లంఘనలకు పాల్పడుతున్న అధికారిని ఇంకా అదే పోస్టులో కొనసాగించడం సరికాదని.. రంగనాథ్‌ను తొలగించడం తప్ప మరో ఆప్షన్ లేదని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. ఈ కేసు విచారణ సందర్భంగా హైకోర్టుకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ క్షమాపణలు తెలిపారు. కోర్టులు, న్యాయ వ్యవస్థపై తనకు ఎంతో నమ్మకం ఉందని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అలాగే లోతుకుంట సర్వే నంబర్లు 1, 2 పరిధిలోని 40 ఎకరాల భూమిలోకి హైడ్రా బృందం వెళ్లలేదని కోర్టుకు వివరించారు. ఈ విషయంలో పిటిషనర్ అసత్య ఆరోపణలు చేస్తున్నారని కూడా రంగనాథ్ తన అఫిడవిట్‌లో తెలిపారు.

## ప్రభుత్వ ఉద్యోగాలు అంగడి సరుకు కాదు

- విజయ్ ప్రభుత్వానికి మద్రాస్ హైకోర్టులో ఎదురుదెబ్బ
- కరూరు బాధితులకు ఉద్యోగాల కల్పనపై ఆక్షేపణ

**చెన్నై,జూలై27(జనంసాక్షి):**తమిళనాడు సిఎం విజయ్ ప్రభుత్వానికి మద్రాస్ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. కరూర్ తొక్కిసలాటలో మృతి చెందిన వారి కుటుంబాలకు ఇచ్చిన ఉద్యోగాలు చెల్లవని ఉన్నత న్యాయస్థానం తేల్చి చెప్పింది. రాజ్యాంగ పరిమితులకు లోబడి ప్రభుత్వం వ్యవహరించాలని సూచించింది. ప్రభుత్వ చర్యలపై నియంత్రణ లేకపోతే.. అరాచకం, అశాంతి రాజ్యమేలుతాయని పేర్కొంది. ప్రభుత్వ ఉద్యోగం అనేది ఉచితంగా పంచిపెట్టేది కాదు. దాన్ని కష్టపడి సాధించాలి. ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎంతోమంది ఎదురుచూస్తున్నారని వ్యాఖ్యానించింది. గతేడాది సెప్టెంబర్‌లో జరిగిన టీవీకే ర్యాలీలో చోటుచేసుకున్న తొక్కిసలాటలో 41 మంది మరణించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బాధితుల కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తామని విజయ్ హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మరోసారి కరూర్ వెళ్లి అర్హతలున్న 32 మందికి వివిధ ప్రభుత్వ శాఖల్లో తాత్కాలిక నియామక పత్రాలను అందజేశారు. దీనిపై అన్నాడీఎంకే నేత ఆర్.బి. ఉదయ్‌కుమార్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. చట్టపరమైన విధానాలను పక్కనపెట్టి తాత్కాలిక ప్రాతిపదికన ఉద్యోగాలు ఇచ్చారంటూ హైకోర్టును ఆశ్రయించారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎంతో మంది యువత తీవ్రంగా శ్రమిస్తున్నారని, ప్రభుత్వం ఏ ఉద్యోగ నియామక ప్రక్రియ చేపట్టినా తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారానే చేపట్టాలని కోరారు. దీనిపై తాజాగా విచారణ చేపట్టి న్యాయస్థానం సీఎం విజయ్ చేపట్టిన ఈ నియామకాలు చెల్లబోవని తీర్పునిచ్చింది.

## పరారీలో ఉదయ్ కృష్ణారెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):**నేషనల్‌పోలీస్ అకాడమీలో తనపై వేధింపులకు పాల్పడ్డాడని మహిళా ట్రైనీ ఐపీఎస్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఉదయ్ కృష్ణారెడ్డిపై ఈ నెల 18న అత్తాపూర్? పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణలో భాగంగా నిందితుడు తెలిపిన రెండు చిరునామాల్లోనూ నోటీసులు ఇచ్చేందుకు వెళ్లగా, పోలీసులకు అతడి ఆచూకీ లభించలేదు. మొబైల్ కూడా స్విచ్ఛాఫ్ అని వస్తున్నట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. జూ౦ 20వ తేదీన ఉదయం అపస్మారక స్థితిలో ఎస్సార్‌నగర్‌లోని ప్రైవేటు ఆసుప్రతిలో చేరిన నిందితుడు ఉదయ్‌కృష్ణారెడ్డి ఆరోగ్యం కుదుటపడిన సంగతి తెలిసిందే. జూన్ 22న ఆయనను హాస్పిటల్ నుంచి డిశ్చార్జి చేశారు.తనపై అత్తాపూర్ ఠాణాలో నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ ఉదయ్ కృష్ణారెడ్డి జూన్ 21న హైకోర్టులో పిటిష౦ దాఖలు చేశారు. ఐపీఎస్‌కు ఎంపికై శిక్షణకు ముస్సోరి వెళ్లినప్పటి నుంచి ఫిర్యాదుదారుతో ప్రేమలో ఉన్నానని, వివాహం చేసుకోవాలని అనుకున్నామని, ఈ దశలో ఆర్థికంగా కూడా చేయూతనిచ్చినట్లుగా ఉదయ్ కృష్ణారెడ్డి తన పిటిషన్‌లో తెలిపారు. కానీ ఫిర్యాదుదారు ఓ ఐఏఎస్ ఆఫీసర్‌ను పెళ్లి చేసుకున్నారన్నారు. తిరిగి ఆ అనుబంధాన్ని కొనసాగించాలని తనను కోరుతూ వచ్చారని పిటిషనర్ పేర్కొన్నారు. ఫిర్యాదుదారు మొదట అకాడమీ అధికారులకు, తర్వాత పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. అయితే ఈ రెండింటిలోనూ భిన్నమైన ఆరోపణలున్నాయని తన పిటిషన్‌లో వివరించారు. ఈ నేపథ్యంలో విచారణ లేకుండా నమోదు చేసిన కేసును కొట్టివేయాలని ఉదయ్ కృష్ణారెడ్డి కోరారు. గతంలో వాదనలు విన్న హైకోర్టు తదుపరి విచారణను నేటికి వాయిదా వేయడంతో విచారణ జరిగింది. అదనపు పీపీ జితేందర్ రావు వివరాలు సమర్పించడానికి సమయం కోరడంతో తదుపరి విచారణ మరోసారి ఎల్లుండికి వాయిదా వేసింది.

## కేసుల ఉపసంహరణపై సీజేపీ అల్టిమేటం

నిలబెట్టుకోవట్లేదని ఆరోపించారు. పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసన చేపట్టిన ఆందోళనకారులపై నమోదైన కేసులు ఉపసంహరించు కుంటామని కేంద్ర మంత్రులు తమకు హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అందువల్లే తాము నిరసనలు నిలిపివేశామన్నారు. కానీ, ఇంతవరకూ విద్యార్థులు, ఇతర నిరసనకారులపై పెట్టిన కేసులను ఎత్తివేయలేదని తెలిపారు. అస్సాం, పశ్చిమ బెంగాల్, బిహార్ వంటి రాష్టాల్లో పలువురు ఆందోళనకారులను అరెస్టు చేసినట్లు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. ఈ కేసుల గురించి న్యాయవాదులను సంప్రదిస్తున్నామని సౌరవ్ పేర్కొన్నారు. తమకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కేంద్రానికి మరోసారి గుర్తు చేస్తున్నట్లు తెలిపారు. రేపటిలోగా దేశవ్యాప్తంగా ఆందోళనకారులపై నమోదైన అన్ని కేసులు ఉపసంహరించుకోవాలని.. నిర్బంధంలో ఉన్న నిరసనకారులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే తమ తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని అన్నారు. ఈ విషయంలో కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరారు. నిరసనకారులపై నమోదైన అన్ని ఎఫ్ఐఆర్‌లను తక్షణమే ఉపసంహరించుకోవాలని, మరియు బీజేపీ పాలిత లేదా బీజేపీ ఢిల్లీ పోలీసులు, కేంద్ర దర్యాప్తు సంస్థలు లేదా పోలీసు బలగాలు కొత్త కేసులు నమోదు చేయకూడదని సీజేపీ డిమాండ్ చేశారు. అలా చేయని పక్షంలో మళ్లీ నిరసనలో కూర్చుంటామని కేంద్రానికి అల్టిమేటం జారీ చేసింది. కేసులు ఎత్తేస్తామనే హామీని లిఖితపూర్వకంగా తమకు బుధవారం లోగా ఇవ్వాలని సీజేపీ కోరింది. సోమవారం నాడు సీనియర్ సుప్రీం కోర్టు న్యాయవాది ఎస్పీ రాజ్యసభ ఎంపీ కపిల్ సిబల్‌తో కలిసి నిర్వహించిన సంయుక్త విలేకరుల సమావేశంలో, సీజేపీ ప్రతినిధి సౌరవ్ దాస్ మాట్లాడుతూ, ప్రభుత్వం తమ డిమాండ్లను అంగీకరించిన తర్వాత జూలై 25న ఆందోళనను విరమించుకున్నామని, అయితే ఆందోళన తగ్గుముఖం పట్టిన కొద్దీ విద్యార్థులను ఒక్కొక్కరిగా లక్ష్యంగా చేసుకుంటారని తాము ముందే ఊహించామని తెలిపారు.

## శాంతియుత నిరసన రాజ్యాంగహక్కు

న్యాయం కోరుతూ విద్యార్థులు నిర్వహించిన నిరసన సందర్భంగా పోలీసులు లాఠీచార్జ్ చేయడంతో పాటు టియర్ గ్యాస్ ప్రయోగించారు. ఈ ఘటనపై స్వతంత్ర విచారణ జరపాలని కోరుతూ పలువురు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు రాజ్యాంగబద్ధ హక్కులపై కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణ సందర్భంగా చీఫ్ జస్టిస్ మాట్లాడుతూ, భారత రాజ్యాంగం శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును పౌరులకు కల్పించిందని పేర్కొంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో తమ అభిప్రాయాలను శాంతియుతంగా వ్యక్తం చేసే స్వేచ్ఛ ప్రతి పౌరుడికి ఉందని స్పష్టం చేసింది. అలాగే, కేవలం నిరసన జరుగుతోందనే కారణంతోనే లాఠీచార్జ్ లేదా బలప్రయోగాన్ని సమర్థించలేమని కోర్టు వ్యాఖ్యానించింది. విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగంపై స్వతంత్ర విచారణ జరపాలని పిటిషనర్లు కోరారు. ఈ ఘటనలో పోలీసులు అనుసరించిన విధానంపై ప్రశ్నలు లేవనెత్తుతూ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్య దేశంలో శాంతియుత నిరసనలు ప్రజల ప్రాథమిక హక్కుల్లో భాగమని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. ప్రజలు తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు నిరసనలు ఒక ప్రజాస్వామ్య మార్గమని, అలాంటి సందర్భాల్లో చట్టాన్ని అమలు చేసే సంస్థలు కూడా రాజ్యాంగబద్ధ హక్కులను గౌరవిస్తూ వ్యవహరించాలని అభిప్రాయపడుతున్నారు. సుప్రీంకోర్టు తాజా వ్యాఖ్యలు నిరసన హక్కు, పోలీసుల చర్యల పరిమితులపై మరోసారి దేశవ్యాప్తంగా చర్చకు దారితీశాయి.

### విద్యార్థులకు క్షమాపణలు చెప్పాల్సిందే

విద్యార్థులపై కాల్పులు, లాఠీఛార్జీలు, కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన ఆగ్రహించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెడుతూ కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీపై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. ఇందుకు క్షమాపణలు చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. బిహార్‌లో నిరసన తెలుపుతున్న విద్యార్థులపై ఏకే-47తో కాల్పులు జరిపారని, వందలాది మంది విద్యార్థులను అరెస్టు చేసి వారిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారనే వార్తలు వస్తున్నాయని రాహుల్ గాంధీ అన్నారు. విద్యార్థులపై ఎలాంటి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయబోమని, వారిని విడుదల చేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన హామీ ఏమైందని ఆయన ప్రశ్నించారు. హామీకి విరుద్ధంగా వారిపై క్రూరమైన దాడులు జరుగుతున్నాయని మండిపడ్డారు. ఢిల్లీలో విద్యార్థులపై పె÷-లలెట్ గన్‌లు ప్రయోగించారని, బిహార్‌లో ఏకే-47తో కాల్పులు జరిగాయని రాహుల్ ఆరోపించారు. ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, బిహార్, ఢిల్లీ.. రాష్ట్రం ఏదైనా విద్యార్థుల గొంతు నొక్కివేయాలనే ధోరణి కనిపిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.కేంద్ర ప్రభుత్వం నిజాయతీ లేనిదని తాను గతంలోనే చెప్పానని, నిజమైన సంస్కరణలు తీసుకురావడం ఈ ప్రభుత్వానికి సాధ్యం కాదని రాహుల్ విమర్శించారు. ఇచ్చిన హామీల నుంచి వెనక్కి తగ్గడంతో పాటు, విద్యార్థుల గొంతు అణచివేసేందుకు అన్ని మార్గాలను ఉపయోగిస్తోందని చెప్పుకొచ్చారు. దేశంలోని విద్యార్థులందరికీ ప్రధాని మోదీ బహిరంగంగా క్షమాపణ చెప్పాలన్నారు. విద్యార్థులపై కేసులు పెట్టడం కాకుండా, వారిపై దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఈ సందర్భంగా రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. కాగా, జులై 25న బిహార్ బంద్ సందర్భంగా సివాన్ జిల్లాలో పోలీసులు ఏకే-47తో కాల్పులు జరిపినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఓ పోలీసు అధికారిని ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు.

### విద్యార్థులపై దాడికి అమిత్ షా క్షమాపణలు చెప్పాలి: చామల

న్యూఢిల్లీ,జూలై27(జనంసాక్షి): విద్యార్థులపై జరిగిన అమానుష దాడికి కేంద్ర హోంమంత్రి క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. బాధ్యులైన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. పార్లమెంట్ ప్రాంగణంలో ఆయన మీడియాతో మాట్లాడారు 'ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో అంతా అయిపోయిందని కేంద్ర ప్రభుత్వం చేతులు దులుపుకుంటే ఉపేక్షించేది లేదు. పార్లమెంట్ సమావేశాలు సజావుగా జరగాలంటే ప్రభుత్వం బాధ్యతతో వ్యవహరించాలి. సింగపూర్, బ్రిటన్ లాంటి దేశాల్లో జెన్‌జీకి చట్టసభల్లో ప్రాధాన్యత ఇస్తున్నారు. భారత్‌లో కూడా 21 ఏళ్ల నుంచి 25 ఏళ్ల లోపు ఉన్న యువతకు చట్టసభలో ప్రాతినిధ్యం కల్పిస్తే.. వారి సమస్యలపై పూర్తి అవగాహనతో చర్చించి, సమస్యలు పరిష్కారం చేయవచ్చు. ఈ ఆలోచనను పరిగణనలోకి తీసుకోవాలని ఇండియా కూటమి నేతలకు తెలంగాణ ముఖ్యమంత్రి వివరించనున్నారు' అని చామల తెలిపారు.

## చర్చలకు 3 షరతులు

సంబంధించిన ప్రతిపాదనలను ఇరాన్ తిరస్కరించింది. చర్చలు కొనసాగించేందుకు మూడు షరతులు విధించింది. జలసంధి పూర్తిగా తమ నియంత్రణలోనే ఉందని ధ్రువీకరించే విషయమై స్పష్టత వచ్చాకే చర్చలు ప్రారంభం కావాలని టెహ్రాన్ కోరుకుంటోంది. ఫ్రీజ్ చేసిన నిధులు విడుదల చేయడం మరొకటి. ఈ అంశాలు ఓ కొలిక్కి వచ్చాక అణుసమస్య గురించి మాట్లాడాలని కండిషన్ పెట్టింది.

**సీమైన్‌ను ఢీకొని హర్మూజ్‌లో పేలిన ట్యాంకర్..**

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు రోజుకో రూపు సంతరించుకుంటున్నాయి. అమెరికా-ఇరాన్ మధ్య రెండు వారాలుగా భగ్గుమంటోన్న ఘర్షణలకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. దీంతో చమురు ధరలు కాస్త దిగొచ్చాయి. అదే సమయంలో హర్మూజ్‌లో సీమైన్‌ను ఢీకొని చమురు ట్యాంకర్ పేలడం వంటి ఘటనలతో ఉద్రిక్తతలు సమసిపోలేదని స్పష్టమవుతోంది. హర్మూజ్‌లో ఇరాన్ నిర్దేశించిన జలమార్గంలో కాకుండా మరోదారిలో వెళ్లిన ట్యాంకర్ పేలిపోయిందని ఆ దేశ మీడియా సంస్థ తస్నిమ్ ధ్రువీకరించింది. ఆ ఘటనలో ఎవరైనా ప్రాణాలు కోల్పోయారా..? వంటి వివరాలు మాత్రం తెలియరాలేదు.

## ఆస్పత్రి నుంచి వాంగ్‌చుక్ డిశ్చార్జి



న్యూఢిల్లీ(జనంసాక్షి):పర్యావరణ ఉద్యమకారుడు వాంగ్‌చుక్ గురుగ్రామ్‌లోని మేదాంత ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. అక్కడి నుంచి ఆయన నేరుగా రాజ్‌ఘాట్‌కు వెళ్లి.. మహాత్మాగాంధీ సమాధి వద్ద నివాళులర్పించారు. ఆ తర్వాత లద్దాఖ్ బయల్దేరి వెళ్లారు ఈ మేరకు వాంగ్‌చుక్ 'ఎక్స్'లో ఓ వీడియోను పోస్టు చేశారు. ఇన్నాళ్లూ తనకు వైద్య సేవలు అందించిన వైద్యులు, అక్కడి సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా జూన్ 28న జంతర్‌మంతర్ వద్ద ఆయన నిరాహార దీక్ష చేపట్టారు. ఆరోగ్యం క్షీణిస్తుండటంతో దిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు పోలీసులు జులై 18న ఆయన్ను సఫ్దర్‌జంగ్ ఆస్పత్రికి తరలించారు. అయితే, వాంగ్‌చుక్ ఆరోగ్యం విషమించే ప్రమాదం ఉందని.. ప్రైవేటు ఆస్పత్రికి తరలించేందుకు అనుమతివ్వాలని దిల్లీ హైకోర్టులో ఆయన భార్య గీతాంజలి పిటిషన్ దాఖలు చేయగా న్యాయస్థానం అంగీకరించింది. దీంతో జులై 22న ఆయన్ను మేదాంత ఆస్పత్రికి తరలించిన విషయం తెలిసిందే. పేపర్ లీకులపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రధాని మోదీ హామీ ఇవ్వడంతో నిరాహార దీక్షను విరమించారు. కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ సమక్షంలో 23 దీక్షను ముగించారు.

## కెనడాలో భారత యువతి దారుణ హత్య

ఒట్టావా(జనంసాక్షి):కెనడాలో పంజాబ్‌కు చెందిన యువతి దారుణ హత్యకు గురైంది. టొరంటోలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హంబర్‌వుడ్ స్ట్రీట్‌లో నవ్‌నీత్ కౌర్ (26) సమీపంలో నడుచుకుంటూ వెళ్తుండగా ఓ వ్యక్తి ఆమెను వెంబడించాడు. కొద్దిసేపు ఆమెతో మాట్లాడిన అనంతరం ఒక్కసారిగా తుపాకీతో కాల్పులు జరిపి అక్కడి నుంచి పారిపోయాడు. తీవ్రంగా గాయపడిన ఆమె ఘటనా స్థలంలోనే మృతిచెందింది. ప్రత్యక్ష సాక్షి తెలిపిన వివరాల ప్రకారం.. ఇద్దరి మధ్య ఎలాంటి వా గ్వాదం జరగకుండానే నిందితుడు కాల్పులకు పాల్ప డ్డాడు. ఈ కేసులో 37 ఏళ్ల శరణ్‌జీత్ సింగ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడిది కూడా పంజాబేనని గుర్తించారు. అతనిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. డ్రోన్లు, ఇతర సాంకేతిక పరికరాల సహాయంతో నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. ఇది పక్కా పథకంతో చేసిన హత్యగా భావిస్తున్నామని పేర్కొన్నారు. .

### హైకోర్టును ఆశ్రయించిన గడ్కరీ

న్యూఢిల్లీ(జనంసాక్షి):కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ బాంబే హైకోర్టును ఆశ్రయించారు. ఈ20 పెట్రోల్‌తో తన కుటుంబం లబ్ధి పొందుతోందంటూ పలువురు నెటిజన్లు ఆన్‌లైన్‌లో డీప్‌ఫేక్ వీడియోలు, పోస్టులు పెడుతున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. తన పరువుకు భంగం కలిగించేలా సోషల్ మీడియాలో పోస్టులు చేసేవారిపై చర్యలకు ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. దీంతో ఇటువంటి కంటెంట్‌ను వ్యాప్తి చేసేందుకు సహకరించిన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లపై సివిల్ దావా వేసేందుకు కోర్టు ఆయనకు అనుమతి ఇచ్చింది. ఇ20 ఇంధన కార్యక్రమానికి సంబంధించి కేంద్రమంత్రిపై తప్పుడు సమాచారం వ్యాప్తి చేశారన్న ఆరోపణలపై నలుగురు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లపై నాగ్‌పూర్‌లో ఎఫ్ఐఆర్ నమోదైన దాదాపు రెండు వారాల తర్వాత ఈ పరిణామం చోటుచేసుకుంది.

## లోక్‌సభలో యాంటీ పేపర్ లీక్ బిల్లు

విధిస్తారు. కొత్త బిల్లులో దానిని గరిష్ఠంగా పదేళ్లకు పెంచారు. దీంతో పాటు ఇప్పటివరకు గరిష్ఠంగా రూ.10 లక్షలుగా ఉన్న జరిమానా.. నూతన చట్టంలో రూ.10 కోట్లకు పెరగనుంది. ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంపై ఇప్పటివరకు కేంద్ర దర్యాప్తు సంస్థలు విచారణ చేపట్టేవి. కానీ ఇకపై ఇలాంటి అక్రమాలపై స్పెషల్ టాస్క్ ఫోర్స్(ఎస్‌టీఎఫ్) ప్రత్యేక దర్యాప్తు చేపట్టనుంది. ఇప్పటివరకు దర్యాప్తు పూర్తి చేసేందుకు నిర్దిష్ట గడువు ఉండేది కాదు. కొత్త బిల్లు ప్రకారం.. రెండు నెలల్లోనే విచారణ పూర్తిచేయడం తప్పనిసరి కానుంది. పేపర్ లీక్ కేసుల విచారణ కోసం ప్రతి రాష్ట్రంలో ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు కానున్నాయి. రోజువారీ విచారణలో భాగంగా కేసులను మరింత వేగంగా పరిష్కరించనున్నారు. కొత్త బిల్లు ప్రకారం.. కేసు నమోదయ్యాక మూడు నెలల్లో తీర్పును వెలువరించాలి. హైకోర్టులో అప్పీల్ దాఖలు చేసుకునేందుకు 30 రోజుల గడువు నిర్ణయించారు. అప్పీల్‌పై కూడా 90 రోజుల్లోనే తీర్పు ఇవ్వాల్సి ఉంటుంది. పరీక్షల్లో పారదర్శకతను పెంచడం సహా ప్రశ్నపత్రాల లీకేజీలను పూర్తిగా అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల పలుమార్లు చెప్పారు. నయా టెక్నాలజీ ద్వారా పరీక్షల భద్రతను మరింత పటిష్ఠం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెంచడం సహా సాంకేతిక సంస్కరణలు, దీర్ఘకాలిక నిర్మాణాత్మక మార్పులపై సిఫార్సులు చేసేందుకు నందన్ నీలేకణి ఆధ్వర్యంలో ఆరుగురు సభ్యులతో ఓ ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటుచేసింది కేంద్రం. దీంతో పాటు కేంద్ర విద్యాశాఖ లోనూ మార్పులు చోటుచేసుకున్నాయి. నూతన విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ప్రహ్లాద్ జోషి.. పరీక్షల నిర్వహణలో పారదర్శకత, బాధ్యతాయుత వ్యవస్థను బలోపేతం చేస్తామని చెప్పారు.కాగా.. పరీక్షల అక్రమాలపై కేంద్రం ఇప్పటికే పాలనాపరమైన చర్యలు ప్రారంభించింది. జాతీయ పరీక్షల సంస్థ(ఎన్‌టీఏ)లో 47 మంది అధికారులను తొలగించినట్లు సమాచారం. అలాగే పరీక్షల నిర్వహణ విధానంలో మార్పులు, ఔట్‌సోర్సింగ్ వ్యవస్థలో సంస్కరణలు, సాంకేతిక భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ నేడు ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. విపక్షాల ఆందోళనల నడుమే ఈ బిల్లు సభ ముందుకు వచ్చింది. అనంతరం లోక్‌సభ మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడింది. ఈ బిల్లుపై సూచనలను మధ్యాహ్నం ఒంటిగంటల వరకు సమర్పించవచ్చని స్పీకర్ ఓంబిర్లా సభ్యులకు తెలిపారు. అలా సవివర చర్చకు తగిన సమయం ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ బిల్లు ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమైందని, దీనిపై చర్చ నుంచి సభ దృష్టి మళ్లకుండా చూడాలని విపక్షాలకు సూచించారు. మరోవైపు, ఈ బిల్లుపై ప్రతిపక్షాలు విమర్శలు వ్యక్తం చేస్తున్నాయి. ఈ బిల్లుపై ప్రతిపక్షాలు విమర్శలు వ్యక్తం చేస్తున్నాయి. ఇదంతా పైపై మెరుగు అని మండిపడ్డాయి. అదే సమయంలో ధర్మేంద్ర ప్రధాన్‌కు పార్లమెంట్‌లో ఘన స్వాగతం పలకడాన్ని తప్పుపట్టాయి. జులై 20న 'చలో సంసద్' పేరిట చేపట్టిన నిరసనల్లో విద్యార్థులపై లాఠీఛార్జి చేయడాన్ని ఖండించాయి. దానిపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని విపక్ష నేతలు డిమాండ్ చేశారు. నీట్ సహా పలు పరీక్షల పేపర్‌లు లీక్ కావడంతో దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతోన్న సంగతి తెలిసిందే. దాంతో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఈ క్రమంలోనే కేంద్రం తాజా బిల్లును తీసుకొచ్చింది.

## విద్యారంగ సమస్యల పరిష్కారంలో అలసత్వం

### ఫీజు రియంబర్స్‌మెంట్ చెల్లింపులో ప్రభుత్వం విఫలం: రామచందర్ రావు

హైదరాబాద్,జులై 27(జనంసాక్షి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా విద్యార్థి, యువత జీవితాలతో సీఎం రేవంత్ రెడ్డి చెలగాటమాడుతున్నారని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు మండిపడ్డారు. మరోవైపు యువత ఎన్నికల్లో పోటీ చేసేలా వయసును 21 ఏళ్లకు తగ్గించాలని కొత్త డ్రామా షురూ చేశారని విమర్శించారు. ఈ క్రమంలో విద్యాశాఖ వైఫల్యాన్ని అంగీకరిస్తూ యువ ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి విద్యాశాఖను కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యాశాఖ, హోంశాఖ, న్యాయశాఖ తదతర శాఖలను సిఎం సమర్థంగా నిర్వహించలేకపోతున్నారని ఆయన మీడియా సమావేశంలో మండిపడ్డారు. అలాగే కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఖర్గేను తీసేసి యువనేతను ఎన్నుకోవచ్చు కదా..? అని ప్రశ్నించారు. భాజపా జాతీయ అధ్యక్షుడిగా యువ నాయకుడు నితిన్ నబీన్‌ను చేశామని గుర్తు చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశాన్ని డైవర్ట్ చేయడానికే.. 21 ఏళ్లకు పోటీ అంశాన్ని తెరపైకి తెచ్చారని విమర్శించారు. యువతకు నిరుద్యోగ భృతి, స్కూటీ, రెండు లక్షల ఉద్యోగాలు ఎక్కడికి వెళ్లాయో చెప్పాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి... విద్యా శాఖ మంత్రి పదవికి రాజీనామా చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసి నిజాయితీ చాటుకున్నారని, తెలంగాణలో రూ.12 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి చెల్లించకుండా తాత్సారం చేస్తున్న రేవంత్ రెడ్డి విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేసి చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. విద్యార్థులు, యువత జీవితాలతో చెలగాటమాడుతున్న రేవంత్ రెడ్డి సర్కార్ క్యాండిల్ ర్యాలీలు చేయడం సిగ్గుచేటని, భవిష్యత్తులో అదే క్యాండిల్‌తో విద్యార్థులు, యువత వారిని తగలబెడతారన్నారు. ఢిల్లీలో జరిగిన విద్యార్థుల నిరసనల్లో విదేశీ హస్తం ఉందని ఆరోపించారు. యువత, కాంగ్రెస్ నిరసనలతో కేంద్రం దిగి వచ్చిందనే మాటలు అవాస్తమన్నారు. యువతకు 21 ఏళ్లకే ఎమ్మెల్యేలు, ఎంపీలుగా పోటీ చేసే అవకాశం ఇవ్వాలన్న రేవంత్ వ్యాఖ్యలను రాంచందర్‌రావు ఖండించారు. ఎన్నికల వయోపరిమితిపై నిర్ణయం తీసుకునే అధికారం సీఎంకు లేదని, ఈ అంశం కేంద్ర ఎన్నికల సంఘం, కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉంటుందన్నారు. యువతను తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు మానుకోవాలని సూచించారు.

## ఆర్థిక ఇబ్బందులున్నా 'అల్పాహార పథకం'



ప్రతిరోజూ అల్పాహారం అందించడం చిన్న విషయం కాదని, ఇది దేశంలోనే కాక ప్రపంచ స్థాయిలో కూడా అరుదైన కార్యక్రమమని వ్యాఖ్యానించారు. ఈ పథకాన్ని రాబోయే మూడు నెలల్లో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు విస్తరిస్తామని తెలిపారు. విద్యార్థులకు వారంలో మూడు రోజులు పాలు, మరో మూడు రోజులు రాగి జావ అందించేలా మెనూను రూపొందించామని వెల్లడించారు. పాలన అంటే అధికారం చెలాయించడం కాదని.. ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడమే నిజమైన పాలన అని భట్టి విక్రమార్క అన్నారు. ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులకు అందించిన సమయంలో వారి కళ్లలో కనిపించిన ఆనందమే ప్రభుత్వ పనితీరుకు నిజమైన గుర్తింపు అన్నారు. మధిర ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వాటిని పరిష్కరిస్తామని ఇచ్చిన హామీలను ఇప్పుడు అమలు చేస్తున్నామని చెప్పారు. రైతుల ఖాతాల్లో తొమ్మిది రోజుల్లోనే రూ.9 వేల కోట్లు రైతు భరోసా నిధులు జమ చేశామని, మహిళలకు ప్రతి ఏడాది రూ.20 వేల కోట్ల వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని వెల్లడించారు. అలాగే రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద చికిత్స పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినట్లు గుర్తు చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఉచితాలుగా అభివర్ణించడం సరైంది కాదని.. అలా మాట్లాడేవారు పూర్తి అవగాహన లేకుండా వ్యాఖ్యానిస్తున్నారని భట్టి విమర్శించారు. మధిర ప్రజలు తనను గెలిపించడంతోనే కాంగ్రెస్ పార్టీ తనకు డిప్యూటీ సీఎం బాధ్యతలు అప్పగించిందని వారికి కృతజ్ఞతలు తెలిపారు. అల్పాహార పథకం కేవలం మధిర నియోజకవర్గానికే పరిమితం కాదని, తెలంగాణలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో దశలవారీగా అమలు చేయనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

## సింగరేణిని భ్రష్టు పట్టించిన కేసీఆర్

### కాంగ్రెస్ వచ్చినా మారని పరిస్థితి: కిషన్ రెడ్డి

**న్యూఢిల్లీ,జూలై27(జనంసాక్షి):** గత బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణికి తీవ్ర నష్ట చేకూర్చిందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా సింగరేణి మెరుగుపడటం లేదని వ్యాఖ్యానించారు. కేంద్రం 49 శాతం, తెలంగాణ ప్రభుత్వం 51 శాతం వాటాతో సింగరేణి కొనసాగుతోందని కేంద్ర మంత్రి తెలిపారు. దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద బొగ్గు కంపెనీ సింగరేణి అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. సింగరేణి నుంచి కర్ణాటక, ఏపీ, మహారాష్ట్ర, ఎన్‌టీపీసీ కి బొగ్గు సరఫరా అవుతుందని తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్.. సింగరేణికి తీరని ద్రోహం చేశారని కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి ఆదాయానికి గత ప్రభుత్వం గండికొట్టిందని ఆరోపించారు. రాజకీయ వేదికలకు సింగరేణిని వాడుకున్నారంటూ బీఆర్ఎస్, కేసీఆర్‌పై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వింత ప్రవర్తన, మొండి వైఖరి వల్లే సింగరేణి సంస్థ తీవ్రంగా నష్టపోయిందని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2014లో సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా బొగ్గు గనులను పారదర్శకంగా వేలం పాట ద్వారా కేటాయించాలని ఆదేశించినప్పటికీ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం వేలం పాటల్లో పాల్గొనకుండా నిర్లక్ష్యం వహించిందన్నారు. నూతన బొగ్గు బ్లాకులు లభించక, ఆదాయ మార్గాలు మూసుకుపోయి సింగరేణి వెనుకబడిపోవడానికి కేసీఆర్ ద్రోహమే కారణమని ఆయన ఆరోపించారు. సంస్థను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్నారని, గతంలో కేంద్రం ఇచ్చే రూ. 525 కోట్ల నిధులను సక్రమంగా వినియోగించుకోలేకపోయారని విమర్శించారు. 2015లోనే ఒడిశాలోని నైని కోల్ బ్లాక్‌ను కేంద్ర ప్రభుత్వం సింగరేణికి కేటాయించినప్పటికీ, నాటి కేసీఆర్ ప్రభుత్వం ఒడిశా ముఖ్యమంత్రితో కనీసం మాట్లాడలేదని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. అయితే, ఇటీవల ఒడిశాలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తాము చొరవ తీసుకుని నైని కోల్ బ్లాక్‌కు సంబంధించి అవసరమైన అన్ని అనుమతులను ఇప్పించినట్లు వెల్లడించారు. అలాగే తాడిచర్ల-2 బ్లాక్‌ను కూడా కేంద్రం సింగరేణికి కేటాయించిందని, మణుగూరులోని ఒక బ్లాక్‌ను వేలంలో ఉంచామని తెలిపారు.అయితే ఈ వేలంలో సింగరేణికి పోటీగా తెలంగాణ జెన్కో పాల్గొనడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. జెన్కో టెండర్ నుంచి తప్పుకుని, ఆ బ్లాకులు సింగరేణికి దక్కేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్యలు తీసుకోవాలని కోరారు.

# ప్రతి వర్షపు నీటి బొట్టును ఒడిసిపట్టేందుకు ఆడబిడ్డలంతా నడుం బిగించాలి

- మంత్రి సీతక్క
- తెలంగాణ జలసిరిని ఉద్యమంలా విజయవంతం చేద్దాం



**ములుగు ప్రతినిధి, జులై 27(జనంసాక్షి) :** దేశవ్యాప్తంగా నెలకొన్న ఎల్ నినో పరిస్థితుల దృష్ట్యా నీటి సంరక్షణను ప్రజా ఉద్యమంగా మార్చాల్సిన అవసరం ఉందని తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క పిలుపునిచ్చారు. ముఖ్యంగా తెలంగాణలోని మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు ఈ కార్యక్రమంలో ముందుండి పాల్గొని ప్రతి వర్షపు నీటి బొట్టును ఒడిసిపట్టేందుకు కృషి చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. వర్షపు నీటిని వృథా కాకుండా భూమిలోకి ఇంకేలా చర్యలు తీసుకోవడం ద్వారా భూగర్భ జలాలను పెంపొందించవచ్చని మంత్రి పేర్కొన్నారు. రానున్న తరాలకు నీటి భద్రత కల్పించాలంటే ఇప్పటి నుంచే ప్రతి గ్రామం, ప్రతి కుటుంబం జల సంరక్షణ బాధ్యతను స్వీకరించాలని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన తెలంగాణ జలసిరి కార్యక్రమాన్ని ప్రజల భాగస్వామ్యంతో ఉద్యమంగా విజయవంతం చేయాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. మహిళా సంఘాలు గ్రామాల్లో అవగాహన కల్పిస్తూ నీటి సంరక్షణ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి పొలానికి పంట కుంట, ప్రతి ఊరికి ఊట కుంట నిర్మించాలనే లక్ష్యంతో అందరూ కలిసి పనిచేయాలని ఆమె అన్నారు. ఈ నిర్మాణాల ద్వారా వర్షపు నీటిని నిల్వ చేసి భూగర్భ జలాల మట్టాన్ని పెంచడంతో పాటు భవిష్యత్తులో నీటి కొరతను అధిగమించవచ్చని తెలిపారు. జల సంరక్షణ అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగిస్తూ, వర్షపు నీటి సంరక్షణకు తమ వంతు సహకారం అందించాలని కోరారు. 'జల సంరక్షణే మన భవిష్యత్తుకు భరోసా. తెలంగాణ జలసిరిని ప్రజలందరం కలిసి విజయవంతం చేద్దాం. ప్రతి వర్షపు నీటి బొట్టును ఒడిసిపట్టి సస్యశ్యామల తెలంగాణ నిర్మాణానికి మనమంతా భాగస్వాములు కావాలి' అని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు.

# చిన్నారుల భద్రత అత్యున్నత ప్రాధాన్యత

- ప్రజల విశ్వాసాన్ని చురగొనాలి
- విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన పోలీసులకు అభినందనలు
- మల్టీ జోన్-2 ఐజిపి షహ నవాజ్ ఖాసీం




**వికారాబాద్ జిల్లా బ్యూరో జూలై 27 (జనం సాక్షి):** వార్షిక తనిఖీలలో భాగంగా మల్టీ జోన్-2 ఐజీపీ షహనవాజ్ ఖాసీం, సోమవారం పరిగి పోలీస్ స్టేషన్‌ను సందర్శించి వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వికారాబాద్ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ స్నేహ మెహ్రా ఐజీపీకి బొకే అందించి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గౌరవ వందనం స్వీకరించిన ఐజీపీ పోలీస్ స్టేషన్ ఆవరణను పరిశీలించి తనిఖీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తనిఖీలో భాగంగా పోలీస్ అధికారులు, సిబ్బంది టర్న్అవుట్, క్రమశిక్షణ, విధి నిర్వహణ తీరు, ప్రజల పట్ల వ్యవహరించే విధానం, కార్యాచరణ సామర్థ్యాన్ని సమగ్రంగా పరిశీలించారు. ప్రతి పోలీస్ అధికారి, సిబ్బందితో వ్యక్తిగతంగా మాట్లాడి వారు నిర్వహిస్తున్న విధులు, ప్రజలకు అందిస్తున్న సేవలు, సాధించిన విజయాలు, ఎదురవుతున్న సమస్యల గురించి తెలుసుకున్నారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని ప్రత్యేకంగా అభినందిస్తూ, ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించేలా సేవలు అందించాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించిన ఐజీపీ వికారాబాద్ రక్షణ నేత్రంకార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల పనితీరు, ప్రత్యక్ష పర్యవేక్షణ వ్యవస్థ, నేరాల నియంత్రణలో వాటి వినియోగాన్ని పరిశీలించి పోలీసుల పనితీరును ప్రశంసించారు. పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు, కేసు ఫైళ్లు, స్టేషన్ డైరీలు, వివిధ రిజిస్టర్లు, మాల్ఖానా నిర్వహణ, రిసెప్షన్, లాక్అప్, కంప్యూటర్ విభాగం, మహిళా సహాయ కేంద్రం, సీసీటీఎన్ఎస్ నిర్వహణ, డిజిటల్ రికార్డుల నిర్వహణ తదితర విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. కేసుల దర్యాప్తు నాణ్యతను మరింత మెరుగుపరచాలని, పెండింగ్ కేసులను వేగవంతంగా పరిష్కరించాలని, ప్రతి కేసులో నాణ్యమైన సాక్ష్యాధారాల సేకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని, రికార్డుల నిర్వహణలో నిర్దేశిత ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు, సిబ్బందిని ఉద్దేశించి ఐజీపీ మాట్లాడుతూ, "ప్రతి పోలీస్ అధికారి తనలో ఉన్న సామర్థ్యాన్ని గుర్తించి నిరంతరం అభివృద్ధి చెందేందుకు కృషి చేయాలి. సరైన అలవాట్లు, క్రమశిక్షణ, శారీరక దృఢత్వం, మానసిక ఆరోగ్యం, సేవా దృక్పథం ప్రతి పోలీస్‌కు అత్యంత అవసరం. ప్రజలకు న్యాయం చేయడం, వారి విశ్వాసాన్ని నిలబెట్టడం ప్రతి పోలీస్ బాధ్యత" అని పేర్కొన్నారు. అదేవిధంగా సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో సైబర్ అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని, ఎన్ డి పి ఎస్ చట్టం కింద మాదకద్రవ్యాల నిర్మూలనకు మరింత కఠిన చర్యలు కొనసాగించాలని, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని, ప్రమాదం జరిగిన వెంటనే స్పందిస్తూ గోల్డెన్ అవర్ సమయంలో బాధితులకు తక్షణ వైద్య సహాయం అందేలా పోలీస్ అధికారులు వేగంగా స్పందించాలని, ప్రతి ప్రాణం విలువైనదనే భావనతో పనిచేయాలని సూచించారు. ప్రజలతో మరింత స్నేహపూర్వకంగా మెలుగుతూ కమ్యూనిటీ పోలీసింగ్‌ను బలోపేతం చేయాలని, గ్రామస్థాయిలో ప్రజలతో సమన్వయాన్ని పెంపొందించాలని, మహిళలు, చిన్నారుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని, శాంతిభద్రతల పరిరక్షణలో సాంకేతిక పరిజ్ఞానం, నిఘా వ్యవస్థలు, సీసీటీవీ నెట్‌వర్క్‌ను సమర్థవంతంగా వినియోగించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం పరిగి పోలీస్ స్టేషన్ ఆవరణలో ఐజీపీ మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి పోలీస్ అధికారి విధి నిర్వహణతో పాటు పర్యావరణ పరిరక్షణలోనూ తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ శ్రీ రాజేష్ మీనా, పరిగి డీఎస్పీ శ్రీనివాస్, పరిగి సీఐ కొండల్ రెడ్డి,పరిగి ఎస్ఐ మోహన కృష్ణ , ఇతర పోలీస్ అధికారులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సీఈఐఆర్ పోర్టల్ ద్వారా 10 మొబైల్ ఫోన్ల రికవరీ

- బాధితులకు అందజేసిన నర్సాపూర్ పోలీసులు



**నర్సాపూర్ జులై 27 (జనం సాక్షి) :** నర్సాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితుల ఫిర్యాదులపై నర్సాపూర్ పోలీసులు వేగంగా స్పందించి, సీఈఐఆర్ పోర్టల్ సహాయంతో మొత్తం 10 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి సోమవారం బాధితులకు అందజేశారు. నర్సాపూర్ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన బాధితుల ఫిర్యాదుల మేరకు ఎస్సై ఏ. రంజిత్ కుమార్ చొరవతో, పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఉమెన్ పోలీస్ కానిస్టేబుల్ రేణుక సీఈఐఆర్ పోర్టల్‌లో ఫోన్ల వివరాలను నమోదు చేశారు. అనంతరం సాంకేతిక ఆధారాలతో ఫోన్ల లొకేషన్‌ను గుర్తించి వాటిని ట్రేస్ చేసి బాధితులకు అప్పగించారు. తమ పోయిన మొబైల్ ఫోన్లు తిరిగి లభించడంతో బాధితులు హర్షం వ్యక్తం చేస్తూ, ఎస్సై ఏ. రంజిత్ కుమార్ తో పాటు ఉమెన్ పోలీస్ కానిస్టేబుల్ రేణుకను అభినందించి పోలీసు శాఖకు కృతజ్ఞతలు తెలిపారు.

# బోడుప్పల్ వక్ఫ్ భూముల పరిష్కారానికి కృషి చేస్తాం

- తెలంగాణ రక్షణ సేన వినతిపత్రం
- బాధితులకు హామినిచ్చిన కల్వకుంట్ల కవిత



**బోడుప్పల్ (జనంసాక్షి) :** మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండల పరిధిలోని బోడుప్పల్ ఉన్న 300.04 ఎకరాల భూమిపై తెలంగాణ వక్ఫ్ బోర్డు చేస్తున్న క్లెయిమ్ కారణంగా స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హామీ ఇచ్చారు. ఈ మేరకు ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థి నాయకుడు తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర కార్యదర్శి మంతెన మధు ఆధ్వర్యంలో తెలంగాణ రక్షణ సేన ప్రతినిధులు సోమవారం కవితను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. బోడుప్పల్ భూములపై నెలకొన్న వక్ఫ్ బోర్డు క్లెయిమ్ కారణంగా స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సమస్యకు సంబంధించిన చట్టపరమైన అంశాలను ప్రతినిధులు వివరించగా, కవిత వెంటనే న్యాయ నిపుణులను సంప్రదించి పూర్తి స్థాయిలో న్యాయపరమైన వివరాలు తెలుసుకున్నారు. సమస్య తీవ్రతను గుర్తించిన ఆమె, బాధితులకు న్యాయం జరిగేలా అన్ని కోణాల్లో పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కారం కోసం అవసరమైన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కల్వకుంట్ల కవిత సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కారానికి ముందుకు రావడాన్ని బోడుప్పల్ నివాసితులు స్వాగతించారు. ఈ సందర్భంగా ఆమెకు స్థానికులు, తెలంగాణ రక్షణ సేన నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

# విదేశీ యువతి పట్ల అసభ్య ప్రవర్తన

- హైదరాబాద్ టెక్కీపై కేసు

**హైదరాబాద్, జూలై27 (జనంసాక్షి) :** కొండాపూర్ ప్రాంతంలో విదేశీ యువతి పట్ల ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అసభ్యంగా ప్రవర్తించిన ఘటన వెలుగులోకి వచ్చింది. నెదర్లాండ్స్‌కు చెందిన యువతి తన బాయ్‌ఫ్రెండ్‌ను కలిసేందుకు మార్చి నెలలో భారత్‌కు వచ్చింది. ఆయువతి.. తన బాయ్‌ఫ్రెండ్‌తో కలిసి నివసిస్తుండగా, అదే ఇంట్లో మరో యువకుడు ఆదిత్య ఆనంద్ ఉంటున్నాడు. అతడు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో బాయ్‌ఫ్రెండ్ ఇంట్లో లేని సమయంలో ఆదిత్య ఆనంద్ తన పట్ల అసభ్యంగా ప్రవర్తించేవాడని నెదర్లాండ్స్ యువతి ఆరోపణలు చేసింది. యువకుడి చేష్టలతో విసిగిపోయిన యువతి.. భారత్ నుంచి తిరిగి నెదర్లాండ్స్‌కు వెళ్లి అక్కడి ఎంబసీకి ఫిర్యాదు చేసింది. మూడు రోజుల క్రితం యువతి తిరిగి హైదరాబాద్‌కు వచ్చింది. జరిగిన విషయాలన్నింటినీ గచ్చిబౌలి పోలీసులకు వివరించింది. యువతి ఫిర్యాదు ఆధారంగా ఆదిత్య ఆనంద్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ప్రస్తుతం యువకుడు పరారీలో ఉన్నాడు. యువకుడిని పట్టుకునేందుకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

# ఖారిజ్ ఖాతా నుండి తొలగించి ఆదుకోండి

- ప్రజావాణికి నిమ్జ్ భూ నిర్వాసితుల వినతి



**న్యాల్ కల్, జులై 27 (జనంసాక్షి) :** ప్రభుత్వం ఇచ్చిన భూమిలో సంవత్సరాల తరబడి సాగు చేస్తున్నామని.. ఉన్నట్టుండి ప్రభుత్వం ఇచ్చిన భూమిని ఖారిజ్ ఖాతాలోకి మార్చడంతో ఇబ్బందిగా మారిందని కోరుతూ.. న్యాల్ కల్ మండలం, న్యామతాబాద్ గ్రామానికి చెందిన పలువురు రైతులు సోమవారం జహీరాబాద్ లోని ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన "ప్రజావాణి"కి ఫిర్యాదు చేశారు. గత కొన్ని సంవత్సరాలు నుండి నేటి వరకు అట్టి భూమి తమ ఆధీనంలోనే ఉందని, సాగు చేస్తున్నామని వినతి పత్రంలో పేర్కొన్నారు. అధికారులు నేరుగా సర్వే చేపట్టి బాధిత రైతులను ఆదుకోవాలని కోరారు. జాతీయ ఉత్పాదక మండలి ప్రాజెక్టు ఏర్పాటు కోసం తమ భూములను స్వాధీనం చేసుకునేందుకు ఇలాంటి అభ్యంతరం లేదని, తమ పేరును మార్చి పరిహారం అందించాలని రైతుల కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో గ్రామ సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి, ఉప సర్పంచ్ జయరాజ్, రైతులు మారుతి, వీరన్న, సంగప్ప,గంగమ్మ, తదితరులున్నారు.

# మెట్రో ప్రయాణికలుకు మెరుగైన సేవలు

- మరింత సౌకర్యవంతంగా స్టేషన్లకు రూపకల్పన
- అదనపు మేనేజింగ్ డైరెక్టర్ బి. అజిత్ రెడ్డి

**హైదరాబాద్, జూలై27 (జనంసాక్షి) :** హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు మరింత మెరుగైన, సౌకర్యవంతమైన సేవలు అందించడమే లక్ష్యంగా హైదరాబాద్ మెట్రో రైల్ అదనపు మేనేజింగ్ డైరెక్టర్ బి. అజిత్ రెడ్డి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. స్టేషన్లను అన్ని విధాలా తీర్చిదిద్దేందుకు వెంటనే ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆయన సూచించారు. ఈ మేరకు బేగంపేట్ నుంచి రాయదుర్గ్ వరకు మెట్రోలో స్వయంగా ప్రయాణించి, పలు కీలక స్టేషన్లను, అక్కడి వీధి స్థాయి వసతులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పర్యటనలో భాగంగా బేగంపేట్, అమీర్ పేట్, రాయదుర్గ్ మెట్రో స్టేషన్లలోని ప్లాట్‌ఫామ్‌లు, కాంకోర్స్ ప్రాంతాలను అజిత్ రెడ్డి సందర్శించారు. అక్కడ ప్రయాణికులకు అందుతున్న సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లపై మెట్రో ఇంజనీర్లు , ఆపరేషన్ల నిర్వాహక సంస్థ కియోలిస్ అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాయదుర్గ్ వద్ద ఉన్న స్కైవాక్, ఐటీ కంపెనీలకు ఉన్న కనెక్టివిటీ మార్గాలు , మైండ్‌స్పేస్ జంక్షన్ వద్ద ప్రయాణికుల రాకపోకలను ఆయన ప్రత్యేకంగా పరిశీలించారు. ఉదయం, సాయంత్రం రద్దీ వేళల్లో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మరింత పక్కా ప్రణాళికతో ఏర్పాట్లు చేయాలని, అలాగే స్టేషన్ల కింద ఉన్న వాణిజ్య సముదాయాల నిర్వహణ సరిగ్గా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. మెట్రో స్టేషన్ల కింద ఉన్న పార్కింగ్ స్థలాల వినియోగాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని, బేగంపేట్, అమీర్ పేట్, రాయదుర్గ్ పార్కింగ్ ఏరియాలను పరిశీలించి అభివృద్ధికి తగిన సూచనలు చేశారు. అలాగే, పిల్లర్ల మధ్య ఉన్న సెంట్రల్ మెరిడియన్ నిర్వహణ , పారిశుధ్య స్థితిగతులపై ఆయన సమీక్షించారు. ప్రయాణికులకు ఇచ్చే సేవలలో స్వచ్ఛత, పనుల నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని స్పష్టం చేశారు. నిర్వహణ చూసే ఏజెన్సీల పనితీరును ఇంకా మెరుగుపరచాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మెట్రో స్టేషన్లను మరింత మోడల్‌గా తీర్చిదిద్దేందుకు స్థానిక అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని అజిత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఇందులో భాగంగా ప్రయోగాత్మకంగా మొదటి విడతలో 10 మెట్రో స్టేషన్లను ఎంపిక చేసి, వాటిని అన్ని రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేయడానికి వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. రాబోయే రోజుల్లో మిగిలిన అన్ని మెట్రో స్టేషన్లను కూడా స్వయంగా సందర్శించి, ప్రయాణికులకు అందే సౌకర్యాలు, పార్కింగ్, పారిశుధ్యం , భద్రతను క్రమం తప్పకుండా సమీక్షిస్తానని తెలిపారు. నగరవాసులకు అత్యంత సురక్షితమైన , ప్రశాంతమైన ప్రయాణ అనుభవాన్ని అందించడమే తమ మొదటి ప్రాధాన్యత అని ఆయన ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

# లారీని ఢీకొన్న బస్సు

- ప్రయాణికులకు తప్పిన ముప్పు

**జోగులాంబ గద్వాల, జూలై27 (జనంసాక్షి) :** జిల్లాలో సోమవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఉండవెల్లి మండలం ఇటిక్యాలపాడు స్టేజీ సమీపంలోని ఘర్ దాబా వద్ద ఓ లారీని ప్రైవేటు ట్రావెల్స్ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. ప్రమాదానికి కారణమైన బస్సును ఇంటర్‌సిటీ స్మార్ట్ బస్సుగా గుర్తించారు. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాద సమయంలో బస్సులో 40 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రమాద తీవ్రత ఎక్కువగానే ఉన్నప్పటికీ.. బస్సులో ఎవరికీ ఎటువంటి గాయాలు కాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

# ఆగస్టులో అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు

- కసరత్తు చేస్తున్న ప్రభుత్వం

**హైదరాబాద్, జూలై27 (జనంసాక్షి) :** రాష్ట్ర శాసనసభ వర్షాకాల సమావేశాలను ఆగస్టులో నిర్వహించే అవకాశం ఉన్నది. మార్చిలో బడ్జెట్ సమావేశాలు ముగిసిన తర్వాత ఇప్పటి వరకు సమావేశాలు జరుగలేదు. సాధారణంగా సమావేశానికి, సమావేశానికి మధ్య ఆరు నెలలు మించవద్దు. ఈ లెక్కన సెప్టెంబర్‌లోపు శాసనసభ సమావేశాలు జరుగాల్సి ఉన్నది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆగస్టులో కనీసం వారం రోజులపాటు శాసనసభ సమావేశాలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నది. అన్నీ అనుకూలిస్తే ఆగస్టు 17 నుంచి సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలుస్తున్నది. లేక పోతే ఆగస్టు 24 నుంచి జరగవచ్చని అంటున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ఆదివారం కొన్ని జాతీయ మీడియా చానళ్లతో మాట్లాడుతూ.. ఆగస్టులో శాసనసభ సమావేశాలు పెడ్తామని, ఈ సమావేశాల్లో.. ఎంపీ, ఎమ్మెల్యేలుగా పోటీచేసే వారి కనీస వయోపరిమితిని 25 ఏండ్ల నుంచి 21 సంవత్సరాలకు తగ్గించాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ ఒక తీర్మానం పంపిస్తామని తెలిపారు. ఈ సమావేశాల్లో మరికొన్ని తీర్మానాలు, బిల్లులు పెట్టే అవకాశం ఉన్నది. శాసనసభ, శాసనమండలిలో ఆధునీకరించిన భవన సముదాయాలను సీఎం రేవంత్‌రెడ్డి ఆగస్టులో ప్రారంభించనున్నారు. ఇటీవల శాసనసభకు వచ్చిన రేవంత్‌రెడ్డి.. పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ సెంట్రల్ హాల్ సహా మంత్రుల చాంబర్ల పునర్నిర్మాణ పనులను ఆగస్టు 10లోగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.

# బంగాఖాతంలో అల్పపీడన ప్రభావం

- తెలంగాణ జిల్లాల్లో వర్షాలకు ఛాన్స్



**హైదరాబాద్, జూలై27 (జనంసాక్షి) :** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తెలంగాణలో వచ్చే నాలుగు నుంచి ఐదు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఐఎండీ అంచనాల ప్రకారం సోమవారం రాష్ట్రంలోని ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాలైన ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల్లో మధ్యాహ్నం తర్వాత నుంచి రాత్రి వరకు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అదేవిధంగా నిజామాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, మెదక్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, సిద్ధిపేట, జనగామ, కరీంనగర్, హనుమకొండ, వరంగల్, నారాయణపేట జిల్లాల్లో విస్తారంగా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. మిగతా జిల్లాల్లో అక్కడక్కడా చిరుజల్లులు నుంచి తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయం కావడం, వాగులు, వంకలు పొంగిపొర్లడం, రహదారులపై నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం ఏర్పడే అవకాశముందని ఐఎండీ హెచ్చరించింది. అత్యవసర పరిస్థితులు మినహా వరద ప్రవాహాలు ఉన్న ప్రాంతాలకు వెళ్లొద్దని, ప్రజలు వాతావరణ శాఖ సూచనలను పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. వాయవ్య బంగాళాఖాతం దానికి ఆనుకొని ఉన్న ఉత్తర ఒడిశా-పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాలపై ఏర్పడిన అల్పపీడనం ఆదివారం వాయుగుండంగా మారిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఇది రాబోయే 24 గంటల్లో తీవ్ర వాయుగుండంగా బలపడే అవకాశం ఉన్నదని పేర్కొన్నది. ఈ వాయుగుండం సోమవారం పారాదీప్-సాగర్ ద్వీపాల మధ్య ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరాలను దాటుతుందని వెల్లడించింది. దీని ప్రభావంతో 31వరకు రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, పిడుగులతోపాటు కూడిన వర్షాలు కురుస్తాయని వివరించింది. కాగా, జూలైలో రాష్ట్రంలో 43శాతం లోటు వర్షపాతం నమోదైనట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొన్నది. సాధారణ సగటు వర్షపాతం 227.4 మి.మీ కురువాల్సి ఉండగా, 109.7 మి.మీ కురిసిందని తెలిపింది.

# యశోదలో పెద్దికి మంత్రి సీతక్క పరామర్శ



**హైదరాబాద్, జూలై27 (జనంసాక్షి) :** మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్తితిపై మంత్రి సీతక్క ఆరా తీసారు. కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం తెలిపారు. పెద్దిని పరామర్శించేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, మంత్రి సీతక్క యశోద ఆస్పత్రికి చేరుకున్నారు. కేటీఆర్ డాక్టర్లతో మాట్లాడి పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని, ఆయనకు అందుతున్న చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంసభ్యులను పరామర్శించిన కేటీఆర్, మంత్రి సీతక్క వారిలో మనోధైర్యాన్ని నింపారు. కేటీఆర్ వెంట పలువురు బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు. రెండు రోజుల క్రితమే యశోద హాస్పిటల్‌లో వైద్య పరీక్షలు చేయించుకున్న పెద్దికి ఆదివారం హనుమకొండలోని ఇంట్లో ఉదయం 7 గంటలకు తీవ్రమైన గుండెపోటు రాగా.. ఆయన భార్య స్వప్న వెంటనే దగ్గరలోని రోహిణి హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. కార్డియాలజిస్ట్ మమతారెడ్డి నేతృత్వంలో వైద్యుల బృందం వేగంగా స్పందించి అత్యవసర వైద్యం అందించారు. అత్యవసర సీపీఆర్ అనంతరం మెరుగైన వైద్యం కోసం పెద్ది సుదర్శన్ రెడ్డిని గ్రీన్ ఛానల్ ద్వారా హైదరాబాద్‌లోని యశోద దవాఖానకు తరలించారు.

## కొల్వాయి ఎత్తిపోతలను ప్రారంభించండి : జీవన్‌రెడ్డి

**జగిత్యాల, జూలై27 (జనంసాక్షి) :** జగిత్యాల జిల్లాలోని బీర్పూర్ మండలం కొల్వాయి మండలం ఎత్తిపోతల పథకాన్ని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి సోమవారం రైతులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కాలిపోయిన మోటార్లను పరిశీలించారు. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడం తో నీళ్లు అందక సాగు చేయడం లేదని రైతులు వాపోయారు. విద్యుత్ డీఈ, ఎస్ఈలతో జీవన్ రెడ్డి ఫోన్లో మాట్లాడారు. కొల్వాయి ఆరేపల్లి లో మోటార్లు మరమ్మతు చేయించాలన్నారు. ఏడాదికాలంగా మరమ్మతులు చేపట్టడం లేదన్నారు. అధికారులు అంచనాలు రూపొందించేది ఎప్పుడు? నీళ్లు అందించేది ఎప్పుడని ప్రశ్నించారు. రైతుల అదృష్టం కొద్ది కాలువలో నీళ్లు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకునేందుకు మోటర్లు మరమ్మతు చేపట్టి పంపులు వినియోగించాలని కోరారు.

# సిరిసిల్ల విద్యార్థికి కెటిఆర్ అండ



**హైదరాబాద్, జూలై27 (జనంసాక్షి) :** బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి తన ఔదార్యం చాటుచేసుకున్నారు. ఐఐటీ వారణాసిలో సీటు సాధించిన సిరిసిల్లకు చెందిన గడదాస్ అభినవ్‌కు గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమం ద్వారా ల్యాప్‌టాప్‌ను బహూకరించారు. కాలేజీ ఫీజును కూడా తానే భరిస్తానని హామీ ఇచ్చారు. సిరిసిల్లకు చెందిన గడదాస్ అభినవ్ తన తల్లిదండ్రులు లక్ష్మీనారాయణ, శ్రీలతతో కలిసి హైదరాబాద్‌లో కేటీఆర్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఐఐటీ వారణాసిలో సీటు సాధించిన అభినవ్‌ను కేటీఆర్ శాలువాతో సత్కరించారు. అనంతరం గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమం కింద ల్యాప్‌టాప్ అందజేశారు.

## పోలీసు చర్యలు చెప్పే
# నాగరికత పాఠం

సంపాదకీయం

*ఒక ప్రాంతం, ఒక దేశం ఎంతగా అభివృద్ధి చెందిందో తెలుసుకోవాలంటే దాని ఆర్థిక గణాంకాలో, ఆకాశాన్నంటే భవంతులో చూడనక్కర్లేదు. ఆ ప్రాంత పోలీసు వ్యవస్థ ప్రజలతో ఎలా మాట్లాడుతుంది? ఎలా ప్రవర్తిస్తుందనేదే అసలైన సూచిక. ఖాకీ దుస్తులు ధరించిన వ్యక్తి నోటి వెంట వచ్చే మాట, చేతిలోని కర్ర ఎలా కదులుతుందనేదే ఆ సమాజపు నాగరికతను నిర్ధారిస్తుంది. దురదృష్టవశాత్తు, ఇటీవలి "చలో పార్లమెంట్" ఉదంతం ఈ దేశపు పోలీసు వ్యవస్థ ఇంకా ఎంత వెనుకబడి ఉందో మరోసారి బట్టబయలు చేసింది.*

మహిళా విద్యార్థినులపై పోలీసులు చూపిన దుశ్చర్యలు యావత్ దేశాన్ని కలిచివేశాయి. పోలీస్ వ్యాన్‌లోకి బలవంతంగా ఎక్కిస్తూ, వెనుక నుంచి ఓ పోలీసు కర్రను ఓ యువతి శరీరంపై అసభ్యకరంగా ఉపయోగించడం, మరో అధికారి ఆమె ఛాతిపై చేయి వేయడం వంటి దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఇలాంటి దృశ్యాలు చూసిన ప్రతి ఒక్కరి కళ్లు చెమర్చాయి. ఇది కేవలం ఒక ఘటన కాదు.. రక్షించాల్సిన వ్యవస్థే దాడి చేసే స్థితికి దిగజారిన దుస్థితికి నిదర్శనం. యూనిఫారంలో ఉన్న చాలామంది పోలీసులు నేమ్ ప్లేట్లు లేకుండా విధులు నిర్వహించడం అనేక ప్రశ్నలకు తావిచ్చింది. సివిల్ దుస్తుల్లో లారీల నిండా బలగాలను మోహరించడం ఒక ప్రజాస్వామిక దేశపు పోలీసు వ్యవహార శైలిగా చెప్పగలమా? గుర్తింపు దాచిపెట్టుకుని, జవాబుదారీతనం లేకుండా వ్యవహరించే బలగాలు ప్రజాస్వామ్యానికి ప్రమాద సంకేతం. బాధ్యత నుంచి తప్పించుకునే ఉద్దేశంతోనే ఈ నేమ్‌ప్లేట్ల ఎగవేత జరిగిందా అనే అనుమానం వ్యక్తమవుతోంది.

బారికేడ్లకు ఇవతలి ఉన్న నిరసనకారులపై, అవతలి వైపు ఉన్నవారిపై కూడా విచక్షణారహితంగా లాఠీచార్జ్ చేయడం ఏ చట్టం ప్రకారం సమర్థనీయం? ఈ అంశంపై సాక్షాత్తు సీఆర్పీఎఫ్ డీజీపీనే మండిపడాల్సి రావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతుంది. తమ సొంత బలగాల తీరుపైనే ఉన్నతాధికారి అసంతృప్తి వ్యక్తం చేయాల్సి రావడం వ్యవస్థాగత వైఫల్యానికి స్పష్టమైన నిదర్శనం. రక్షించాల్సిన చేతులే హింసకు పాల్పడితే, ప్రజలు ఎవరిని నమ్ముకోవాలి?

నిరసన తెలిపే హక్కును కాపాడాల్సిన వ్యవస్థ, ఆ హక్కునే హరించే స్థాయికి దిగజారితే అది ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదమే. నేమ్‌ప్లేట్లు లేని బలగాలు, సభ్యత లేని ప్రవర్తన, మహిళలపై అమానుషమైన వ్యవహారం వంటి పరిణామాలు పోలీసు వ్యవస్థ ఎంత "అభివృద్ధి" చెందిందో.. అనే ప్రశ్నను లేవనెత్తుతున్నాయి. జవాబుదారీతనం, పారదర్శకత, మానవత్వం లేని పోలీసు వ్యవహార శైలి ఎంతటి ఆర్థికాభివృద్ధి సాధించినా ఆ సమాజాన్ని నాగరిక సమాజంగా నిలబెట్టలేదు. ఈ ఘటనలపై నిష్పక్షపాత విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడమే ఇప్పుడు ప్రభుత్వం ముందున్న ఏకైక మార్గం.

# చారు మజుందార్ నక్సల్బరీ స్ఫూర్తి


## నవభారత్ నిర్మాణానికి ప్రజల మార్గం

"విప్లవం చరిత్రను సృష్టించదు, చరిత్రే విప్లవాన్ని పిలుస్తుంది. కానీ ఆ పిలుపును వినిపించే నాయకులు అరుదుగా జన్మిస్తారు." భారత కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో కామ్రేడ్ చారు మజుందార్ అలాంటి నాయకుడు. ఆయన జీవితం కేవలం ఒక వ్యక్తి జీవితం కాదు; అది భారత సమాజంలోని అణచివేత, అసమానత, దోపిడీ, ప్రతిఘటనల మధ్య పుట్టుకొచ్చిన రాజకీయ ప్రవాహానికి ప్రతీక.

జూలై 28, 1972న పోలీసు కస్టడీలో చారు మజుందార్ మరణించారు. అధికారికంగా అది ఒక మరణం కావచ్చు. కానీ భారత ప్రజాస్వామ్య చరిత్రలో అది రాజ్య నిర్బంధం మరియు ప్రజా ప్రతిఘటన మధ్య ఉన్న వైరుధ్యాన్ని మరింత బహిర్గతం చేసిన సంఘటన. నేడు ఆయనను స్మరించడం అంటే కేవలం నివాళులు అర్పించడం కాదు. ఆయన లేవనెత్తిన ప్రశ్నలు నేటి భారతదేశంలో ఏ రూపంలో కొనసాగుతున్నాయో పరిశీలించడం.

నక్సల్బరీ పేలుడు భారత రాజకీయాల్లో ఒక కొత్త భాషను ప్రవేశపెట్టింది. భూమి కోసం పోరాడిన పేద రైతు, భూస్వామ్య అణచివేతను ఎదుర్కొన్న ఆదివాసీ, కుల వివక్షతో అణగారిన దళితుడు, నిరుద్యోగ యువకుడు, విద్య హక్కు కోసం పోరాడుతున్న విద్యార్థి.. వీళ్లందరినీ ఒకే రాజకీయ చర్చలో భాగం చేసిన చారిత్రక క్షణం నక్సల్బరీ. అందుకే నక్సల్బరీని ఒక ప్రాంతీయ తిరుగుబాటుగా మాత్రమే చూడలేం. అది భారత ప్రజాస్వామ్య అసంపూర్ణతకు వ్యతిరేకంగా లేచిన చారిత్రక స్వరం.

అయితే చరిత్రను గౌరవించడం అంటే దానిని ప్రశ్నించకుండా ఆరాధించడం కాదు. ప్రతి విప్లవోద్యమం తన కాలపు పరిమితులను కూడా మోస్తుంది. చారు మజుందార్ నాయకత్వంలోని ఉద్యమం వేలాది మంది యువతను విప్లవ రాజకీయాల వైపు ఆకర్షించింది. అదే సమయంలో ప్రజలతో దీర్ఘకాలిక అనుబంధం, విస్తృత ప్రజాసంఘాల నిర్మాణం, ప్రజాస్వామ్య వేదికల వినియోగం వంటి అంశాలపై తరువాతి అనుభవాలు కొత్త పాఠాలను నేర్పాయి. ఈ పాఠాల ఆధారంగానే భారత కమ్యూనిస్టు ఉద్యమంలోని అనేక ప్రవాహాలు తమ రాజకీయ అవగాహనను అభివృద్ధి చేసుకున్నాయి.



నేటి భారతదేశం 1967 భారతదేశం కాదు. వ్యవసాయ సంక్షోభం మరింత లోతుగా మారింది. కార్పొరేట్ మూలధనం గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై మరింత పట్టు సాధించింది. విద్య, వైద్యం, ఉపాధి, సహజ వనరులు మార్కెట్ ఆధీనంలోకి నెట్టబడుతున్నాయి. అదే సమయంలో కులవివక్ష, మత విద్వేషం, రాజ్యాంగ సంస్థలపై ఒత్తిడి, భావప్రకటన స్వేచ్ఛపై దాడులు ప్రజాస్వామ్యాన్ని కొత్త పరీక్షలకు గురిచేస్తున్నాయి.

ఇలాంటి సమయంలో నక్సల్బరీ స్ఫూర్తిని అర్థం చేసుకోవడం అంటే గతాన్ని పునరావృతం చేయడం కాదు; ప్రజల వాస్తవ జీవితాల్లో కొత్త రూపాలు దాల్చిన దోపిడీని గుర్తించి, దానికి వ్యతిరేకంగా కొత్త ప్రజా ఐక్యతను నిర్మించడం. రైతు పోరాటం, కార్మిక ఉద్యమం, విద్యార్థి–యువజన ఉద్యమం, మహిళా ఉద్యమం, దళిత ఆదివాసీ హక్కుల ఉద్యమం, ప్రజాస్వామ్య హక్కుల ఉద్యమం.. ఇవి విడివిడిగా కనిపించినా, సమానత్వ భారత నిర్మాణంలో ఇవన్నీ ఒకే ప్రవాహానికి చెందినవే.

చారు మజుందార్ వారసత్వాన్ని నేడు అర్థం చేసుకోవాలంటే ఒక విషయం స్పష్టంగా గుర్తించాలి: ప్రజలే చరిత్ర నిర్మాతలు. ఏ రాజకీయ సంస్థకైనా, ఏ నాయకుడికైనా ప్రజల భాగస్వామ్యం, ప్రజాస్వామిక చైతన్యం, సంఘటిత శక్తి లేకుండా సామాజిక మార్పు సాధ్యం కాదు. అందుకే నేటి సవాలు కేవలం ప్రతిఘటన కాదు. ప్రజల విశాల ఐక్యతను నిర్మించడం కూడా.

నవభారత్ నిర్మాణం అనేది కార్పొరేట్ లాభాలపై ఆధారపడిన అభివృద్ధి కాదు. భూమి, ఉపాధి, విద్య, ఆరోగ్యం, గౌరవప్రద జీవి తం, రాజ్యాంగ హక్కులు, కుల నిర్మూలన, లింగ సమానత్వం, లౌకి క ప్రజాస్వామ్యం.. ఈ విలువల సమాహారమే ప్రజల నవభారత్.

జూలై 28 మనకు ఒక బాధాకరమైన జ్ఞాపకాన్ని మాత్రమే కాదు, ఒక చారిత్రక బాధ్యతను కూడా గుర్తు చేస్తుంది. చారు మజుందార్‌ను స్మరించడం అంటే ప్రజల కోసం పోరాడే రాజకీయాలను సజీవంగా ఉంచడం. నక్సల్బరీని స్మరించడం అంటే సమాజంలోని ప్రతి అణగారిన వర్గం న్యాయం కోసం చేసే పోరాటాన్ని మన పోరాటంగా స్వీకరించడం.

అదే నిజమైన విప్లవ నివాళి. అదే నేటి భారతదేశానికి అవసరమైన ప్రజాస్వామిక, సమానత్వ, లౌకిక నవభారత్ దిశ.



- మామిండ్ల రమేష్ రాజా
7893230218

# ప్రజాస్వామ్యం: ఎన్నికలకు అతీతమైన భారత ప్రయాణం

భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం. 1950 జనవరి 26న రాజ్యాంగం అమల్లోకి వచ్చినప్పటి నుంచి భారత ప్రజాస్వామ్యం ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ, కాలానుగుణంగా తనను తాను పునర్నిర్మించుకుంటూ ముందుకు సాగుతోంది. కోట్లాది ప్రజలు, వందలాది భాషలు, అనేక మతాలు, సంస్కృతులు, విభిన్న రాజకీయ భావజాలాలు ఉన్న దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను నిరంతరాయంగా కొనసాగించడం భారతదేశం సాధించిన గొప్ప విజయంగా ప్రపంచం గుర్తిస్తోంది. అయితే ప్రజాస్వామ్యం అంటే కేవలం ఐదేళ్లకోసారి జరిగే ఎన్నికలు మాత్రమే కాదు. ఓటు హక్కు వినియోగంతో ప్రారంభమయ్యే ప్రజా స్వామ్యం, ఎన్నికల తర్వాత ప్రజల పట్ల ప్రభుత్వ జవాబుదారీతనం, పారదర్శక పాలన, స్వతంత్ర న్యాయవ్యవస్థ, స్వేచ్ఛాయుత మీడియా, చైతన్యవంతమైన పౌర సమాజం ద్వారా మాత్రమే పరిపూర్ణమ వుతుంది. ప్రజాస్వా మ్యానికి నిజమైన బలం రాజ్యాంగం ప్రసాదించి న విలువలను ప్రతి పౌరుడు ఆచరణలో నిలబెట్టడంలోనే ఉంది. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రూపకల్పన చేసిన భారత రాజ్యాంగం దేశ ప్రజాస్వామ్యానికి శాశ్వత పునాది. సమానత్వం, స్వేచ్ఛ, న్యా యం, సౌభ్రాతృత్వం అనే నాలుగు స్తంభాలపై నిర్మితమైన ఈ రాజ్యాంగం ప్రతి భారతీయుడికి సమాన హక్కులు కల్పించింది. కులం, మతం, భాష, ప్రాంతం అనే భేదాలకు అతీతంగా ప్రతి పౌరుడికి ఒకే ఓటు హక్కు కల్పించడం భారత ప్రజాస్వామ్య విశిష్టత.

ఇటీవలి కాలంలో భారత ఎన్నికల వ్యవస్థ సాంకేతికతను సమర్థంగా వినియోగిస్తోంది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, ఓటరు ధృవీకరణ విధానాలు, డిజిటల్ ఓటరు జాబితాలు, ఆన్‌లైన్ సేవలు ఎన్నికల నిర్వహణను వేగవంతం చేశాయి. ఎన్నికల సంఘం స్వతంత్రంగా పనిచేయడం ప్రజాస్వామ్య విశ్వసనీయతను బలోపేతం చేస్తోంది. అయితే అదే సమయంలో ఎన్నికల్లో డబ్బు ప్రభావం, కుల–మత రాజకీయాలు, అసత్య ప్రచారం, ద్వేషపూరిత ప్రచారం వంటి అంశాలు ప్రజాస్వామ్య నాణ్యతను దెబ్బతీస్తున్నాయన్న ఆందోళన కూడా పెరుగుతోంది. డిజిటల్ యుగం భారత ప్రజాస్వామ్యానికి కొత్త అవకాశాలు తీసుకొచ్చింది.అందువల్ల సమాచారాన్ని ధృవీకరించే బాధ్యత మీడియాతో పాటు ప్రతి పౌరుడిపైనా ఉంది.

స్థానిక సంస్థల బలోపేతం భారత ప్రజాస్వామ్యానికి మరో కీలక విజయంగా నిలిచింది. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, జిల్లా పరిషత్‌లు ప్రజలను పాలనలో భాగస్వాములను చేస్తున్నాయి. మహిళలకు, వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు కల్పించడం ద్వారా నాయకత్వ అవకాశాలు విస్తరించాయి. ప్రజాస్వామ్యం నిజంగా ప్రజల వద్దకు చేరాలంటే స్థానిక స్వపరిపాలన మరింత బలపడాలి. భారతదేశ యువత ప్రజాస్వామ్యానికి కొత్త శక్తి. డిజిటల్ అవగాహన, సామాజిక చైతన్యం, విద్యావకాశాల విస్తరణ వల్ల యువత ప్రజా సమస్యలపై స్పందిస్తోంది. అయితే ఈ శక్తి కేవలం సోషల్ మీడియా చర్చలకే పరిమితం కాకుండా ప్రజా విధానాలపై అధ్యయనం, ప్రజాస్వామ్య సంస్థల బలోపేతం, బాధ్యతాయుత రాజకీయ భాగస్వామ్యంగా మారాల్సిన అవసరం ఉంది.


ప్రజాస్వామ్యంలో న్యాయవ్యవస్థ, మీడియా, రాజ్యాంగ సంస్థలు స్వతంత్రంగా ఉండటం అత్యంత కీలకం. ఈ సంస్థలు బలహీన పడితే ప్రజాస్వామ్యం రూపంలో ఉన్నా, ఆత్మను కోల్పోతుంది. అధికారంలో ఎవరు ఉన్నారన్నది కంటే, రాజ్యాంగం అందరికీ సమానంగా అమలవుతుందా లేదా అన్నదే ప్రజాస్వామ్య విజయానికి అసలు కొలమానం.ఇక ముందు భారత ప్రజాస్వామ్యం ఎదుర్కొనే ప్రధాన సవాళ్లు కూడా చిన్నవి కావు. నిరుద్యోగం, ఆర్థిక అసమానత లు, పర్యావరణ సంక్షోభం, డిజిటల్ భద్రత, వ్యక్తిగత గోప్యత, ఎన్నికల పారదర్శకత వంటి అంశాలు ప్రజాస్వామ్య భవిష్యత్తును ప్రభావితం చేయనున్నాయి. వీటిని రాజ్యాంగ విలువల ఆధారంగా పరిష్కరించగలిగితేనే ప్రజాస్వామ్యం మరింత బలోపేతం అవుతుం ది. ప్రజాస్వామ్యం ప్రభుత్వానికి మాత్రమే చెందిన వ్యవస్థ కాదు; అది ప్రతి పౌరుడి బాధ్యత. ఓటు వేయడం, చట్టాలను గౌరవించ డం, ప్రజా ఆస్తులను పరిరక్షించడం, అధికారాన్ని ప్రశ్నించడం, బాధ్యతాయుతమైన చర్చల్లో పాల్గొనడం – ఇవన్నీ ప్రజాస్వామ్యాన్ని సజీవంగా ఉంచే పౌర ధర్మాలు. భారత ప్రజాస్వామ్యం ప్రపంచానికి ఒక ఆదర్శం కావాలంటే ఎన్నికల విజయాలకంటే రాజ్యాంగ విలువలు, సామాజిక న్యాయం, పారదర్శక పాలన, స్వేచ్ఛాయుత భావ వ్యక్తీకరణ, ప్రజల భాగస్వామ్యం మరింత బలపడాలి. ప్రజాస్వామ్యం ఒక గమ్యం కాదు; నిరంతర ప్రయాణం. ఆ ప్రయాణంలో ప్రభుత్వం మాత్రమే కాదు, ప్రతి పౌరుడు సహయాత్రికుడని గుర్తించినప్పుడే భారత ప్రజాస్వామ్యం మరింత సుస్థిరంగా, సమగ్రంగా, ప్రపంచానికి మార్గదర్శకంగా నిలుస్తుంది.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

## సంఘ సంస్కర్త, సామాజిక విప్లవకారుడు
# యుగకర్త డా॥ కత్తి పద్మారావు

భారతదేశ సామాజిక చరిత్రను పరిశీలిస్తే, కాలానుగుణంగా సమాజాన్ని ప్రశ్నించినవారు, అసమానతలను సవాలు చేసినవారు, అణగారిన వర్గాల గొంతుకగా నిలిచినవారే చరిత్రలో చిరస్థాయిగా నిలిచారు. అలాంటి అరుదైన మహనీయుల్లో మహాకవి డా. కత్తి పద్మారావు ఒకరు. ఆయన కేవలం కవి కాదు... కేవలం రచయిత కాదు... కేవలం ఉద్యమకారుడు కాదు... ఒక భావజాలం. ఒక సామాజిక తత్వవేత్త. ఒక యుగాన్ని ప్రభావితం చేసిన ఆలోచనా శిల్పి. అక్షరాన్ని ఆయుధంగా, సాహిత్యాన్ని సామాజిక మార్పుకు సాధనంగా, ఉద్యమాన్ని జీవిత ధర్మంగా మలుచుకున్న మహోన్నత వ్యక్తిత్వం.




భారతీయ సమాజాన్ని వేల సంవత్సరాలుగా పట్టిపీడిస్తున్న కులవ్యవస్థపై సైద్ధాంతికంగా, ఉద్యమపరంగా, సాహిత్యపరంగా నిరంతర పోరాటం చేసిన అరుదైన మేధావుల్లో డా. కత్తి పద్మారావు అగ్రగణ్యులు. రాజ్యాంగం సమానత్వాన్ని ప్రకటించినా, సామాజిక జీవితంలో కుల వివక్ష, అంటరానితనం, సామాజిక అసమానతలు కొనసాగుతూనే ఉన్నాయని ఆయన తన రచనల ద్వారా, ఉపన్యాసాల ద్వారా, ఉద్యమాల ద్వారా పదేపదే గుర్తు చేశారు. అందుకే ఆయన జన్మదినాన్ని "కుల నిర్మూలన దినోత్సవం"గా జరుపుకోవడం ఒక వ్యక్తి పుట్టినరోజు వేడుక మాత్రమే కాదు; సమానత్వ సమాజ నిర్మాణానికి ఇచ్చే సామాజిక ప్రతిజ్ఞగా భావించాలి.

డా. కత్తి పద్మారావు తొలి దశలో హేతువాద ఉద్యమంలో చురుకుగా పనిచేశారు. మూఢనమ్మకాలు, అంధవిశ్వాసాలు, మత ఛాందసవాదంపై ఆయన గళమెత్తారు. అయితే భారతీయ సమాజాన్ని లోతుగా అధ్యయనం చేసిన కొద్దీ, కేవలం హేతువాదం మాత్రమే సరిపోదని ఆయన గ్రహించారు. భారతదేశంలో అసమానతలకు మూలం కేవలం మతం కాదని, కులవ్యవస్థనే ప్రధాన కారణమని ఆయన తాత్వికంగా విశ్లేషించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే, పెరియార్ రామస్వామి నాయకర్, గురు రవిదాస్, బుద్ధుని తత్వాలను అధ్యయనం చేసి వాటిని సమకాలీన భారత సమాజంతో అనుసంధానించారు. ఈ పరిణామం ఆయన ఆలోచనలకు కొత్త దిశను చూపింది.

1985 జూలై 17న కారంచేడు గ్రామంలో జరిగిన దళితుల మారణకాండ తెలుగు రాష్ట్రాల సామాజిక చరిత్రలో ఒక కీలక మలుపు. ఆ సంఘటన అనంతరం రాష్ట్రవ్యాప్తంగా ఉద్భవించిన దళిత ఉద్యమానికి డా. కత్తి పద్మారా వు నాయకత్వం వహించారు. దళిత మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టి ఉద్యమాన్ని గ్రామాల నుంచి జాతీయ వేదికల వరకు విస్తరించారు. కారంచేడు కేవలం ఒక గ్రామంలో జరిగిన దాడి మాత్రమే కాదని, అది భారత కులవ్యవస్థ యొక్క క్రూరమైన రూపమని దేశానికి తెలియజేశారు. ఆ ఉద్యమం దళితుల ఆత్మగౌరవ పోరాటానికి కొత్త దిశను చూపింది.కారంచేడు తర్వాత చుండూరు హత్యాకాండ, ఇతర దళిత వ్యతిరేక దాడులపై కూడా ఆయన పోరాటం కొనసాగింది. దళితులపై జరిగే దాడులను వ్యక్తిగత సంఘటనలుగా కాకుండా, సామాజిక నిర్మాణంలో ఉన్న అసమానతల ఫలితంగా ఆయన విశ్లేషించారు.

డా. కత్తి పద్మారావు ప్రత్యేకత ఆయన ఉద్యమాల్లోనే కాదు; ఆయన సిద్ధాంతాల్లోనూ ఉంది. మార్క్సిజం వర్గ పోరాటాన్ని ప్రాధాన్యంగా చూసినట్లే, భారత సమాజంలో కులపోరాటం కూడా అంతే ముఖ్యమని ఆయన వివరించారు. వర్గ అసమానతలు తొలగితే కులవ్యవస్థ అంతరించిపోతుందని చెప్పే సిద్ధాంతాన్ని ఆయన ప్రశ్నించారు. కులం, వర్గం, లింగం, మతం, భాష, సంస్కృతి అన్నీ పరస్పర సంబంధిత అంశాలని, సమానత్వ సమాజం కోసం వీటన్నింటినీ సమగ్రంగా అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన విశ్లేషించారు.

స్త్రీ విముక్తి, దళిత విముక్తి, బహుజన చైతన్యం, బౌద్ధ మానవతావాదం, హేతువాదం వంటి అనేక భావజాలాలను సమన్వయం చేస్తూ ఆయన ప్రత్యామ్నాయ సామాజిక దృక్పథాన్ని నిర్మించారు. అందుకే ఆయనను కేవలం దళిత ఉద్యమ నాయకుడిగా మాత్రమే కాకుండా, సమగ్ర సామాజిక తత్వవేత్తగా కూడా చూడాల్సిన అవసరం ఉంది.


తెలుగు సాహిత్యంలో డా. కత్తి పద్మారావు చేసిన కృషి అసాధారణం. ఆయన కవిత్వం కేవలం భావోద్వేగాల వ్యక్తీకరణ కాదు; అది సామాజిక చరిత్రకు అద్దం. ఆయన వ్యాసాలు కేవలం విమర్శలు కాదు; ప్రత్యామ్నాయ సామాజిక ఆలోచనలకు పునాది. ఆయన గ్రంథాలు కేవలం పుస్తకాలు కాదు; సామాజిక ఉద్యమాలకు మార్గదర్శకాలు. దాదాపు తొంభైకి పైగా గ్రంథాలను రచించి తెలుగు సామాజిక సాహిత్యాన్ని కొత్త దిశలో నడిపించారు. ఆయన ప్రభావంతో దళిత సాహిత్యం, బీసీ సాహిత్యం, మైనారిటీ సాహిత్యం, స్త్రీవాద సాహిత్యం, బహుజన ఉద్యమ సాహిత్యం మరింత బలపడింది. వందలాది రచయితలు, వేలాది యువకులు, మేధావులు, ఉద్యమకారులు ఆయన ఆలోచనల ప్రభావంతో సామాజిక చైతన్య దిశగా అడుగులు వేశారు. దళిత రచయితల, కళాకారుల, మేధావుల ఐక్యవేదిక వంటి వేదికల ద్వారా తెలుగు సాహిత్యంలో ప్రత్యామ్నాయ ప్రవాహానికి ఆయన బలమైన పునాది వేశారు.

డా. కత్తి పద్మారావు రచనలు దేశ సరిహద్దులను దాటి అంతర్జాతీయ వేదికలకూ చేరాయి. దక్షిణాఫ్రికాలో జరిగిన డర్బన్ ప్రపంచ సదస్సులో భారత కులవ్యవస్థపై ఆయన చేసిన విశ్లేషణ విశేష ప్రాధాన్యం సంతరించు కుంది. లండన్ పార్లమెంట్‌తో పాటు అనేక అంతర్జాతీయ వేదికల్లో భారతదేశంలోని సామాజిక అసమానతలపై ఆయన ప్రసంగించారు. దళితు ల సమస్యను కేవలం స్థానిక అంశంగా కాకుండా, ప్రపంచ మానవ హక్కుల అంశంగా ప్రతిపాదించారు.

సామాజిక ఉద్యమాలు, సాహిత్య రంగం, తాత్విక విశ్లేషణ, రాజ్యాంగ విలువల ప్రచారం, మానవ హక్కుల పరిరక్షణ వంటి అనేక రంగాల్లో ఆయన చేసిన కృషికి అనేక పురస్కారాలు లభించాయి. అంబేద్కర్ అవార్డు, సినారె సాహిత్య పురస్కారం, తెలుగు విశ్వవిద్యాలయ పురస్కారం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్, మహాకవి బిరుదు, వైఎస్సార్ జీవన సాఫల్య పురస్కారం వంటి అనేక గౌరవాలు ఆయనను వరించాయి. అయితే ఆయన చేసిన సేవలతో పోలిస్తే ఈ పురస్కారాలన్నీ చిన్నవే అని ఆయన అభిమానులు భావించడం సహజం.

ఈ రోజు భారతదేశానికి అవసరమైనది ఆర్థికాభివృద్ధి మాత్రమే కాదు; సామాజిక సమానత్వం కూడా. సాంకేతిక ప్రగతి మాత్రమే కాదు; మానవ గౌరవం కూడా. రాజ్యాంగం ఇచ్చిన హక్కులు ప్రతి పౌరుడి జీవితంలో ఆచరణలోకి రావాలంటే కుల వివక్ష నిర్మూలన, సామాజిక న్యాయం, పరస్పర గౌరవం, సమాన అవకాశాలు బలపడాలి. ఇదే డా. కత్తి పద్మారావు జీవిత సందేశం. కుల నిర్మూలన అంటే ఏ కులాన్ని నిర్మూలించడం కాదు. కుల ఆధారిత వివక్షను నిర్మూలించడం. మనిషిని మనిషిగా గౌరవించడం. సమాన అవకాశాలు కల్పించడం. పరస్పర గౌరవంతో కూడిన ప్రజాస్వామ్య సమాజాన్ని నిర్మించడం. అదే అంబేద్కర్ కల. అదే పూలే కల. అదే పెరియార్ కల. అదే బుద్ధుని మానవతా సందేశం. అదే మహాకవి డా. కత్తి పద్మారావు జీవితాంతం ప్రచారం చేసిన సమానత్వ దర్శనం.

అందుకే ఆయనను కేవలం మహాకవిగా మాత్రమే కాదు, కుల నిర్మూలనకు అక్షరాయుధంగా, సామాజిక చైతన్యానికి మార్గదర్శిగా, తెలుగు సమాజాన్ని కొత్త దిశగా ఆలోచింపజేసిన యుగకర్తగా చరిత్ర చిరస్థాయిగా గుర్తుంచుకుంటుంది.



- బి ఎస్ రాములు
సామాజిక తత్వ వేత్త
ఫో: 8331966987

## ఈ వాషింగ్ మెషిన్ రాజకీయాలను –
# జన్–జీ యువతే ప్రక్షాళన చేయాలి

భారత రాజకీయాల్లో పార్టీ ఫిరాయింపులు కొత్త విషయం కాదు. అయితే గత దశాబ్దంలో ఈ పరిణామం కొత్త రూపు దాల్చింది. ఒకప్పుడు ప్రతిపక్ష పార్టీల్లో ఉండి అవినీతి ఆరోపణలు, దర్యాప్తు సంస్థల విచారణలు, కోర్టు కేసులు ఎదుర్కొన్న కొందరు ప్రముఖ నాయకులు తర్వాత భారతీయ జనతా పార్టీలో చేరడం, ఆపై ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి, రాష్ట్ర మంత్రి లేదా ఇతర కీలక పదవులు పొందడం రాజకీయ చర్చకు దారితీసింది. దీనిని ప్రతిపక్షాలు "వాషింగ్ మెషిన్ రాజకీయాలు"గా విమర్శిస్తే, బీజేపీ మాత్రం "చట్టం తన పని తాను చేసుకుంటుంది; పార్టీలో చేరడం వల్ల కేసులకు సంబంధం లేదు" అని చెబుతోంది.

అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ఒకప్పుడు కాంగ్రెస్‌లో అత్యంత ప్రభావశీల నాయకుడు. శారదా చిట్‌ఫండ్ కేసులో సీబీఐ ఆయనను ప్రశ్నించడంతో పాటు దర్యాప్తు జరిపింది. అనంతరం 2015లో ఆయన బీజేపీలో చేరారు. తరువాత అస్సాంలో బీజేపీకి ప్రధాన వ్యూహకర్తగా ఎదిగి ముఖ్యమంత్రి అయ్యారు. కేసు దర్యాప్తు పురోగతిపై ప్రతిపక్షాలు ప్రశ్నలు లేవనెత్తగా, బీజేపీ మాత్రం కేసు స్వతంత్రంగా నడుస్తోందని పేర్కొంది.

మహారాష్ట్రకు చెందిన అజిత్ పవార్ జాతీయవాద కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ)లో ఉన్న సమయంలో మహారాష్ట్ర స్టేట్ కోఆపరేటివ్ బ్యాంకు వ్యవహారంలో ఈడీ, ఆర్థిక నేరాల విభాగం విచారణకు గురయ్యారు. తరువాత ఆయన బీజేపీతో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేయగా ఉప ముఖ్యమంత్రి పదవి చేపట్టారు. సంబంధిత కేసుల పురోగతిపై అనేక రాజకీయ ప్రశ్నలు వచ్చా యి. అయితే దర్యాప్తు సంస్థలు చట్టపరమైన ప్రక్రియ ప్రకారమే వ్యవహరిస్తున్నామని తెలిపాయి.

పశ్చిమ బెంగాల్‌కు చెందిన సువేందు అధికారి తృణమూల్ కాంగ్రెస్‌లో కీలక నాయకుడిగా ఉండగా నారదా స్టింగ్ ఆపరేషన్ కేసులో సీబీఐ విచారణ ఎదుర్కొన్నారు. 2020లో బీజేపీలో చేరిన ఆయన తరువాత రాష్ట్రంలో బీజేపీ ప్రధాన ముఖచిత్రంగా ఎదిగి ప్రస్తుతం ముఖ్యమంత్రి పదవిని కూడా చేపట్టారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ అనుమతి, న్యాయపరమైన ప్రక్రియలు పెండింగ్‌లో ఉన్నాయని గతంలో వార్తలు వచ్చాయి.

జ్యోతిరాదిత్య సింధియా కాంగ్రెస్‌ను వీడి 2020లో బీజేపీలో చేరారు. ఆయనపై ప్రత్యక్ష అవినీతి కేసుల్లో చార్జిషీట్ దాఖలైన పరిస్థితి లేకపోయినా, పార్టీ మారిన వెంటనే కేంద్ర మంత్రివర్గంలో చోటు దక్కడం రాజకీయంగా పెద్ద పరిణామంగా మారింది. మధ్యప్రదేశ్‌లో ప్రభుత్వం మారడానికి కూడా ఆయన పాత్ర కీలకమైంది.

నారాయణ్ రాణే మొదట శివసేన, తరువాత కాంగ్రెస్, ఆపై బీజేపీలో చేరారు. ఆయనపై ఆదాయానికి మించిన ఆస్తులు, భూవివాదాలు తదితర అంశాలపై వివిధ దశల్లో ఆరోపణలు వచ్చాయి. వాటిలో కొన్ని విచారణ దశలో ఉండగా, కొన్ని కోర్టుల్లో నడుస్తున్నాయి. బీజేపీలో చేరిన తర్వాత కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. సమ్రాట్ చౌదరి బీహార్ రాజకీయాల్లో రాష్ట్రీయ జనతాదళ్, జనతాదళ్ (యునైటెడ్) తదితర పార్టీలలో పనిచేసి తర్వాత బీజేపీలో చేరారు. ఆయనపై ప్రధాన అవినీతి చార్జిషీట్‌ల కంటే రాజకీయ పునర్వ్యవస్థీకరణ ఎక్కువగా చర్చకు వచ్చింది. ప్రస్తుతం బీహార్‌లో బీజేపీ కీలక నాయకుల్లో ఒకరిగా ఉన్నారు. భజన్‌లాల్ శర్మ రాజస్థాన్‌లో బీజేపీకి చెందిన సుదీర్ఘకాల కార్యకర్త. ఆయనపై ప్రధాన అవినీతి కేసులు నమోదైనట్లు ప్రజా డొమైన్‌లో నిర్ధారిత సమాచారం లేదు. అయినప్పటికీ అనూహ్యంగా ముఖ్యమంత్రి కావడం రాజకీయ విశ్లేషణకు కారణమైంది. ఈ నాయకుల విషయంలో కూడా రాజకీయ ప్రత్యర్థులు అవినీతి ఆరోపణలు చేసిన సందర్భాలు ఉన్నప్పటికీ, అన్ని ఆరోపణలు చార్జిషీట్ లేదా శిక్షగా మారలేదు. భారత న్యాయవ్యవస్థలో ఆరోపణలు, ఎఫ్ఐఆర్, దర్యాప్తు, చార్జిషీట్, కోర్టు తీర్పు అనే దశలు వేర్వేరు. కాబట్టి ఆరోపణలు వచ్చాయని మాత్రమే ఎవరినైనా దోషిగా పరిగణించడం చట్టపరంగా సరైంది కాదు.



అయితే రాజకీయ విశ్లేషకులు గమనించిన అంశం ఏమిటంటే, కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, ఎన్‌సీపీ, శివసేన వంటి పార్టీల నుంచి వచ్చిన అనేక మంది నేతలకు బీజేపీలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి, రాష్ట్ర అధ్యక్షుడు వంటి కీలక బాధ్యతలు లభించాయి. అస్సాంలో హిమంత బిశ్వ శర్మ, మహారాష్ట్రలో అజిత్ పవార్, మధ్యప్రదేశ్‌లో జ్యోతిరాదిత్య సింధియా, పశ్చిమ బెంగాల్‌లో సువేందు అధికారి వంటి ఉదాహరణలు తరచూ చర్చకు వస్తుంటాయి. 2024లో ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ప్రచురించిన పరిశోధనాత్మక కథనం ప్రకారం, అవినీతి విచారణలు ఎదుర్కొంటూ తర్వాత బీజేపీలో చేరిన పలువురు నాయకుల కేసుల్లో దర్యాప్తు నెమ్మదించిందని లేదా గణనీయమైన పురోగతి కనిపించలేదని పేర్కొంది. అయితే సీబీఐ, ఈడీ అధికారులు "దర్యాప్తు పూర్తిగా ఆధారాల ప్రకారమే సాగుతుంది; అవసరమైనప్పుడు చర్యలు తీసుకుంటాం" అని స్పందించారు.

బీజేపీ మాత్రం ఈ విమర్శలను పూర్తిగా ఖండిస్తోంది. తమ పార్టీలో చేరిన ప్రతి నాయకుడూ ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగంగానే వచ్చారని, రాజకీయంగా ప్రజల తీర్పుతోనే పదవులు పొందారని చెబుతోంది. దర్యాప్తు సంస్థలు కేంద్ర ప్రభుత్వ నియంత్రణలో పనిచేయవని, కోర్టుల పర్యవేక్షణలోనే అనేక కేసులు కొనసాగుతున్నాయని పార్టీ వాదిస్తోంది. మరోవైపు ప్రతిపక్షాలు మాత్రం ఒకే వ్యక్తి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు "అవినీతిపరుడు", అధికార పార్టీలో చేరిన తర్వాత "సమర్థ నాయకుడు"గా మారడం ప్రజాస్వా మ్య నైతికతకు విరుద్ధమని విమర్శిస్తున్నాయి. అవినీతి ఆరోపణలపై ఒకే ప్రమాణం ఉండాలని, అధికార పార్టీ మార్పు వల్ల దర్యాప్తు వేగం మారకూడదని అవి అంటున్నాయి.

మొత్తం మీద ఈ పరిణామాలు భారత రాజకీయాల్లో ఒక కీలక ప్రశ్నను ముందుకు తెస్తున్నాయి. అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న నాయకులు పార్టీ మారిన తర్వాత ఉన్నత పదవులు పొందడం యాదృచ్ఛికమా? లేక అది రాజకీయ వ్యూహమా? అనే చర్చ కొనసాగుతోంది. దీనికి తుది సమాధానం రాజకీయ వాదనలతో కాకుండా, స్వతంత్ర దర్యాప్తు సంస్థల పనితీరు, కోర్టుల తుది తీర్పులు, ప్రజల ఎన్నికల తీర్పుల ద్వారానే లభిస్తుంది. ప్రజాస్వామ్యంలో వ్యక్తుల కంటే సంస్థల విశ్వసనీయతే అత్యంత కీలకమైనదనే విషయాన్ని ఈ ఉదంతాలు మరోసారి గుర్తు చేస్తున్నాయి. ఇకపై ఈ వ్యవస్థలో అవినీతిని ప్రక్షాళన చేసే సత్తా ఈ నవతరం జన్– జీ పైనే ఆధారపడి ఉంది.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

## భూ వివాదాలకు కోర్టు ద్వారానే శాశ్వత పరిష్కారం

- జిల్లా ఎస్పీ సునిత రెడ్డి

**వనపర్తి బ్యూరో, జూలై 27 (జనంసాక్షి) :** భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం కోర్టు ద్వారానే సాధ్యమని, చట్టాన్ని గౌరవించి న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని, జిల్లా ఎస్పీ సునిత రెడ్డి,ప్రజలకు సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎస్పీ ప్రజల నుంచి నేరుగా 25 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూ వివాదాల పేరుతో చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం, బెదిరింపులు, దౌర్జన్యాలు లేదా మోసాలకు పాల్పడితే పోలీసు శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో పారదర్శకత, నిష్పక్షపాత ధోరణి, వేగవంతమైన స్పందనతో పోలీసు శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అండగా ఉంటుందని తెలిపారు.ప్రజల భద్రత, న్యాయం పోలీసు శాఖ ప్రధాన బాధ్యత అని, ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజల ఫిర్యాదులను సమర్థవంతంగా పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు.స్వీకరించిన 25 ఫిర్యాదుల్లో 18 భూ వివాదాలు, ఒకటి భార్యాభర్తల వివాదం, ఆరు పరస్పర గొడవలకు సంబంధించినవి ఉన్నట్లు ఎస్పీ వెల్లడించారు.



# కుల వివక్ష, పేదరిక నిర్మూలనకు ఉద్యమిద్దాం

- మంద కృష్ణ మాదిగ
- 40 రోజుల పాటు గ్రామస్థాయి నుంచి ఎమ్మార్పీఎస్ పునర్నిర్మాణం
- యువతను ఉద్యమంలో భాగస్వామ్యం చేయాలని పిలుపు

**ముషీరాబాద్, జూలై 27 (జనం సాక్షి) :** దేశంలో కుల వివక్ష, పేదరికం నిర్మూలన కోసం భవిష్యత్ పోరాటాలకు సిద్ధం కావాలని ఎమ్మార్పీఎస్ (వీ౹ూా) వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. మాదిగలు విద్య, ఉద్యోగాలతో పాటు ఆర్థిక, రాజకీయ రంగాల్లో కూడా ఎదగాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం రాంనగర్‌లోని బీఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఇంజి వెంకట్‌స్వామి మాదిగ అధ్యక్షతన ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మంద కృష్ణ మాదిగ పాల్గొని ప్రసంగించారు. ఎస్సీ వర్గీకరణ కోసం సుదీర్ఘకాలం రాజీలేని పోరాటం నిర్వహించడం వల్ల నేడు మాదిగ యువత విద్య,




ఉద్యోగ రంగాల్లో గణనీయమైన ప్రయోజనాలు పొందుతోందని తెలిపారు. ఈ ఉద్యమానికి అన్ని రాజకీయ పార్టీలు, మేధావులు, సామాజిక వర్గాలు మద్దతు తెలిపాయని, అందువల్ల సమాజం పట్ల కూడా ఎమ్మార్పీఎస్‌కు బాధ్యత ఉందన్నారు. దేశంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలు పెరుగుతున్నాయని, కుల వివక్ష అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి అడ్డంకిగా మారుతోందని ఆయన అన్నారు. దేశ సంపదలో అన్ని వర్గాలకు సమాన భాగస్వామ్యం కల్పించి, కుల వ్యవస్థను నిర్మూలించే దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేశంలో అత్యధిక పేదరికం మాదిగల్లోనే ఉందని, రాజకీయంగా కూడా వారు వెనుకబడి ఉన్నారని పేర్కొన్న ఆయన, మాదిగలతో పాటు పీడిత వర్గాల ఆర్థిక, రాజకీయ సాధికారత కోసం భవిష్యత్‌లో ఉద్యమాలను చేపడతామని ప్రకటించారు. ఉద్యమాన్ని మరింత శక్తివంతం చేసేందుకు నేటి నుంచి 40 రోజుల పాటు గ్రామ, బస్తీ స్థాయిలో నూతన తరం విద్యార్థులు, యువతతో ఎమ్మార్పీఎస్ కమిటీలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. హైదరాబాద్‌లోని ప్రతి బస్తీలో యువతను ఉద్యమంలో భాగస్వామ్యం చేసి సంస్థను బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో గోవింద్ నరేష్ మాదిగ, చిలక ఎల్లయ్య మాదిగ, గండి కృష్ణ మాదిగ, ఎడవల్లి యాదయ్య మాదిగ, టీవీ నరసింహ మాదిగ, డప్పు మల్లికార్జున్ మాదిగ, మునిరాజు అరుణ్ కుమార్ మాదిగ, మాచర్ల ప్రభాకర్ మాదిగ, యాదాసి నర్సింగ్‌రావు మాదిగ, మునిరాతి రామకృష్ణ మాదిగ, పూజల్ల రవి మాదిగ, కిషన్ మాదిగ, బాల సాయిలు మాదిగ, రెడ్డపాక రవి మాదిగ, కొండపల్లి శివ మాదిగతో పాటు పలువురు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏసీబీ వలలో మోత్కూరు జిపిఓ

- 2000 లంచం తీసుకుంటూ పట్టుబడిన అధికారి
- కళ్యాణ లక్ష్మి దరఖాస్తు పరిశీలనకు 6000 లంచం డిమాండ్
- రంగారెడ్డి జిల్లా రేంజ్ ఏసీబీ డిఎస్పి ఆనంద్

**దోమ, జూలై 27 (జనం సాక్షి) :** ఎక్కడ చూసినా ఏమున్నది గర్వకారణం అన్నట్లు.. అటెండర్ నుంచి ఉన్నతాధికారి వరకు లంచం ఇవ్వనిదే ఫైలు కదలడం లేదు. పని చేయించుకోవడానికి సామాన్య ప్రజలు చెప్పులు అరిగేలా అధికారుల చుట్టూ తిరిగిన ప్రయోజనం లేకపోవడంతో న్యాయం కోసం ఏసీబీ అధికారులను ఆశ్రయిస్తున్నారు. అందులో భాగంగానే వికారాబాద్ జిల్లాలో ఏసీబీ అధికారులు వరుస దాడులు చేస్తున్నారు. వారి దాడుల్లో చిన్న చేప నుంచి తిమింగళం వరకు పట్టుబడుతున్నారు. తాజాగా సోమవారం నాడు వికారాబాద్ జిల్లా దోమ తహసిల్దార్ కార్యాలయంలో ఏసీబీ దాడులు జరిగాయి. కళ్యాణ లక్ష్మి అప్లికేషన్ కోసం మోత్కూరు జిపిఓ జగదీష్ రెండువేల లంచం తీసుకుంటూ తహసిల్దార్ కార్యాలయంలో పట్టుబడ్డాడు. రంగారెడ్డి జిల్లా రేంజ్ ఎసిబి డిఎస్పి ఆనంద్ మీడియాకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవిత అనే మహిళకు గత ఏడాది వికారాబాద్ కు చెందిన ఒక వ్యక్తితో వివాహం జరిగిందని వారి తల్లిదండ్రులు కళ్యాణ లక్ష్మి పథకం కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలియజేశారు. ఆ దరఖాస్తును మోత్కూరు జిపిఓ జగదీష్ పరిశీలన కోసం అదే గ్రామానికి చెందిన ఎల్లమ్మ అనే మహిళ దగ్గర 6000 రూపాయల లంచం డిమాండ్ చేసినట్లు తెలియజేశారు. తర్వాత 6000 రూపాయలు ఇచ్చుకోలేని పరిస్థితిలో ఉన్నట్లయితే 2000 రూపాయలు ఇవ్వాలని జిపిఓ జగదీష్ డిమాండ్ చేశారు. దీంతో వారు ఏసీబీ అధికారులను ఆశ్రయించినట్లు తెలియజేశారు. దోమ తహసిల్దార్ కార్యాలయంలో జిపిఓ జగదీష్ 2000 రూపాయల లంచం దరఖాస్తు దారు నుంచి తీసుకుంటుండగా రెడ్ హ్యాండ్ గా పట్టుకున్నట్లు తెలియజేశారు. కళ్యాణ లక్ష్మి దరఖాస్తుల పరిశీలనలో ఇంకెవరైనా లంచం అడుగుతున్నారా అనే విషయమై విచారణ జరుగుతున్నట్లు తెలియజేశారు. అంతేకాకుండా మోత్కూరు జిపిఓ జగదీష్ పై అనేక ఆరోపణలు ఉన్నాయని వాటిపై సమగ్ర దర్యాప్తు జరుపుతున్నట్లు ఎసిబి డి.ఎస్.పి ఆనంద్ తెలియజేశారు. జిపిఓ జగదీష్ పై కేసు నమోదు చేశామని ఆయనపై వచ్చిన ఫిర్యాదులపై దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.



# ప్రజావాణి వినతులపై ప్రత్యేక దృష్టి

- సిఎంసి అధికారుల స్పష్టీకరణ

**శేరిలింగంపల్లి, జూలై 27 (జనంసాక్షి) :** ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా అందే ఫిర్యాదులపై తమ ప్రత్యేక దృష్టిని సారించడం జరుగుతుందని సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు వెల్లడించారు. ఈ మేరకు సోమవారం సిఎంసి ప్రధాన కార్యాలయం ఆవరణలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ విభాగాల ఉన్నతాధికారులు ప్రత్యక్షంగా పాల్గొని పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు ప్రతి సోమవారం ఎంతో నమ్మకంతో తమ విలువైన సమయాన్ని వెచ్చిస్తూ ప్రజావాణి కార్యక్రమానికి విచ్చేసి పలు సమస్యల పరిష్కారం కోరుతూ అర్జీలు సమర్పిస్తుంటారని, అలాంటి వాటిని సంబంధిత అధికారులు ప్రత్యేక కోణంలో దృష్టిని కేంద్రీకరించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని, ప్రజావాణి ఫిర్యాదులపై తన పర్యవేక్షణ కూడా అంతే స్థాయిలో ఉంటుందని సిఎంసి అధికారులు తెలియజేశారు. సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆయా ప్రాంతాల నుండి వివిధ అవసరాల నిమిత్తం ఫిర్యాదు చేయడానికి విచ్చేసి అందజేసిన ఫిర్యాదులలో ప్రధానంగా 45 వినతి పత్రాల స్వీకరించడం జరిగిందని, అందులో ప్రధానంగా పట్టణ ప్రణాళికా విభాగంనుండి 25, ఇంజనీరింగ్ విభాగం నుండి 11, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ కు సంబంధించి 02, శానిటేషన్ విభాగానికి సంబంధించి 02, అడ్మినిస్ట్రేషన్, చెరువులు(లేక్స్ విభాగం),



ప్రాజెక్టులు, రెవెన్యూ, అర్బన్ బయోడైవర్సిటీ విభాగానికి సంబంధించి ఒక్కొక్కటి చొప్పున ఫిర్యాదులు అందినట్లు సిఎంసి కమిషనర్ సృజన పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో ఆయా విభాగాల అధిపతులు, ఉన్నతాధికారులు, అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### మియాపూర్ సర్కిల్ పరిధిలో...

శేరిలింగంపల్లి నియోజకవర్గం మియాపూర్ సర్కిల్ పరిధిలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి సర్కిల్ పరిధి వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా అర్జీదారుల నుండి పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించిన రెండు ఫిర్యాదులు అందినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. కాగా ఈ కార్యక్రమంలో ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ సమగ్ర సవరణను వేగవంతం చేయాలి



**యాచారం, జూలై 27 (జనం సాక్షి) :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఓటర్ల సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ప్రజలు, అధికారులు సమన్వయంతో పనిచేసి వేగవంతంగా పూర్తి చేయాలని యాచారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మోటే శ్రీశైలం పిలుపునిచ్చారు. సోమవారం ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి ఆదేశాల మేరకు.. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఆయన యాచారం మండలంలోని నల్లవెల్లి గ్రామంలో గల 9, 10, 11 సంఖ్య గల పోలింగ్ బూత్‌లను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ బి.ఎల్.ఓ లు, పంచాయతీ కార్యదర్శి పుష్పలత, అంగన్‌వాడీ సిబ్బంది జ్యోతి, యాదమ్మలతో మాట్లాడి వివిధ బూత్‌లలో ఎన్యూమరేషన్ ఫారాలు నింపి ఇచ్చిన వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం 9వ బూత్‌లో 87 శాతం, 10వ బూత్‌లో 83 శాతం, 11వ బూత్‌లో 89 శాతం మంది ఫారాలు పూర్తి చేశారని బి.ఎల్.ఓలు ఆయనకు వివరించారు. దీనిపై మండల అధ్యక్షుడు శ్రీశైలం స్పందిస్తూ.. ఇంకా మిగిలిపోయిన ఓటర్ల వివరాలను కూడా సాధ్యమైనంత త్వరగా సేకరించి ప్రక్రియను వంద శాతం పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కిషన్ నాయక్, మాజీ ఎంపీటీసీ లక్ష్మీపతి గౌడ్, సూపర్ వైజర్ గొరిగే హరికిషన్, జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పోలమోని రామకృష్ణ యాదవ్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పాశం జయప్రకాష్, సూపర్ వైజర్లు చీర శేఖర్, కోరే జగదీష్, నాయిని శ్రీకాంత్, బి.ఎల్.ఎ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి అర్జీలను ప్రాధాన్యతగా పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి బ్యూరో, జూలై 27 (జనంసాక్షి) :** ప్రజావాణిలో స్వీకరించిన ఫిర్యాదులను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించి, ఫిర్యాదుదారులకు సమాచారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) ఎన్. ఖీమ్య నాయక్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్‌తో కలిసి ప్రజల నుంచి అర్జీలు, వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించి, సంబంధిత ఫిర్యాదుదారులకు సమాచారం పంపడంతో పాటు ఆ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులను



ఆదేశించారు. ఫిర్యాదుకు సంబంధించిన అంశం తమ శాఖ పరిధిలో లేకపోతే సంబంధిత శాఖకు లేఖ ద్వారా వెంటనే పంపించాలని సూచించారు. పరిష్కరించలేని అంశాలు ఉంటే వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, లేదా ఏ నిబంధనల ప్రకారం పరిష్కారం సాధ్యం కాదో ఫిర్యాదుదారునికి స్పష్టంగా తెలియజేయాలని పేర్కొన్నారు. అలాగే ముఖ్యమంత్రి ప్రజావాణి, జిల్లా మంత్రి కార్యాలయం నుంచి వచ్చిన ప్రజావాణి దరఖాస్తులను కూడా అత్యంత ప్రాధాన్యతతో త్వరితగతిన పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. నేటి జిల్లా ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 45 దరఖాస్తులు అందగా, ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 2 దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో యాదయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎన్. తిరుపతయ్య, శిక్షణ ఉప కలెక్టర్లు శ్రావ్యతో పాటు అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## అంధుల సంక్షేమానికి విజ్ఞాన్ కాన్వెంట్ చేయూత

- ఆకట్టుకున్న అంధ కళాకారుల సంగీత విభావరి
- కాంతి ఫౌండేషన్ కు 30,116 విరాళం అందజేత

**మల్కాజిగిరి, జూలై 27 (జనంసాక్షి) :** విద్యార్థులలో కేవలం పాఠ్యాంశాల బోధనకే పరిమితం కాకుండా సామాజిక బాధ్యత, మానవత్వం, సేవా దృక్పథాన్ని పెంపొందించడమే లక్ష్యంగా విజ్ఞాన్ కాన్వెంట్ హైస్కూల్ ముందడుగు వేస్తోందని పాఠశాల కరస్పాండెంట్ హరనాథరెడ్డి పేర్కొన్నారు. సమాజంలోని దివ్యాంగ వర్గాలకు తోడ్పాటు అందించాలనే పిలుపునకు విద్యార్థుల నుంచి అపూర్వ స్పందన లభించిందని ఆయన తెలిపారు. శనివారం పాఠశాల ఆవరణలో కాంతి ఫౌండేషన్ సౌజన్యంతో అంధ కళాకారులతో ప్రత్యేక సంగీత విభావరి నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులు ఆలపించిన సుమధుర గీతాలు విద్యార్థులను, ఉపాధ్యాయులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కరస్పాండెంట్ హరనాథరెడ్డి మాట్లాడుతూ ప్రతిభను ప్రోత్సహించడం సేవాగుణమని అంధులలో చూపు లోపించినప్పటికీ అద్భుతమైన నైపుణ్యం, విశేషమైన ప్రతిభ ఉన్నాఅనంతరం అంధుల సంక్షేమానికి కృషి చేస్తున్న కాంతి ఫౌండేషన్ ప్రతినిధులకు పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు సంయుక్తంగా సేకరించిన 30,116 ఆర్థిక సహాయాన్ని చెక్కు రూపంలో అందజేశారు. స్వచ్ఛందంగా ముందుకు వచ్చి విరాళాలు అందించిన విద్యార్థులకు, ప్రోత్సహించిన యాజమాన్యానికి కాంతి ఫౌండేషన్ వ్యవస్థాపకులు వెంకటేష్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, సిబ్బంది మరియు కాంతి ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



## చిలుకవాగు ప్రాజెక్టుకు మరో రూ.30 కోట్లు

- ఆర్థిక అనుమతులు జారీ
- ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి కృషికి మరో విజయం

**తాండూరు, జూలై 27 (జనంసాక్షి) :** తాండూర్ మున్సిపల్ పరిధిలోని నిర్మాణంలో ఉన్న ప్రతిష్టాత్మక చిలుకవాగు ప్రాజెక్టుకు అదనంగా రూ.30 కోట్ల నిధులకు ప్రభుత్వం ఆర్థిక అనుమతులు మంజూరు చేసింది. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ద్వారా ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అధికారిక జీవోను విడుదల చేసింది. చిలుకవాగు ప్రాజెక్టుకు అదనపు నిధుల మంజూరు కోసం ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి గత వారం రోజుల క్రితం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కని మర్యాదపూర్వకంగా కలిసి ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టు పనులు వేగవంతంగా పూర్తయ్యేందుకు అదనపు నిధులు మంజూరు చేయడంతో పాటు, త్వరితగతిన ఆర్థిక అనుమతులు జారీ చేసి సంబంధిత జీవో విడుదల చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఎమ్మెల్యే బీయంఆర్ విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం తాజాగా రూ.30 కోట్ల అదనపు నిధులకు ఆర్థిక అనుమతులు జారీ చేస్తూ అధికారిక జీవోను విడుదల చేసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ చిలుకవాగు ప్రాజెక్టుకు అదనంగా రూ.30 కోట్ల నిధులు మంజూరు కావడం తాండూర్ ప్రజలకు ఎంతో శుభవార్త అని, ఈ నిధులతో ప్రాజెక్టు పనులు మరింత వేగవంతం అవుతాయని తెలిపారు. తాండూర్ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం సహకరిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కకి, ఇంచార్జి మంత్రి శ్రీధర్ బాబుకి తాండూర్ ప్రజల తరఫున ఎమ్మెల్యే బీయంఆర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



# రహదారి అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**నిజాంపేట్, జూలై 27 (జనం సాక్షి) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న ప్రధాన రహదారుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎట్టకేలకు శ్రీకారం చుట్టింది. కొంపల్లి - బహదూర్‌పల్లి రహదారి విస్తరణకు రూ.130 కోట్లు, గండిమైసమ్మ - మియాపూర్ రహదారి నిర్మాణానికి రూ.140 కోట్లు, మొత్తం రూ.270 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను తెలంగాణ రాష్ట్ర ఐటీ ఒ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సోమవారం పరిశీలించి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, గత దశాబ్ద కాలంగా అటవీ శాఖ అనుమతులు లభించక ఈ రహదారి పనులు నిలిచిపోయాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం అవసరమైన అనుమతులను వేగంగా సాధించి పనులు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. అలాగే, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ప్రత్యేక కృషితో ఈ రహదారి అభివృద్ధి పనులు వేగవంతమయ్యాయని అన్నారు. అనంతరం బౌరంపేట్ రోడ్డులో



జరుగుతున్న రహదారి విస్తరణ పనులను జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖ కమిషనర్, మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ , టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి, టీపీసీసీ ప్రోటోకాల్ వైస్ చైర్మన్ బొంగునూరి కిశోర్ రెడ్డి , జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆర్ లక్ష్మీ , టీపీసీసీ మహిళా ఉపాధ్యక్షురాలు గంగుల అంజలి యాదవ్ తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించి, రహదారి నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అటవీ శాఖ, రెవెన్యూ శాఖ మరియు ఇతర సంబంధిత విభాగాలు పరస్పర సమన్వయంతో పనిచేసి పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఈ అభివృద్ధి పనులు పూర్తయిన అనంతరం కొంపల్లి, బహదూర్‌పల్లి, గండిమైసమ్మ, బాచుపల్లి, మియాపూర్ ప్రాంతాల మధ్య ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గడంతో పాటు ప్రజలకు వేగవంతమైన, సురక్షితమైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, మాజీ సర్పంచ్‌లు, డీసీసీ కమిటీ సభ్యులు, డివిజన్ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, ఐఎన్ టి యుసి , ఎన్ఎస్ యు ఐ, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అనుమతులు లేని ప్రైవేట్ స్కూల్స్‌పై చర్యలు తీసుకోవాలి

**మహేశ్వరం, జూలై 27 (జనంసాక్షి) :** అనుమతులు లేని ప్రైవేట్ స్కూల్స్ పై విద్యాశాఖ అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్య నిర్వహణ కార్యదర్శి సవీందర్ చౌహాన్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజావాణిలో మహేశ్వరం గేట్ సమీపంలో ఉన్న శ్రీ చైతన్య టెక్నో స్కూల్(వశిష్ట కో స్కూల్) పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సవీందర్ చౌహాన్ మాట్లాడుతూ... మహేశ్వరం గ్రామంలోని శ్రీ చైతన్య స్కూల్ కు 10 వ తరగతి అనుమతి లేదన్నారు. మహేశ్వరం గేట్ సమీపంలో ఉన్న శ్రీ చైతన్య టెక్నో స్కూల్(వశిష్ఠ కో స్కూల్) కు ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు లేకుండానే తరగతులను నిర్వహిస్తున్నారన్నారు. అనుమతులు లేకుండానే తరగతులను నిర్వహిస్తున్న శ్రీ చైతన్య టెక్నో స్కూల్ ( వశిష్ఠ కో స్కూల్) పై,తుక్కుగూడలోని ఇండియాస్ లీడింగ్ ప్రీ స్కూల్ చైన్ స్కూల్ పై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తుక్కుగూడ శ్లోక స్కూల్ కు 9,10 వ తరగతి అనుమతులు రాలేదన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న ప్రైవేట్ స్కూల్స్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులను కోరారు.



## ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యతతో పరిష్కరించాలి

- కలెక్టర్ ప్రియాంక

**నారాయణపేట జిల్లా బ్యూరో, జూలై 27 (జనం సాక్షి) :** ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి వీలైనంత త్వరగా వాటిని పరిష్కరిం చాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ లోని ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 27 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ కు విన్నవిస్తూ అర్జీ లు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి అర్జీలను పెండింగ్ లో పెట్ట కుండా సత్వరం పరిష్కరిం చాలన్నారు. శాఖల వారీగా ఆయా అర్జీలను ఎప్పటి కప్పుడు పరిశీలించి వెంట నే పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్ర మంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, డి.ఆర్.ఓ. రాజేశ్వరి, డిప్యూటీ కలెక్టర్ ఫణి కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# రేజింతల్ గ్రామంలో శ్మశానవాటిక స్థలం కేటాయించాలి

- గ్రామస్థులు మృతిచెందితే ఎక్కడ పెట్టాలో తెలియక నిత్యం నరకయాతన
- ఆరడుగుల జాగకోసం గ్రామస్థుల ఆక్రందనలి కలెక్టర్ పరిష్కారం చూపాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు
- జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో గ్రామస్థులతో ధర్నా
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు వినతి



**సంగారెడ్డి, జూలై 27 (జనం సాక్షి) :** సదాశివపేట మండలం రేజింతల్ గ్రామంలో దళితులు, మైనార్టీలు, బీసీ, పేదల స్మశాన వాటిక సమస్య వెంటనే పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రభుత్వంను డిమాండ్ సోమవారం సంగారెడ్డి సిపిఎం పార్టీ కార్యాలయం నుండి కలెక్టరేట్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద స్మశాన వాటికకు స్థలం కేటాయింపు చేయాలని ధర్నా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ రేజింతల్ గ్రామంలో శ్మశాన వాటిక స్థలం కేటాయించాలని ప్రభుత్వం ను డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ తీర్మానం ప్రకారం సర్వే నెంబరు 149లో ఉన్న 4.09 ఎకరాలు ప్రభుత్వ భూమిని స్మశాన వాటిక స్థలం వెంటనే కేటాయించాలని అన్నారు. స్వాతంత్రం వచ్చి 79 ఏళ్లు అవుతున్న కనీసం బొంద పెట్టుకోవడానికి జాగలేక ప్రజలు అనేక రకాల అవస్థలుపడుతున్నారని అన్నారు. ప్రభుత్వం మారిన ప్రజలు బ్రతుకులు మారటం లేదని అన్నారు. పేదలను పాలకులు పట్టించుకోవడంలేదని విమర్శించారు. దళితులు బలహీన వర్గాలకు స్మశాన వాటికకు నిధులు కేటాయించాలని జీవోలు మార్గదర్శకాలు ఉన్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు ఇప్పటికైనా కలెక్టర్, ప్రజాప్రతినిదులు దృష్టి పెట్టి సమస్యను వెంటనే పరిష్కరించాలని అన్నారు. రేజింతల్ గ్రామం సమస్య పరిష్కారం అయ్యేంతవరకు సిపిఎం పార్టీ వెన్నంటి ఉంటదని ఉన్నారు గ్రామ ప్రజలందరూ ఐక్యంగా ఉద్యమించాలని అన్నారు. ప్రజా పోరాటానికి ఎంత పెద్ద వారైనా, ప్రభుత్వం అయినా తలవంచాల్సిందేనని అన్నారు. రేజింతల్ గ్రామంలో స్మశాన వాటిక సమస్య పరిష్కారం అయ్యేంతవరకు పోరాటం చేస్తామని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ప్రవీణ్ కుమార్ అన్నారు. ప్రభుత్వం వెంటనే సమస్యను పరిష్కరించకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం స్థలం కేటాయింపు చేయకపోతే ప్రజలే తిరుగుబాటు చేసి ఆక్రమిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు యస్.రమేష్ గౌడ్ పి.అశోక్, గ్రామ ప్రజలు వీరస్వామి, గోపాల్,భాస్కర్, సంయోజన్, మోహన్, రమేష్,బుచ్చయ్య, మానేయ,ఆనందం, శివయ్య,చంద్రయ్య, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# సికింద్లాపూర్ మట్టి డబ్బులు రికవరీ చేయండి

- మట్టి డబ్బుల మాయగాళ్ళపై చర్యలు తీసుకోండి
- వినతి పత్రాల సమర్పణ

**శివ్వంపేట, జూలై 27 (జనంసాక్షి) :** శివ్వంపేట మండలం సికింద్లాపూర్ గ్రామ శివారులోని దేవుని చెరువులో మూడు సంవత్సరాల క్రితం మట్టి వ్యాపారులు 16 లక్షల రూపాయలకు చెరువు మట్టిని కొనుగోలు చేశారని, అట్టి డబ్బులు ఇప్పుడు అడిగితే లెవ్వ పో అంటున్నారని సికింద్లాపూర్ మాజీ ఉప సర్పంచ్ రామారం నర్సింలు అన్నారు. గ్రామ ప్రజలకు చెందిన మట్టి డబ్బులను దిగ మింగిన వ్యక్తుల నుంచి రికవరీ చేయాలని విజ్ఞప్తి చేస్తూ సోమవారం ఆయన మండల కేంద్రమైన శివ్వంపేట లోని తహాసిల్దార్ కార్యాలయంలో తహాసిల్దార్ కమలాద్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. అంతకుముందు ఇదే మట్టి డబ్బుల విషయంపై స్థానిక పోలీస్ స్టేషన్లో ఏఎస్ఐ సాయిలును కలిసి వినతి పత్రం సమర్పించగా, ఎంపిడిఓ కార్యాలయంలో మండల పంచాయతీ అధికారి తిరుపతి రెడ్డి ని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఉప సర్పంచ్ రామారం నర్సింలు మాట్లాడుతూ దేవుని చెరువు మట్టిని విక్రయించగా గ్రామానికి వచ్చిన 16 లక్షల ఆదాయాన్ని ఏకాభిప్రాయంతో ప్రజల సమక్షంలో మొదటి విడత 11 లక్షల రూపాయలు, అప్పటి సర్పంచ్ ఏనుగు సుధాకర్ రెడ్డి వద్ద ఉంచగా అలాగే 2 వ విడత గా వచ్చిన మరో 5 లక్షల రూపాయలను గ్రామానికి చెందిన దొంతి రెడ్డి రాంచంద్రారెడ్డి వద్ద ఉంచడం జరిగిందన్నారు. ఈవి మొత్తం కలిపి 16 లక్షల రూపాయలు వీరు ఇరువురి వద్ద ఉంచడం జరిగిందని, ఇట్టి 16 లక్షల రూపాయలు మా వద్ద సురక్షితంగా వుంచుతామని గామ ప్రజలు ఏప్పుడు ఇవ్వమంటే అప్పుడు ఇస్తామని



వారు గతంలో ఒప్పు కోవడం జరిగిందని తెలిపారు. అయితే ఈ డబ్బుల విషయమై గ్రామస్తులు అడగగా మాజీ సర్పంచ్ ఏనుగు సుధాకర్ రెడ్డి మాయ మాటలతో కాలం వెలదీస్తూ, తన దగ్గర డబ్బులు లేవని పిట్టలవాడ లో అభివృద్ధి పనులకు ఖర్చు చేశానని, ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి అని అంటున్నారని వాపోయారు. పిట్టలవాడ లో జరిగిన అభివృద్ధి పనులకు మట్టి డబ్బులకు సంబంధం లేదని, పిట్టల వాడలో జరిగిన అండర్ డ్రైనేజీ పనులకు ఎంబీ రికార్డు చేసుకొని ప్రభుత్వం నుంచి పెట్టుబడి డబ్బులు వస్తాయని, మట్టి డబ్బులను గ్రామస్తులు ఆమోదం లేకుండా పిట్టల వాడలో ఎలా వినియోగిస్తారని నర్సింలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయంపై అధికారులు జోక్యం చేసుకొని గ్రామస్తులకు న్యాయం చేయాలని వారి వద్ద నుంచి మొత్తం 16 లక్షల రూపాయలు రికవరీ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# అభివృద్ధి పనుల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ ప్రియాంక

**నారాయణపేట జిల్లా బ్యూరో, జూలై 27 (జనం సాక్షి) :** జిల్లాలో వివిధ శాఖలలో కొనసాగుతున్న కార్యక్ర మాలను జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని ప్రజావాణి సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ జిల్లా అధికారులకు పలు కీలక సూచనలు చేశా రు. ప్రత్యేక ఓటరు జాబి తా సవరణ లో భాగంగా పూరించిన ఎన్యూమరేషన్ పత్రాల రేషనైలేజేషన్ ప్రక్రి యను పూర్తి చేయాలని సూచించారు. రాబోయే రెండు రోజుల పాటు తహ సీల్దార్లు ఈ పనిపైనే పూర్తి స్థాయిలో దృష్టి సారించాల న్నారు. ప్రతి సూపర్‌వైజర్ క్షేత్రస్థాయిలో ఉండి పనుల ను పర్యవేక్షించాలని తెలి పారు. అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా ఓటరు జాబి తా నుంచి తొలగించబ డకుండా ప్రత్యేక శ్రద్ధ తీసు కోవాలని ఆమె స్పష్టం చేశా రు. గ్రామాలలో కొనసాగు తున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాల పై పంచాయ తీ వారీగా సమీక్ష నిర్వహిం చాలని ఆదేశించారు. రోజూ వారి పురోగతిపై నివే దిక సమర్పించాలని వీడి యో కాన్ఫరెన్స్ లో ఎంపీడీ వోలకు సూచించారు. ఎల్ నినో ప్రభావం అధికం గా ఉండే ఆస్కారం ఉందని ఆమె తెలిపారు. జిల్లా కు 1,144 ఫామ్ ఫౌండ్ లక్ష్యం విధించారని, ప్రతి గ్రామ పంచాయతీలో కనీసం రెండు ఫామ్ ఫౌండ్ గ్రౌండ్ చేయాలని సూచించా రు. అవసరమైతే వెంటనే పరిపాలనా అనుమతులు మంజూరు చేయాలని ఆదేశించారు. వీ బీ జీ రామ్ జీ కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పా రు. ప్రస్తుతం డెంగ్యూ ప్రభా వం ఉన్నందున అధికారు లు అప్రమత్తంగా ఉండాల న్నారు. అడపాదడపా కురు స్తున్న వర్షాల కారణంగా దోమల



వ్యాప్తికి ఎక్కువ అవకాశం ఉన్నందున నివారణ చర్యలు చేపట్టాల న్నారు. మన ఇల్లు -- మన ఆరోగ్యం" కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా అధికారు లను ఆదేశించారు. ఆ కార్య క్రమ ఫోటోలను జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారికి పంపించాలని సూచించారు. దోమల లార్వా నిర్మూలన చర్యలు చేపట్టడంతో పాటు ప్రతి శుక్రవారం "ఫ్రైడే డ్రైడే" కార్యక్రమాన్ని నిర్వహించా లన్నారు. ఫీవర్ సర్వే పై వైద్య, ఆరోగ్య శాఖ అధి కారులు నివేదిక ఇవ్వాల న్నారు. ప్రస్తుత సీజన్ అత్యంత కీలకమైనందున అన్ని శాఖలు సమన్వయం తో పనిచేయాలన్నారు. సీఎం ప్రజావాణి ద్వారా వచ్చిన అన్ని ఫిర్యాదులను సంబంధిత అధికారులు వచ్చే వారం లోపు పరిష్క రించాలని రెవెన్యూ అదన పు కలెక్టర్ శ్రీను ఆదేశించా రు. ఈ సమావేశంలో డీ ఆర్ వో రాజేశ్వరి, డిప్యూటీ కలెక్టర్ ఫణి కుమార్, జెడ్పీ సీ ఈ వో శ్రీనివాస్ రావు, డిఆర్డిఓ,డీ పీ వో వెంకట్ రాములు, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలి

- గోరక్ష అభియాన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు వినతి




**సంగారెడ్డి, జూలై 27: (జనం సాక్షి) :** గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ గోరక్ష అభియాన్ ఆధ్వర్యంలో సోమవారం సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ కు వినతిపత్రం అందజేశారు. సంగారెడ్డి పట్టణంలోని హనుమాన్ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు గోమాతతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లావ్యాప్తంగా సేకరించిన సుమారు 2 లక్షల సంతకాల ప్రతులను పీడీఎఫ్ రూపంలో జిల్లా కలెక్టర్‌కు అందజేశారు ఈ సందర్భంగా గోరక్ష అభియాన్ నాయకులు సుభాష్ చందర్, షెరీన్ సింగ్, సోహన్ లాల్ దహిమ్, కౌన్సిలర్ జగన్, దామోదర్ రెడ్డి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఒకే రోజు అన్ని జిల్లాల కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పిస్తున్నట్లు తెలిపారు. గో ఆధారిత వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ రైతులకు తగిన సహకారం అందించాలన్నారు. తెలంగాణలో గోరక్షణ చట్టం అమల్లో ఉన్నప్పటికీ దాని అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని వారు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ద్వారకా రవిప్రకాశ్ జీ, రాఠోడ్, బద్రి మహారాజ్, పరమేష్, సునీల్, సాయి, సంతోష్ తదితర గోభక్తులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శాంతమ్మది పథకం ప్రకారమే హత్య..

- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్

**మద్దూరు, జూలై 27 (జనం సాక్షి) :** మద్దూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జాదవరావుపల్లి గ్రామానికి చెందిన గొయికల శాంతమ్మ (45) అదృశ్యమైనట్లు ఆమె కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈనెల 15వ తేదీన మద్దూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. దర్యాప్తులో భాగంగా మృతురాలి వద్ద ఉన్న బంగారు నగలను దోచుకోవాలనే ఉద్దేశంతో జోగు రాజు (ఏ-1), బడుగుల భాస్కర్ (ఏ-2) ముందుగానే పథకం రచించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలో ఈనెల 12వ తేదీన శాంతమ్మను ఫోన్ ద్వారా మద్దూర్‌కు రప్పించి, మోటార్ సైకిల్‌పై జాజాపూర్ చెరువు సమీపంలోని చెట్ల పొదల్లోకి తీసుకెళ్లి, మద్యం సేవించిన అనంతరం ఆమెతో శారీరకంగా కలిసి, చున్నీతో గొంతు బిగించి హత్య చేసినట్లు విచారణలో వెల్లడైంది. హత్య అనంతరం మృతురాలి వద్ద ఉన్న బంగారు, వెండి ఆభరణాలు, సెల్‌ఫోన్, పర్సు, ఆధార్ కార్డును తీసుకుని, ఆధారాలను నాశనం చేసే ఉద్దేశంతో వాటిని బోరు కేసింగ్‌లో పడవేశారు. అనంతరం బంగారు నగలను నారాయణపేటలో విక్రయించి వచ్చిన నగదును ఇద్దరూ పంచుకున్నట్లు నిందితులు ఒప్పుకున్నారని ఎస్పీ తెలిపారు. నిందితుల వద్ద నుంచి ఒక తులం బంగారు ఆభరణాలు (కమ్మలు, మ్యాట్నీలు, పుస్తెల గుండ్లు), 50 తులాల వెండి ఆభరణాలు (కడియాలు, పట్టీలు), రూ.50,000 నగదు, నేరానికి ఉపయోగించిన రెండు మోటార్ సైకిళ్లు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే దొంగిలించిన బంగారు నగలను కొనుగోలు చేసిన జాజాపూర్ గ్రామానికి చెందిన కృష్ణ (ఏ-3)ను కూడా అరెస్ట్ చేసి, ముగ్గురు నిందితులను న్యాయస్థానంలో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ కేసును డీఎస్పీ ఎన్. లింగయ్య పర్యవేక్షణలో అత్యంత సమర్థవంతంగా ఛేదించిన కోస్గి సీఐ సైదులు, మద్దూర్ ఎస్ఐ బి. శ్రీనివాసులు, ఏఎస్ఐ బాలయ్య, హెడ్ కానిస్టేబుళ్లు పెంటయ్య, గోపాల్, బి. రాజు, పోలీసు కానిస్టేబుళ్లు పుల్చా నాయక్, నాగమల్లయ్య, పరందాములు, సీసీఎస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే నేరాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నేరాలను అరికట్టడంలో ప్రజలు పోలీసులకు సహకరించాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనల గురించి వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.




# ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టాలి

- గద్వాల శాసన సభ్యులు బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి

**గద్వాల నడిగడ్డ, జూలై 27 (జనం సాక్షి) :** వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని గద్వాల శాసన సభ్యులు బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం ధరూరు రైతు వేదికలో నిర్వహించిన విత్తన మేళా కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం విత్తన ప్రదర్శన స్టాళ్లను సందర్శించి రైతులకు మొక్కజొన్న విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా జిల్లాలోని 13 మండలాల రైతు వేదికల్లో విత్తన మేళా కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితులు మారుతున్న నేపథ్యంలో రైతులు సంప్రదాయ సాగు విధానాలకు బదులుగా పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం వర్షపాతం ఆశించిన స్థాయిలో లేకపోవడం, ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు తగ్గిపోవడంతో సాగునీటి లభ్యత పరిమితంగా ఉండే అవకాశం ఉందన్నారు. అందువల్ల అధిక నీటి అవసరమున్న వరి సాగును వీలైనంత మేర తగ్గించి, తక్కువ నీటితో సాగు చేయగల ఆరుతడి పంటలను



సాగు చేయాలని రైతులకు సూచించారు. వరికి బదులుగా కంది, పెసర, మినుము, శనగ, జొన్న, సజ్జ, మొక్కజొన్న, వేరుశెనగ, నువ్వులు, వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. ఈ పంటల సాగు ద్వారా తక్కువ పెట్టుబడితో మెరుగైన దిగుబడులు, గిట్టుబాటు ధరలు లభించి రైతులు అధిక ఆదాయం పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. అలాగే రైతులు పండ్ల తోటలు, కూరగాయలు, ఇతర ఉద్యాన పంటల సాగుకు ప్రాధాన్యత ఇస్తే అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. ప్రభుత్వం ఉద్యాన పంటలకు అందిస్తున్న సబ్సిడీలు, ప్రోత్సాహక పథకాలను సద్వినియోగం చేసుకుని సాగు విస్తీర్ణాన్ని పెంచి లాభదాయక వ్యవసాయం వైపు అడుగులు వేయాలని రైతులకు సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తూ శాస్త్రీయ సాగు విధానాలను అవలంబించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన విత్తనాలు, సాంకేతిక సేవలు, పథకాలను సద్వినియోగం చేసుకుని వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చుకోవాలని రైతులకు పిలుపునిచ్చారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ఉపాధి హామీ పనులను విస్తృతంగా చేపట్టాలన్నారు. పశువులకు తాగునీరు, మేత కొరత లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నీటి వనరులను పొదుపుగా వినియోగించడం ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. చెరువులు, కుంటలు, కాలువలను సంరక్షించి వర్షపు నీటిని నిల్వ చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో విస్తృతంగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా వ్యవసాయ అధికారి వీరప్ప మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు దీర్ఘకాలిక రకాల కంటే స్వల్పకాలిక, ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని, వ్యవసాయ శాఖ సాంకేతిక సూచనలను పాటించాలని సూచించారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రాజ్ కుమార్ మాట్లాడుతూ పండ్ల తోటలు, కూరగాయలు, ఇతర ఉద్యాన పంటల సాగు ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందవచ్చని, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు, ప్రోత్సాహక పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గద్వాల మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంతు, ధరూరు సర్పంచ్ డి.ఆర్ విజయ్, ఏడీఏ, ఎంఏఓలు, ఏఈఓలు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత



**ఉర్కొండ, జూలై 27 (జనం సాక్షి) :** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరికి సామాజిక బాధ్యత అని స్థానిక ఎస్సై రమాదేవి, ఏవో దీప్తి అన్నారు. వనమహోత్సవంలో భాగంగా ఉరుకొండ మండల కేంద్రంలో సర్పంచ్ మంజుల శ్రీనివాసులు ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్సై, రమాదేవి, ఏవో దీప్తి సర్పంచ్ మంజుల శ్రీనివాస్ తో కలిసి పోలీస్ స్టేషన్ మరియు రైతు వేదిక ప్రాంగణంలో మొక్కలు నాటడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూమిని పచ్చగా ఉంచడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. మొక్కలు మనకు ప్రాణవాయువును అందించడమే కాకుండా వర్షాలు సమృద్ధిగా కురవడానికి, ఉష్ణోగ్రతలను తగ్గించడానికి, జీవ వైవిధ్యాన్ని కాపాడడానికి ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఈరోజు నాటిన చిన్న మొక్కే రేపటి తరాలకు గొప్ప ఆస్తి అని పేర్కొంటూ, ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను నాటి దానిని పెద్ద చెట్టుగా పెంచాలని పిలుపునిచ్చారు. కేవలం మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా అంతే ముఖ్యమని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు, ఫీల్డ్ అసిస్టెంట్ ప్రమోద్ కుమార్, పోలీస్ సిబ్బంది, వ్యవసాయ శాఖ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో 71 అర్జీలు

- త్వరితంగా పరిష్కరించాలని అధికారులకు కలెక్టర్ ఆదేశం



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ప్రజావాణిలో మొత్తం 71 దరఖాస్తులు అందాయని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పాల్గొని జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి స్వయంగా వినతులు స్వీకరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వీకరించిన అర్జీలను తగు చర్యల నిమిత్తం సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేసినట్లు చెప్పారు. ప్రజల నుండి వచ్చిన దరాఖాస్తుల సమస్యల పరిష్కారంలో అధికారులు ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని స్పష్టం చేశారు. బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా అర్జీలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డిఆర్ఓ వసంత కుమారి, భూపాలపల్లి ఆర్డిఓ హరికృష్ణ, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రొసీడింగ్ ప్రకారం సీసీ రోడ్డును పోయాలి

- మాధవ నగర్ లో పనులను అడ్డుకున్న కాలనీవాసులు
- రోడ్డుపై బైఠాయించి నిరసన



**చెన్నారావుపేట, జూలై 27 (జనంసాక్షి) :** ప్రొసీడింగ్ ప్రకారం సిసి రోడ్డును పోయాలని ఎల్లాయ్యగూడెం గ్రామంలోని మాధవ నగర్ కాలనీ వాసులు మంచాల రజనీకాంత్, సదిరం వినయ్, పానుగంటి అనూష, సింగారపు ప్రమోద్ కుమార్, పానుగంటి శ్రీనివాస్, దాసరి ఐలయ్య, పానుగంటి పూలమ్మ, బాకి యాకయ్య, పానుగంటి ఏలియాలు డిమాండ్ చేశారు. మాధవ నగర్ కాలనీలో మంజూరైన రూ. 5 లక్షల సిసి రోడ్డు పనులను సంబంధిత కాంట్రాక్టర్ సోమవారం ప్రారంభించారు. ఈ సీసీ రోడ్డును ప్రొసిడింగ్ లో ఉన్నట్లుగా పోయకుండా నిబంధనలకు విరుద్ధంగా పోస్తున్నారని రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టారు. ప్రొసిడింగ్ లో ఉన్నట్లుగా సిసి రోడ్డును పోయాలని లేకుంటే సీసీ రోడ్డును కాలనీలో పోయనీయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై సంబంధిత పంచాయతీరాజ్ అధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా సిసి రోడ్డు పోయకుండా ప్రొసిడింగ్ లో ఉన్నట్లుగా సిసి రోడ్డు పనులను చేపట్టాలని డిమాండ్ చేశారు. దీంతో సంబంధిత కాంట్రాక్టర్ సిసి రోడ్డు పనులను నిలిపివేసి వెళ్లిపోయాడు.

# నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడులు

- విత్తన మేళాలో జిల్లా కలెక్టర్ సత్య శారద



**నల్లబెల్లి, జులై 27 (జనంసాక్షి):** నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడులు సాధించవచ్చునని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద అన్నారు. సోమవారం మండలంలోని మేడపల్లి రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విత్తన మేళలో ఆమె పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా విత్తనాల నాణ్యత, వాటి వినియోగంపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గుర్తింపు పొందిన సంస్థల ద్వారా సరఫరా చేసే ధ్రువీకరించిన విత్తనాలనే కొనుగోలు చేయాలని రైతులకు సూచించారు. విత్తనాల వినియోగం, పంటల యాజమాన్య పద్ధతులు, పంటల ఎంపిక వంటి అంశములపై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రైతులు ప్రభుత్వ సూచనలు పాటించి శాస్త్రీయ పద్ధతిలో సాగు చేసి అధిక దిగుబడులు పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి విజయభాస్కర్, ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి బన్న రజిత, ఏఈఓ లు రంజిత్, రాకేష్, శివకుమార్, త్రివేణి, సర్పంచ్ అర్రెమ్ సాంబయ్య,రైతులు పాల్గొన్నారు.

# వీలైనంతవరకు ఆరుతడి పంటలు వేసుకోవాలి

- స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి




**స్టేషన్ ఘన్‌పూర్, జూలై 27 (జనం సాక్షి) :** ఎల్ ని నో ప్రభావంతో వర్షాలు తక్కువ పడే అవకాశం ఉన్నందున వీలైనంతవరకు ఆరుతడి పంటలు వేసుకోవాలని స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి రైతులను కోరారు. స్టేషన్ ఘన్పూర్ పట్టణ కేంద్రంలోని తెలంగాణ ప్రభుత్వం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు నాణ్యమైన విత్తనాలను అందుబా టులోకి తీసుకురావడం, వివిధ రకాల విత్తనాలపై అవగాహన కల్పించడం లక్ష్యంగా రైతు వేదికలో విత్తన మేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్య క్రమాన్ని ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రారంభోత్సవం చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విత్తన మేళాలో ఏర్పాటు చేసిన అన్ని విత్తన స్టాళ్లను సందర్శించి, అందుబాటులో ఉన్న వివిధ పంటల విత్తనరకాలు, వాటి ప్రత్యేకతలు, సాగు విధానాలు, రైతులకు కలిగే ప్రయోజనాల గురించి వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలను అడిగి తెలుసుకున్నారు. అనం తరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి రైతుల ను ఉద్దేశించి మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం నమోదులో మార్పులుఉండే అవకాశం ఉన్నందున వాతావరణ పరిస్థితులకు అనుగుణం గా పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు. తక్కువ నీటితో సాగయ్యే, తక్కువ కాలపరిమితి గల పంటలు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని తెలిపారు. రైతులు వరిపైనే పూర్తిగా ఆధారపడకుండా కంది, పెసర, మినుములు, జొన్నలు, నువ్వులు, కొర్రలు తదిత ర ఆరుతడి పంటలను నేల స్వభావం, వర్షపాతం, నీటి లభ్యతను బట్టి సాగు చేయాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తల సాంకేతిక సలహాలను పాటించాలని అన్నారు. రైతులు తమ సమీప రైతు వేదికల్లో నిర్వహిం చే విత్తన మేళాలకు అధిక సంఖ్యలో హాజరై, వ్యవసాయ శాస్త్రవేత్తలు,వ్యవసాయ అధికారుల సలహాల మేరకు తమ ప్రాంతానికి అనువైన పంటలను ఎంపికచేసుకుని నాణ్యమైన విత్తనాల ను కొనుగోలు చేయాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇంటిగ్రేటెడ్ వ్యవసాయం ఎంతో అవసరమని, వ్యవసాయంతో పాటు ఉద్యాన వన పంటలు, పశుసంవర్ధక రంగం, కూరగాయల సాగు వంటి అనుబంధ వ్యవసాయ కార్యకలాపా లను కలిపి చేపడితే రైతులకు సంవత్సరం పొడ వునా ఆదాయం లభిస్తుందని వివరించారు.

కూరగాయల సాగు ద్వారా అనేక మంది రైతులు మంచి లాభాలు పొందుతున్నారని, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఉద్యానవన పంటలను సాగు చేస్తే ఆదాయం మరింత పెరుగుతుందని తెలిపారు. ప్రతి గ్రామంలోని వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు) ఉద్యానవన పంటలు, ప్రత్యామ్నాయ పంటలు, ఆధునిక సాగు విధానాలపై రైతులకు నిరంతరం అవగాహ న కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ జూలుకుంట్ల లావణ్య శిరీష్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్, పట్టణ అధ్యక్షుడు అంబటి కిషన్ రాజ్, జిల్లా వ్యవసాయ అధికారి (డిఏఓ) అంబికా సోనీ, రెవెన్యూ డివిజనల్ అధికారి కిరణ్ ప్రకాష్, తహసిల్దార్ స్వప్న, సహాయ వ్యవసాయ సంచా లకులు (ఏడిఏ) అపర్ణ, వ్యవసాయ శాస్త్రవేత్త రమ్య, రవి ప్రసాద్, ఏవో కర్ణాకర్, ఏఓ చంద్రన్ కుమార్, ఆర్ఐ శ్రీకాంత్, సతీష్, పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు,ఉద్యానవన అధికారి (హెచ్ఓ), వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# కన్న బిడ్డలే 'కుంపటి' పెడుతున్నారు..

- ఆస్తుల ముందు 'బందీ' అవుతున్న బంధుత్వం..
- వృద్ధాప్యంలో ఆసరాగా ఉండాల్సిన కొడుకులే హింసిస్తున్నారు..
- ప్రజావాణిలో వృద్ధ తల్లుల కన్నీటి గోడు..
- కన్న కొడుకులపై కలెక్టర్ కు ఫిర్యాదులు..

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** వృద్ధాప్యంలో ఒడిలో కూర్చుని సేదతీర్చాల్సిన కన్న బిడ్డలే ఈరోజు కన్నీరు పెట్టిస్తున్నారు.. ఆస్తి కోసం అమ్మను బెదిరిస్తున్నారు, కొడుతున్నారు.. జిల్లా కలెక్టరేట్ లో సోమవారం జరిగిన ప్రజావాణిలో ఇద్దరు వృద్ధ తల్లులు తమ గోడును వినిపించారు.. వారి మాటలు విన్న అధికారులు సైతం ఆశ్చర్యానికి గురవుతున్నారు.. ఆస్తుల ముందు బంధుత్వం 'బంధీ' అవుతుంది.. రక్తసంబంధాలు, మానవత్వాలు మంటగలిసిపోతున్నాయి.. వృద్ధాప్యంలో ఆసరాగా ఉండాల్సిన కొడుకులు చిత్రహింసలకు గురి చేయడం కారణంగా ఓ ఇద్దరు ముసలి తల్లులు అధికారుల చుట్టూ తిరిగేలా చేసింది.. కాటికి దగ్గరవుతున్న వయసులో కలెక్టరేట్ మెట్లు ఎక్కాల్సివచ్చింది.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టరేట్ ప్రజావాణిలో సోమవారం వేర్వేరుగా ఫిర్యాదు చేసిన ఓ ఇద్దరు వృద్ధ తల్లులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి..

### ఆస్తుల మోజులో మానవత్వం మంట కలుస్తుంది..

ఇద్దరు తల్లుల కథ విన్న తర్వాత అక్కడున్న వారందరి కళ్లు చెమర్చాయి. కన్నబిడ్డలే ఇలా చేస్తే ఇక ఎవరిని నమ్మాలని అక్కడివారు ముక్కున వేలేసుకుంటున్నారు. ఈ ఫిర్యాదులను స్వీకరించిన కలెక్టర్ రాహుల్ శర్మ సంబంధిత అధికారులతో వెంటనే విచారణ జరిపి న్యాయం చేయాలని ఆదేశించారు. వృద్ధుల సంక్షేమ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులను వృద్ధాప్యంలో ఆదుకోవాల్సింది పోయి ఆస్తుల కోసం వేధిస్తున్న ఈ ఘటనలు సమాజాన్ని తల దించుకునేలా చేసాయి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు పగడ్బందీ చర్యలు చేపడితే, ఆస్తుల కోసం వేధించే వారికి కనువిప్పు కలుగుతుందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

### నా ఇల్లు నా పేరు మీద లేకుండా చేశారు : ఆరెల్లి రాధమ్మ(80), వెంకట్రావుపల్లి(సి)



చిట్యాల మండలం వెంకట్రావుపల్లికి చెందిన ఆరెల్లి రాధమ్మ(80) చేతికర్ర సహాయంతో కలెక్టరేట్ మెట్లు ఎక్కి వచ్చింది. గొంతు వణుకుతూ తన బాధను చెప్పుకుంది. అయ్యా... నా పేరు మీదున్న 3-157 ఇంటిని నా పెద్ద కొడుకు వెంకటేశ్వర్లు నన్ను అడగకుండానే రిజిస్టర్ చేయించుకున్నాడు. ఆ తర్వాత తన భార్య రమ పేరుకు రాసిచ్చాడు. నేను కాదంటే గొంతు పిసికి చంపుతానని కొడుకు, కోడలు బెదిరిస్తున్నారు. అంటూ రాధమ్మ కన్నీరు మున్నీరైంది. నానా చిత్రహింసలు పెట్టి కొడితే పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశానని, నాకు కోర్టుల చుట్టూ తిరిగే శక్తి లేదని, రెండు పూటలా తిండి పెట్టే దిక్కు లేదని ఆవేదన వ్యక్తం చేసింది. ఆస్తి పంపకాల కోసం పిల్లలు వేరుపడ్డారని, తనను మాత్రం ఒంటరిగా వదిలేశారని చెప్పింది. నా భర్త రాజయ్య తో కలిసి కూలి పని చేసుకుంటూ కష్టపడి సంపాదించుకున్న ఆస్తిని తనకు లేకుండా చేసి, తనను చంపాలని చూస్తున్నారని, తరచూ వేధింపులకు గురి చేస్తున్నారని నా ప్రాణాలకు రక్షణ కల్పించి, ఆ ఇల్లు నా పేరు మీద రాయించండి అంటూ కలెక్టర్ రాహుల్ శర్మ ను వేడుకున్నట్లు బాధిత వృద్ధురాలు రాధమ్మ తెలియజేసింది.

### ఆస్తి తీసుకున్నారు.. చిత్ర హింసలు పెడుతున్నారు : కట్టంగూరి సుజాత, కొత్తపల్లి ఎస్ ఎం



భూపాలపల్లి మండలం కొత్తపల్లికి చెందిన కట్టంగూరి సుజాత(82) అనే మరో వృద్ధురాలు కూడా ప్రజావాణికి వచ్చి, ఇదే బాధను చెప్పుకుంది. ఆస్తి తీసుకున్నారు, కానీ కడుపు నింపే నాధుడు లేడు అంటూ కన్నీరు పెట్టుకుంది. భర్త మధుసూదన్ రెడ్డి చనిపోయిన నాటి నుండి ప్రభుత్వం నుండి వచ్చిన పింఛన్ డబ్బులతో జీవనం కొనసాగిస్తున్న క్రమంలో సుమారు 8 నెలల క్రితం తమ కుమారుడు తన భర్త పేరు మీద ఉన్న భూమిని అమ్ముకున్నాడని, ఆ భూమికి రెండు కోట్ల రూపాయలు రాగా, మొత్తం డబ్బులు తీసుకున్నాడని తెలిపింది. గ్రామంలో తన పరిస్థితి చూసి కులస్తులు, ఇతరులు తనకు ఆర్థిక సాయం అందించారని, అందరి సహాయ సహకారాలతో లక్ష రూపాయలు రాగా, ఆ డబ్బులను కూడా తన కుమారుడు తీసుకొని, తనను వారు నివసిస్తున్న హైదరాబాద్ కు తీసుకెళ్లారని, అయితే గత ఏడాది నుండి కుమారుడు సంపత్ రెడ్డి, కోడలు సరళ ఇద్దరు తనను తిడుతూ, చిత్రహింసలకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. తన డబ్బులు మొత్తం తీసుకొని చిత్రహింసలకు గురి చేస్తున్న కొడుకు, కోడలుపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ను ఆ వృద్ధురాలు వేడుకుంది.

# రైతులపై జులుం ప్రదర్శిస్తే ఊరుకోం!

- గత మోసాలు కళ్లముందే కదలాడుతుండగా.. మరో కుట్ర!
- సర్వే అధికారులను అడ్డుకున్న రైతులు...



**మంగపేట జూలై 27(జనంసాక్షి) :** కరకట్ట నిర్మాణం పేరుతో సాగుతున్న ప్రభుత్వ దౌర్జన్యాలపై అన్నదాతలు తిరుగుబాటు బావుటా ఎగరవేశారు. నష్టపరిహారం చెల్లించే వరకు మా భూములు ఇచ్చే ప్రసక్తే లేదు అంటూ మంగపేట మండలంలోని గంపోనిగూడెం, పొదుమూరు గ్రామ రైతులు గోదావరి పరివాహ ప్రాంతంలో సోమవారం తమ భూముల వద్ద తీవ్ర నిరసన తెలిపారు. ప్రభుత్వ, అధికారుల ఏకపక్ష వైఖరిపై మండిపడుతూ తమ ఆగ్రహాన్ని గట్టిగా చాటుకున్నారు. గతంలో కరకట్ట నిర్మాణం కోసం తాము భూములు ఇచ్చామని, అప్పట్లో రైతులందరికీ నష్టపరిహారం ఇస్తామని అధికారులు పెద్దపెద్ద హామీలు గుప్పించారని, కానీ నేటికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఇచ్చిన మోసపూరిత హామీల నుంచి తేరుకోకముందే, ఇప్పుడు మళ్లీ అదే భూమి సరిపోదంటూ అధికారులు సర్వేయర్లతో కలిసి కొలతలు ప్రారంభించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం గోదావరి పరివాహక ప్రాంతంలోని పంట భూముల్లో రెవెన్యూ సర్వాయర్ల తో వస్తున్నారన్న అధికారుల రాకను పసిగట్టిన రైతులు వెంటనే భూముల వద్దకు చేరుకుని సర్వేను అడ్డుకున్నారు. పూర్తి నష్టపరిహారాన్ని చేతిలో పెట్టిన తర్వాతే సర్వే చేయాలని తేల్చిచెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి నష్టపరిహారం ఇవ్వకుండా, రైతులను నిత్యం మభ్యపెడుతూ, వారి పొట్ట కొట్టేలా ఇబ్బందులకు గురిచేయడం సరైన పద్ధతి కాదని దుయ్యబట్టారు. మా రక్తంధారపోసి పండించిన నేలను నష్టపరిహారం ఇవ్వకుండా లాక్కోవాలని చూస్తే చూస్తూ ఊరుకోం అని మా శవాలపై నుంచి మాత్రమే కరకట్ట నిర్మాణం సాధ్యమవుతుంది అని రైతులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి బాధితులకు పూర్తి స్థాయిలో నష్టపరిహారం చెల్లించాలని, లేనిపక్షంలో ఈ ఉద్యారాన్ని మరింత ఉధృతం చేస్తామని అన్నదాతలు స్పష్టం చేస్తున్నారు.

### కరకట్ట లో భూమిని కోల్పోయిన మానుపల్లి రాకేష్



కరకట్ట నిర్మాణం కొరకు గతంలో భూమి ని ఇచ్చామని నేటి వరకు కూడా ఆ భూమికి నష్టపరిహారం చెల్లించ లేదని మళ్లీ కరకట నిర్మాణం కొరకు అదనంగా భూమి కావాలంటూ మరో 50 మీటర్ల మేర భూమిని తీసుకుంటామని దౌర్జన్యం చేయడం సరైనది కాదు. గతంలోనే మాకున్న భూమిలో సుమారు ఎకరన్నర మేర కరకట్ట నిర్మాణంలో కోల్పోయాము. మళ్లీ తమకున్న కాస్త భూమి కూడా కోల్పోతే పూర్తిగా రోడ్డున మీద పడతాం.. గతంలో కోల్పోయిన భూమికి సంబంధించిన నష్టపరిహారం వెంటనే చెల్లించాలి. లేనిపక్షంలో రైతులందరం కలిసి పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతాము.



# ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో రవీందర్‌కు ఘన నివాళి

**హనుమకొండ ప్రతినిధి జులై 27 (జనం సాక్షి) :** ఇటీవల గుండెపోటుతో ఆకస్మికంగా మరణించిన కాకతీయ విశ్వవిద్యాలయ అధ్యాపకుడు డాక్టర్ ఓ. రవీందర్‌కు సోమవారం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఘనంగా నివాళులర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి అధ్యక్షతన నిర్వహించిన సంతాప సభలో డాక్టర్ ఓ. రవీందర్ చిత్రపటానికి పూలమాల వేసి అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి మాట్లాడుతూ డాక్టర్ ఓ. రవీందర్ అంకితభావం కలిగిన అధ్యాపకుడిగా, సహృదయ వ్యక్తిగా అందరి అభిమానాన్ని చూరగొన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రెహమాన్, ఈసీ మెంబర్ డాక్టర్ చిర్రా రాజు , సహాయక రిజిస్టర్ శ్రీలత, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# జిల్లా నూతన ఎల్డిఎంగా నాగరాజు బాధ్యతలు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జిల్లా నూతన లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ గా బాధ్యతలు స్వీకరిం చిన నాగరాజు సోమవారం ఐడిఓసి కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాగరాజు కలెక్టర్ కు మొక్కను అందజేశారు. ఇంతకుముందు ఎల్డిఎంగా విధులు నిర్వహించిన తిరుపతి హైదరాబాద్ ప్రధాన కార్యాలయానికి బదిలీ కావడంతో, ఆయన స్థానంలో నాగరాజును జిల్లాకు ఎల్డిఎంగా నియమించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగం జిల్లా అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.

# దేవాదుల మోటార్‌ను త్వరితగతిన వినియోగంలోకి తీసుకురావాలి

- నీటి వినియోగంపై సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలి
- ములుగు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



**ములుగు ప్రతినిధి, జులై 27(జనంసాక్షి) :** దేవాదుల ఎత్తిపోతల పథకంలో మరమ్మతులో ఉన్న పని చేయని మోటార్‌ను అత్యంత వేగంగా మరమ్మతులు పూర్తి చేసి తిరిగి పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని, ప్రస్తుత వర్షపాతం పరిస్థితులు, సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని నీటి వినియోగంపై సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కన్నాయిగూడెం మండలం గుట్టల గంగారం దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టులో కొనసాగుతున్న నీటి ఎత్తిపోతల ప్రక్రియ, మోటార్ల పనితీరు, మరమ్మతులో ఉన్న మోటార్ పురోగతి, నీటి సరఫరా పరిస్థితులపై అధికారులను అడిగి తెలుసుకు న్నారు. అధికారులు జిల్లా కలెక్టర్‌కు వివరాలు తెలియజేస్తూ ప్రస్తుతం తొమ్మిది మోటార్లు 24 గంటలపాటు నిరంతరాయంగా నీటిని ఎత్తిపోస్తున్నాయని తెలిపారు. మరమ్మతులో ఉన్న మరో మోటార్‌ను మేఘా సంస్థ సాంకేతిక నిపుణులు పరిశీలిస్తున్నారని, మెకానికల్ సీల్ వద్ద తలెత్తిన లోపాన్ని గుర్తించి మరమ్మతులు చేపడుతున్నట్లు వివరించారు. ఈ సందర్భం గా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మెకానికల్ సీల్‌ను పూర్తిగా తెరిచి లోపాన్ని ఖచ్చితంగా గుర్తించి, తలెత్తిన సమస్యను వేగవంతంగా పరిష్కరించి మోటార్‌ను త్వరితగతిన పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని సంబంధిత శాఖ అధికారులతో పాటు ఏజెన్సీ సంస్థ ప్రతినిధు లను ఆదేశించారు. రానున్న రోజుల వర్షపాతం, నీటి లభ్యత,త్రాగు,సాగునీటి అవసరాలను పరిగణనలోకి తీసుకుని నీటి వినియోగంపై సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసి వెంటనే సమర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండింగ్ ఇంజనీర్ రామ్మోహన్, డిఈ శరత్, ఏఈ లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుతో లబ్ధి పొందాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్




**మంచిర్యాల ప్రతినిధి జూలై 27 (జనంసాక్షి) :** ప్రస్తుతం నెలకొన్న ఎల్ నినో ప్రభావాన్ని అధిగమించేందుకు రైతులు వరి సాగు మినహా ప్రత్యామ్నాయ పంటల సాగు చేసి లబ్ధి పొందాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం మంచిర్యాల జిల్లాలోని భీమారం మండల కేంద్రంలో గల రైతు వేదికను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావంతో ఇప్పటివరకు తక్కువ వర్షపాతం నమోదు అయిందని, రాబోవు 3 నెలలలో కూడా ఈ పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని తెలిపారు. నీటి లభ్యతలో లోటు ఉండడంతో వరి సాగులో నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని తెలిపారు. నీటి ఇబ్బంది కారణంగా రైతులు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసి లబ్ధి పొందాలని తెలిపారు. భూగర్భ జలం తక్కువగా ఉందని, రైతులు ఆరుతడి పంటల వైపు దృష్టి సారించాలని, పప్పుధాన్యాలు, పత్తి, కూరగాయలు, ఆయిల్ పామ్ వంటి నీరు తక్కువ అవసరం ఉన్న పంటలు సాగు చేయాలని, అవసరమైన రాయితీ విత్తనాలు, ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తక్కువ సమయంలో పంట చేతికి వచ్చే తక్కువ నీటి అవసరం ఉన్న పంటలు సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందని, వ్యవసాయ విస్తరణ అధికారులు తమ పరిధిలోని గ్రామాలలో సమావేశాలు ఏర్పాటు చేసి రైతులకు వివరించాలని తెలిపారు. మండలాలు, గ్రామాల వారీగా సమావేశాలు నిర్వహించి ఆదాయం వచ్చే పంటలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, భూసార పరీక్షలు నిర్వహించి కార్డులు అందించడం జరుగుతుందని, పంట సాగుకు అనుగుణంగా యూరియా అందించడం జరుగుతుందని తెలిపారు. మండల కేంద్రంలో నిర్మిస్తున్న మోడల్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆసుపత్రిలోని వార్డులు, మందుల నిల్వలు, ల్యాబ్, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని, పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని తెలిపారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
28 జూలై 2026

# విద్యార్థుల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తు

- అర్ధాకలితో ఏ బిడ్డ బడికి వెళ్లొద్దు
- 'పీపుల్స్ మార్చ్' నుంచే ప్రజాహిత ఇందిరమ్మ పథకాలు
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**మధిర, జూలై 27 (జనంసాక్షి) :** ఉచిత పథకాలు అనేవి ఈ రాష్ట్ర ప్రజలపై ప్రభుత్వం పెట్టే పెట్టుబడి అని ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క స్పష్టంగా ప్రకటించారు. మిడిమిడి జ్ఞానంతో తెలిసి తెలియక చాలామంది ఉచిత పథకాల పైన విమర్శ చేస్తున్నారని ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. పరిశ్రమలు ప్రాజెక్టులు ఇతర అనేక అంశాలపై ప్రభుత్వం పెట్టుబడి పెట్టినట్లుగానే పేదలు, దళితులు, వెనుకబడిన వర్గాలు సహా రాష్ట్రవ్యాప్తంగా ప్రజలందరి పైన ప్రభుత్వం పెట్టుబడి పెడుతుందని ఆయన అన్నారు. ఈ పెట్టుబడి ఫలితాలు ప్రజలు అభివృద్ధి చెంది ఆర్థికంగా, సామాజికంగా ముందుకు వెళ్లేందుకు దోహదం చేసేవిగా ఉంటాయని ఆయన అన్నారు. మధిర నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు పోషకాహార అల్పాహారాన్ని అందించే సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ సెంటర్ ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో పుట్టిన ఏ బిడ్డ కూడా అర్ధాకలితో పాఠశాలకు వెళ్లకూడదన్నదే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన ఆశయమని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తు అని, ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ పిల్లల శారీరక, మానసిక వికాసం కోసం ఉదయమే రుచికరమైన, శుచి-శుభ్రతతో కూడిన పౌష్టికాహారాన్ని అందించేందుకు ప్రజాప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. బడ్జెట్‌లో ప్రకటించిన విధంగానే రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత అల్పాహార పథకాన్ని మధిర నియోజకవర్గంలో ప్రారంభించినట్లు చెప్పారు. ప్రజా ప్రభుత్వంలో ఇందిరమ్మ రాజ్యంలో ఏ బిడ్డ కూడా అర్ధాకలితో పాఠశాలకు వెళ్లకూడదు.. ఇక్కడ పుట్టిన ప్రతి బిడ్డ.. రాష్ట్ర భవిష్యత్తు అని ఆయన చెప్పారు వారి భవిష్యత్తే మన భవిష్యత్తు. అటువంటి బిడ్డల భవిష్యత్తు కోసం ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంతృప్తికరంగా ఉదయం పూట బ్రేక్ ఫాస్ట్ చేసి చదువుకోవాలని అన్నారు. రుచికరమైన, శుచి శుభ్రతతో కూడిన న్యూట్రిషియస్ ఫుడ్ని మనం అందించాలని చెప్పిఈ క్యాబినెట్ చేసిన నిర్ణయం మేరకు బడ్జెట్లో ఈ పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని ఆయన చెప్పారు. అర్థాలతో పాఠశాలకు వచ్చి అధ్యాపకులు చెప్పే పాఠాలను సరిగ్గా వినలేక, ఆకలితో సతమతమవుతూ చదువు మీద దృష్టి పెట్టలేని పరిస్థితి ఏ విద్యార్థికి రాకూడదనే ఆలోచనతో ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం ఈ ఈ నిర్ణయం తీసుకుందని ఆయన చెప్పారు. మానవ వనరులుమన రాష్ట్ర సంపద. ఏ రాష్ట్ర అభివృద్ధికైనా సహజ వనరులు ఎంత అవసరమో.. సమర్థవంతమైన మానవ వనరులు కూడా అంతే అవసరమని భట్టి విక్రమార్క నొక్కి వక్కాణించారు. అత్యంత ప్రతిభావంతులుగా తయారైనటువంటి మానవ వనరులు ఉన్నటువంటి రాష్ట్రం గాని, దేశం గాని ప్రపంచంలో అత్యంత శక్తివంతంగా మారుతుందని ఆయన అన్నారు.రాష్ట్రానికే కాదు దేశానికి, ప్రపంచానికి కూడా దశా దిశా నిర్దేశం చేయగలిగినటువంటి మానవ వనరుల్ని సానబెట్టిన వజ్రాల్లాగా ప్రపంచం మీదికి మనం వదిలిపెట్టగలగాలి. అటువంటి వజ్రాల్ని తయారు చేసుకోవాల్సిన తరుణంలో మార్నింగ్ బ్రేక్ ఫాస్ట్ పథకాన్నిరాష్ట్రవ్యాప్తంగా మొదలుపెట్టే కార్యక్రమానికి నాంది పలికామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 27 లక్షల మంది విద్యార్థులకి ఒకటే సమయానికి వేడిగా అల్పాహారం అందించడం అంటే ఇది ఒక చారిత్రాత్మకమైన నిర్ణయం. ఈ దేశ చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లెక్కించాల్సిన అంశమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల స్థాయి అధికారులు, వివిధ హోదాల్లోని ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## బాల భవన్ విద్యార్థుల కోసం హైదరాబాద్ విహారయాత్ర

- జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, జూలై 27 (జనంసాక్షి) :** మహిళా శిశు సంక్షేమ శాఖ పరిధిలోని మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో నిధులను వినియోగిస్తూ జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశాలతో హైదరాబాద్ కు బాల భవన్ విద్యార్థినుల కోసం విహారయాత్ర ఏర్పాటు చేశారు.ఈ విహారయాత్రకు బయలుదేరుతున్న బాల భవన్ విద్యార్థులకు కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ విద్యార్థినులకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర వికాసానికి, మానసిక ఉల్లాసానికి ఇటువంటి విహారయాత్రలు ఎంతో దోహదపడతాయని తెలిపారు.హైదరాబాద్ పర్యటనలో భాగంగా విద్యార్థులు చారిత్రక, సాంస్కృతిక, విజ్ఞాన సంబంధిత ప్రాంతాలను సందర్శించి కొత్త విషయాలను నేర్చుకోవాలని ఆకాంక్షించారు.ఆడపిల్లల చదువు, వారి సాధికారతే లక్ష్యంగా బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం ద్వారా అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి కె.నర్సింహారావు , ఏసీడీపీవో కిరణ్మయి, డీసీపీవో రవికుమార్ మహిళా సాధికారత కేంద్ర జిల్లా కో ఆర్డినేటర్ చైతన్య, సిబ్బంది, బాలభవన్ సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్‌పవార్



**సూర్యాపేట ప్రతినిధి, జూలై 27 (జనంసాక్షి) :** ప్రజల సమస్యల పరిష్కారమే వేదికగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా,డివిజన్ స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు.పాత ప్రజావాణి పోర్టల్‌లో ఇంకా పరిష్కారం కాకుండా ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు.ముఖ్యంగా రాష్ట్ర ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను తక్షణమే పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని తెలిపారు. ప్రజలు పెట్టుకున్న అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా, నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రెవెన్యూ డివిజన్ అధికారి స్థాయిలో ప్రారంభమైన ప్రజావాణి కార్యక్రమంపై కూడా సమీక్షించారు.డివిజన్ స్థాయి ప్రజావాణికి అన్ని శాఖల డివిజనల్ అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు.స్థానిక సమస్యలు స్థానికంగానే పరిష్కారమైతే ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయని పేర్కొన్నారు.భూ సమస్యలకి సంబంధించి 60 దరఖాస్తులు, డిడబ్ల్యుఓ 11, డిపిఓ 6, డిఎంహెచ్ఓ 5, మిగిలిన 16 దరఖాస్తులు వివిధ శాఖలకు చెందినవని తెలిపారు.మొత్తం 98 దరఖాస్తులు వచ్చాయని, వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని అన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.హరిసింగ్, డిఆర్ఓ ప్రేమ్ రాజ్, జిల్లా పరిషత్ సీఈఓ శిరీష, డిఆర్డిఏ పిడి సన్యాసయ్య, డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ, సిపిఓ కిషన్, డిఈఓ అశోక్,జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు లేక గర్భిణీకి మార్గమధ్యలో ప్రసవం

- చింతకుంట గ్రామంలో హృదయవిదారక ఘటన
- పాలకుల నిర్లక్ష్యంపై ఆదివాసుల ఆగ్రహం





**బూర్గంపహాడ్, జూలై 27 (జనంసాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండలం చింతకుంట గ్రామంలో రహదారి సౌకర్యం లేకపోవడంతో ఓ గర్భిణీ మహిళ మార్గమధ్యలో అంబులెన్స్‌లోనే ప్రసవించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ ఘటన గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల దుస్థితికి అద్దం పట్టడంతో పాటు పాలకుల నిర్లక్ష్యంపై ఆదివాసుల్లో తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తించింది. చింతకుంట గ్రామానికి చెందిన సోడి మార్త (30)కు సోమవారం ఉదయం పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. గ్రామానికి వెళ్లే రహదారి పూర్తిగా గుంతలమయంగా ఉండటంతో అంబులెన్స్ పైలట్ విజయభాస్కర్ తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటూ గ్రామానికి చేరుకుని గర్భిణిని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేశారు. అయితే, అధ్వాన్నమైన రహదారి కారణంగా వాహనం తీవ్ర కుదుపులకు గురికావడంతో గర్భిణీకి నొప్పులు మరింత పెరిగాయి. ఆసుపత్రికి చేరుకునే అవకాశం లేకపోవడంతో అంబులెన్స్‌ను మార్గమధ్యలో నిలిపివేయగా, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (ఈఎంటి) రాధ సమయస్ఫూర్తితో అంబులెన్స్‌లోనే ప్రసవం నిర్వహించారు. మార్త పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లి, శిశువును భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించగా ఇద్దరూ క్షేమంగా ఉన్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు. ఈ ఘటనపై చింతకుంట గ్రామస్థులు, ఆదివాసీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చే ప్రజాప్రతినిధులు గెలిచిన తర్వాత గ్రామాల సమస్యలను పూర్తిగా విస్మరిస్తున్నారని ఆరోపించారు. కనీస రహదారి సౌకర్యం లేక గర్భిణీలు ప్రాణాలతో పోరాడాల్సిన పరిస్థితి దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆపత్కాలంలో ప్రాణాలను కాపాడిన 108 సిబ్బంది రాధ, విజయభాస్కర్‌ల సేవలను గ్రామస్థులు ప్రశంసించారు. ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చింతకుంట గ్రామానికి వెంటనే రహదారిని నిర్మించి, గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ఖమ్మంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులను పరిశీలించిన మంత్రి తుమ్మల



**ఖమ్మం కార్పొరేషన్, జూలై 27 (జనం సాక్షి) :** నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులు పురోగతి రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఖమ్మం నగరంలో వరద గండం లేకుండా అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఖానాపురం చెరువు అలుగు వరద పోటెత్తగా అనేక డివిజన్లు ముంపుకు గురయ్యాయని మంత్రి అన్నారు. వర్షాల వరద నీటిని తరలించేందుకు వంద కోట్ల తో అండర్ గ్రౌండ్ పైప్ లైన్ పనులు చేపట్టినట్లు తెలిపారు.ఖమ్మం నగరానికి తాగు నీటి ఎద్దడి లేకుండా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్లు మంత్రి అన్నారు. కృష్ణా నది నీళ్లు సరఫరా కానీ పక్షంలో గోదావరి నీళ్లతో పరిష్కారం చేయనున్నామన్నారు. గోదావరి జలాలు మున్నేరు వరకు తరలించామని తెలిపారు.ఖమ్మం నగరంలో వరద ముంపు తాగు నీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చేయనున్నట్లు తెలిపారు. 200 కోట్లతో అమృత్ పథకం పనులు సాగుతున్నాయన్నారు. ఆటోమేషన్ విధానంలో అమృత్ పథకం ద్వారా రక్షిత తాగునీరు సరఫరా చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఖమ్మం నగరంలో తాగు నీటి పథకం అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులకు సహకరించిన సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా మంత్రి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం నగర పాలక సంస్థ పబ్లిక్ హెల్త్ ఎస్ఈ రంజిత్, అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## శంభీపూర్ కమ్యూనిటీ హాల్‌ను వెంటనే సిఎంసి స్వాధీనం చేసుకోవాలి



**నిజాంపేట్, జూలై 27 (జనం సాక్షి) :** శంభీపూర్ గ్రామంలోని సర్వే నెం.181లో ప్రభుత్వ నిధులతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను వెంటనే సిఎంసి స్వాధీనం చేసుకొని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతూ ఆకుల సతీష్ బృందం ఆధ్వర్యంలో దుండిగల్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆకుల సతీష్ మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ హయాంలో ప్రజల ప్రయోజనం కోసం నిర్మించిన కమ్యూనిటీ హాల్ ఇప్పటికీ సిఎంసి ఆధీనంలోకి రాకపోవడం విచారకరమన్నారు. కొంతమంది వ్యక్తులు, వారిలో బిఆర్ఎస్ నాయకులు కూడా ఉన్నారని స్థానికంగా ఆరోపణలు ఉన్న నేపథ్యంలో, కమ్యూనిటీ హాల్‌ను తమ ఆధీనంలో ఉంచుకొని వివాహాలు, ఇతర శుభకార్యాలకు అద్దెకు ఇస్తూ ఆదాయం పొందుతున్నారనే అంశంపై సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలు నిర్ధారితమైతే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా గత ఆరు సంవత్సరాలుగా కమ్యూనిటీ హాల్ ద్వారా వచ్చిన ఆదాయంపై ప్రత్యేక ఆడిట్ నిర్వహించి, చట్టవిరుద్ధంగా వసూలు చేసిన మొత్తాలను ప్రభుత్వ ఖజానాకు జమ చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ పంచాయతీ నుండి దుండిగల్ మున్సిపాలిటీకి, అనంతరం సిఎంసి లో విలీనమైన తర్వాత కూడా ఈ ప్రభుత్వ ఆస్తిని ఎందుకు స్వాధీనం చేసుకోలేదనే అంశంపై విచారణ జరిపి, పరిపాలనా నిర్లక్ష్యం లేదా బాధ్యతా రాహిత్యం ఉంటే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిఎంసి కమ్యూనిటీ హాల్‌ను స్వాధీనం చేసుకున్న అనంతరం ప్రజలకు పారదర్శకంగా నిర్వహిస్తూ రూ. 5,000 అద్దెతో అందుబాటులో ఉంచితే పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో ఉపశమనం కలుగుతుందని ఆకుల సతీష్ పేర్కొన్నారు. దీంతో వివాహాలు, ఇతర సామాజిక కార్యక్రమాలను తక్కువ వ్యయంతో నిర్వహించుకునే అవకాశం ప్రజలకు లభిస్తుందని అన్నారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా కమ్యూనిటీ హాల్‌ను వెంటనే ఆధీనంలోకి తీసుకొని ప్రజలకు అందుబాటులో ఉంచాలని, ఆరోపణలపై నిష్పక్షపాత విచారణ నిర్వహించి, చట్ట ప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆకుల సతీష్ బృందం డిప్యూటీ కమిషనర్‌ను కోరింది. ఈ కార్యక్రమంలో పిబి శ్రీనివాస్, ఎల్ల స్వామి అంకం సతీష్ పాల్గొన్నారు.

## నల్లగొండలో బ్యాలెట్ బాక్స్ కలకలం

- స్ట్రాంగ్ రూమ్‌లో ఉండాల్సిన బ్యాలెట్ బాక్స్ పాత ఇనుప సామాను కొట్టులో ప్రత్యక్షం




**నల్లగొండ ప్రతినిధి, జూలై 27 (జనం సాక్షి) :** నల్లగొండ పట్టణంలో సంచలనం రేపే ఘటన వెలుగులోకి వచ్చింది. జిల్లా కలెక్టర్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న శివగంగా పాత ఇనుప సామాను దుకాణంలో తెలంగాణ ఎన్నికల సంఘానికి చెందినట్లు కనిపిస్తున్న ఓ బ్యాలెట్ బాక్స్ ప్రత్యక్షమవడం పలు అనుమానాలకు తావిస్తోంది. సాధారణంగా ఎన్నికల ప్రక్రియలో ఉపయోగించే బ్యాలెట్ బాక్సులు ఎన్నికలు ముగిసిన అనంతరం సంబంధిత అధికారుల పర్యవేక్షణలో స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరుస్తారు. అలాంటి బ్యాలెట్ బాక్స్ ఓ పాత ఇనుప సామాను దుకాణంలో కనిపించడం చర్చనీయాంశంగా మారింది. బాక్స్‌పై ఉన్న అక్షరాలను పరిశీలిస్తే అది జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన బ్యాలెట్ బాక్స్‌గా కనిపిస్తున్నట్లు తెలుస్తోంది.అయితే ఈ బ్యాలెట్ బాక్స్ స్ట్రాంగ్ రూమ్ నుంచి బయటకు ఎలా వచ్చింది? ఎన్నికల సంఘం అధికారికంగా పాత సామానుగా వేలం వేసిందా? లేక మరే ఇతర మార్గంలో బయటకు చేరిందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ ఘటనతో ఇలాంటి బ్యాలెట్ బాక్సులు మరెన్ని బయటకు వచ్చాయనే సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి.మరోవైపు, బాక్స్‌ను కట్టర్‌తో కోసిన ఆనవాళ్లు కనిపించడం మరిన్ని అనుమానాలకు కారణమవుతోంది. దీనిపై దుకాణ యజమానిని ప్రశ్నించగా, సుమారు మూడు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తి ఈ బాక్స్‌ను తమకు విక్రయించినట్లు ఆయన తెలిపినట్లు సమాచారం. ఈ ఘటనపై ఎన్నికల అధికారులు, జిల్లా యంత్రాంగం సమగ్ర విచారణ చేపడతారా? బ్యాలెట్ బాక్స్ అక్కడికి ఎలా చేరిందనే అంశంపై నిజానిజాలు వెలికితీస్తారా? సంబంధిత బాధ్యులపై చర్యలు తీసుకుంటారా? అనే అంశాలపై ఇప్పుడు అందరి దృష్టి నెలకొంది.

## బాధితుల ఫిర్యాదులను పరిశీలించిన జిల్లా ఎస్పీ నరసింహా



**సూర్యాపేట ప్రతినిధి, (జనంసాక్షి) :** సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా ఎస్పీ నరసింహ ఫిర్యాదుదారుల నుండి వినతులు స్వీకరించారు.జిల్లా పరిధిలోని వివిధ మండలాల నుంచి వచ్చిన బాధితులు వివిధ సమస్యలపై ఫిర్యాదులకు సంబంధించి బాధితులు వినతులు సమర్పించారు.ఈ సందర్భంగా ఎస్పీ ప్రతి ఒక్క బాధితుడి సమస్యను విని, వాటి పరిష్కారం కోసం తక్షణ చర్యలు తీసుకునేలా సంబంధిత పోలీస్ అధికారులుతో ఫోన్ ద్వారా మాట్లాడి అవసరమైన సూచనలు జారీ చేశారు. ప్రజలకు త్వరితగతిన న్యాయం అందేలా, వారి సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలనే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.చట్టబద్ధమైన విధానంలో ప్రతి ఫిర్యాదును పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# ఓటు హక్కు పోతే పౌరసత్వమే ప్రశ్నార్థకం

- ఓటు హక్కు పరిరక్షణే ప్రజాస్వామ్యానికి పునాది
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**మధిర, జూలై 27 (జనంసాక్షి) :** భారత రాజ్యాంగం పౌరులందరికీ కల్పించిన ఓటు హక్కును పరిరక్షించడమే ప్రజాస్వామ్యానికి అసలైన సూత్రమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఓటర్ల జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియలో కాంగ్రెస్ పార్టీ బిఎల్ఏలు బాధ్యతాయుతంగా వ్యవహరించారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కితాబిచ్చారు. మధిర నియోజకవర్గానికి చెందిన బిఎల్ఏలు, వారి కుటుంబ సభ్యులతో మాటూరుపేటలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఇతర రాజకీయ పార్టీలకు చెందిన ఓటర్ల పేర్లను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికత ద్వారా గుర్తించి తొలగించే కుట్రలు జరుగుతున్నాయని భట్టి ఆరోపించారు. బీజేపీ నేతృత్వంలో ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో ఈ రకంగా ఓట్లను తొలగించి లబ్ధి పొందారని ఆరోపించారు. ఇది ప్రజాస్వామ్యానికే తీవ్ర ప్రమాదకరమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఓటు హక్కును కోల్పోతే భవిష్యత్తులో రేషన్ కార్డులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఆఖరికి ఈ దేశ పౌరసత్వం కూడా ప్రశ్నార్థకమై డిటెన్షన్ సెంటర్లకు వెళ్లాల్సిన దారుణ పరిస్థితులు వస్తాయని హెచ్చరించారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతీ ఒక్కరికీ కాపాడే బాధ్యత కాంగ్రెస్ సైనికులుగా బిఎల్ఏలదేనని స్పష్టం చేశారు. సొంత వ్యాపారాలు, కుటుంబ వ్యవహారాలను పక్కనపెట్టి నెల రోజులుగా సామాజిక బాధ్యతగా పనిచేస్తున్న బిఎల్ఏలను, వారి వెనుకనుంచి ప్రోత్సహిస్తున్న కుటుంబ సభ్యులను భట్టి విక్రమార్క ప్రత్యేకంగా అభినందించారు. పార్టీ కోసం నిరంతరం కష్టపడే ప్రతీ బిఎల్ఏ కుటుంబం బాధ్యతను, వారి పిల్లల చదువు, ఉద్యోగ అవకాశాలలో సహకారాన్ని పార్టీ తీసుకుంటుందని ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. మధిర నియోజకవర్గంలో ఇప్పటివరకు దాదాపు 90 శాతం ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. మిగిలిన 10 శాతంలో చనిపోయిన వారి వివరాలను తొలగించడం, శాశ్వతంగా వేరే ప్రాంతాలకు వలస వెళ్లిన వారిని గుర్తించడం వంటి పనులను బూత్‌ల వారీగా పరిశీలించి 100 శాతం నమోదు ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్న పీసీసీ ప్రతినిధులను అభినందిస్తూ, బిఎల్ఏలు ఎటువంటి విసుగు చెందకుండా సమన్వయంతో పనిచేసి ఈ నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని ఉప ముఖ్యమంత్రి కోరారు.







## ఆగస్టులో రూ.25వేల కోట్ల ఐపీఓలు

**న్యూఢిల్లీ:**ప్రాథమిక మార్కెట్‌లో ఐపీఓల సందడి పెరుగుతోంది. స్టాక్ మార్కెట్ ఒడుదొడుకులతో, ఈ ఏడాది తొలి అర్ధభాగంలో ఆచితూచి అడుగేసిన కంపెనీలు.. ఇప్పుడు తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ద్వారా నిధుల సమీకరణకు ఆసక్తి చూపుతున్నాయి. ఆగస్టులో డజనుకు పైగా కంపెనీలు ఐపీఓలకు సన్నాహాలు చేసుకుంటున్నాయి. ఆన్‌లైన్‌లో ఆర్డర్లు తీసుకుని, నిత్యావసరాలు డెలివరీ చేసే జెప్టోతో పాటు ట్రూహోమ్ ఫైనాన్స్, లాజిస్టిక్స్ సంస్థ షిప్‌రాకెట్ వంటి కంపెనీలు ఉన్నాయి. ఈ కంపెనీలన్నీ కలిపి రూ.25,000 కోట్లకు పైగా నిధులు సమీకరించనున్నాయి. వచ్చే నెలలో రాబోయే అతి పెద్ద ఐపీఓల్లో జెప్టో ఒకటి. తాజా షేర్ల జారీ ద్వారా రూ.8,010 కోట్లు సమీకరించనుంది. ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్)లో మరో 11.34 కోట్ల ఈక్విటీ షేర్లను సంస్థ విక్రయించనుంది. హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ ట్రూహోమ్ ఐపీఓ ద్వారా రూ.3,000 కోట్లు సమీకరించనుంది. ఇందులో తాజా షేర్ల జారీ ద్వారా రూ.1,500 కోట్లు, ఓఎఫ్ఎస్‌లో రూ.1,500 కోట్లు సమీకరించనుంది. ఎలివేట్ క్యాంపసెస్ తాజా షేర్ల జారీ ద్వారా రూ.2,550 కోట్లు; షిప్‌రాకెట్ తాజా షేర్ల జారీ-ఓఎఫ్ఎస్ కలిపి రూ.2,342.35 కోట్లు, ఇన్నోవేటివ్ వ్యూ ఇండియా పూర్తిగా ఓఎఫ్ఎస్ ద్వారా రూ.2,000 కోట్ల చొప్పున నిధులు సమీకరించనున్నాయి. మిల్కీ మిస్ట్ డెయిరీ ఫుడ్ కూడా వచ్చే నెలలోనే రూ.1,553 కోట్ల ఐపీఓకు రానుంది. ఇది కూడా పూర్తి ఓఎఫ్ఎస్ విధానంలోనే నిధులు సమీకరించనుంది.ఇవే కాకుండా ధూత్ ట్రాన్స్‌మిషన్, ఏఆర్‌సీసమీకరించనున్నాయి. ఏఆర్‌సీఐఎల్ (అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ ఇండియా లిమిటెడ్), అర్టీ ఇండస్ట్రీస్, గజా ఆల్టర్నేటివ్ అసెట్ మేనేజ్‌మెంట్, రేస్ ఆఫ్ బిలీఫ్, హై-టెక్ ఇంజినీర్స్, శంకేష్ జువెలర్స్, లెర్న్‌ఫ్లూయెన్స్ ఎడ్యుకేషన్స్ సంస్థలు కూడా ఆగస్టులో ఐపీఓ ద్వారా నిధులు సమీకరించే యత్నాల్లో ఉన్నాయి.ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 36 కంపెనీలు ఐపీఓలకు వచ్చాయి. ఇందులో ఈ నెలలోనే 9 నమోదయ్యాయి. మణిపాల్ హెల్త్ ఎంటర్‌ప్రైజెస్, జునిపర్ గ్రీన్ ఎనర్జీ పబ్లిక్ ఇష్యూలు ఈ నెల 29, 30 తేదీల్లో ప్రారంభం కానున్నాయి. ఈ వారంలోనే ఎంవీ ఎలక్ట్రోసిస్టమ్స్ కూడా ఐపీఓకు వచ్చేందుకు సిద్ధమవుతోంది.

# వరుస నష్టాలకు బ్రేక్..

- సెన్సెక్స్ +776, నిఫ్టీ +228
- లిస్టింగ్ రోజే 500% లాభాలు ఆర్జించిన కంపెనీ!




**ముంబయి:**దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు సోమవారం రాణించాయి. పశ్చిమాసియా ఘర్షణలు తాత్కాలికంగా చల్లబడటంతో చమురు ధరలు దిగొచ్చాయి. దీంతో వరుసగా ఐదు సెషన్లలో సూచీల నష్టాలకు బ్రేక్ పడింది. ఐటీ, బ్యాంక్స్, కన్జూమర్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు కలిసొచ్చింది.సెన్సెక్స్ 776.01 పాయింట్లు లాభపడి 76,835.78 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 228.50 పాయింట్లు ఎగబాకి 23,995.95 వద్ద ముగిసింది. సెన్సెక్ 30లో హెచ్‌డీఎఫ్‌సీ, పవర్‌గ్రిడ్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు మాత్రమే నష్టాల్లో ముగిశాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.90వద్ద ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 87.93 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్స్ ధర 4,089.43 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

**లాభాలకు కారణాలు ఇవీ..**

పశ్చిమాసియాలో దాడులకు తాత్కాలికంగా బ్రేక్ పడటంతో చమురు మంటలు చల్లారాయి. దీంతో ఇంధన దిగుమతులు, ద్రవ్యోల్బణ ఆందోళనలు తగ్గాయి. దీంతో దేశీయ మార్కెట్ సూచీలు లాభాలబాట పట్టాయి. టాటా కన్జూమర్, ఎన్‌టీపీసీ, ఐడీఎఫ్‌సీ బ్యాంక్, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ షేర్లలో ర్యాలీ మార్కెట్లకు కలిసొచ్చింది. ఫెడ్ వడ్డీ రేట్లు యథాతథంగా కొనసాగుతాయన్న అంచనాలు కూడా సూచీలను బలపరిచింది.

**వాటాదారులకు కాసుల వర్షం..**

ఏఐ బూమ్ కారణంగా సెమీ కండక్టర్ విభాగానికి డిమాండ్ పెరగడంతో ఆ రంగానికి చెందిన కంపెనీలు భారీగా లాభాలు ఆర్జిస్తున్నాయి. తాజాగా ఓ కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజీల్లో అదరగొట్టి వాటాదారులకు కాసుల వర్షం కురిపిస్తోంది. చైనాకు చెందిన మెమొరీ చిప్ తయారీ కంపెనీ చాంగ్‌క్సిన్ మెమొరీ టెక్నాలజీస్ షాంఘై స్టాక్ ఎక్స్ఛేంజీల్లో సోమవారం లిస్టింగ్ అయ్యి.. తొలిరోజే 500 శాతానికి పైగా లాభాలను ఆర్జించినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి.సీఎక్స్ఎంటీ కంపెనీ 57.9 బిలియన్ యువాన్లు (భారత కరెన్సీ ప్రకారం.. దాదాపు రూ.82 వేల కోట్లు) ఐపీఓ ద్వారా నిధులను సమీకరించింది. దీంతో ఆసియాలోనే అతిపెద్ద ఐపీఓగా నిలిచింది. షేరు ధర 8.66 యువాన్లుగా నిర్ణయించింది. సోమవారం ఇంట్రాడేలో షేర్ ధర ఓ దశలో ఏకంగా 49.50 యువాన్లు పలికింది. దీంతో మార్కెట్ విలువ 3.56 ట్రిలియన్ యువాన్లకు చేరడం గమనార్హం.

**సీఎక్స్ఎంటీ కంపెనీ వివరాలివే..**

సీఎక్స్ఎంటీ కంపెనీ మెమొరీ చిప్‌లను తయారు చేస్తుంది. అమెరికా ఆంక్షల నేపథ్యంలో సెమీకండక్టర్ విభాగంలో చైనా సొంతంగా ఎదిగేందుకు ప్రయత్నిస్తోంది. ప్రపంచంలోనే ఆఖీంఓ మార్కెట్‌లో సుమారు 8 శాతం వాటాతో సీఎక్స్ఎంటీ నాలుగో అతిపెద్ద కంపెనీగా కొనసాగుతోంది.

**ఘర్షణలకు బ్రేక్..**

దేశీయ మార్కెట్లు సోమవారం లాభాల్లో ప్రారంభమయ్యాయి పశ్చిమాసియాలో ఘర్షణలకు తాత్కాలికంగా బ్రేక్ పడటంతో చమురు దిగొచ్చాయి. దాంతో వరుసగా ఐదు సెషన్లలో నష్టాలు చవిచూసిన సూచీలు.. నేడు లాభాల బాటపట్టాయి.ఉదయం 9.47 గంటల సమయంలో సెన్సెక్స్ 627 పాయింట్ల లాభంతో 76,692 వద్ద కదలాడుతోంది. నిఫ్టీ 181 పాయింట్లు ఎగబాకి, 23,948 వద్ద ట్రేడవుతోంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ కాస్త కోలుకుంది. 96.18 వద్ద ప్రారంభమైంది. నిఫ్టీ సూచీలో ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, ఇన్ఫోసిస్, ఎటర్నల్, ఏషియన్ పెయింట్స్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు లాభాల్లో ఉండగా.. ఓఎన్‌జీసీ, విప్రో, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, బజాజ్ ఆటో, భారతీ ఎయిర్‌టెల్ స్టాక్స్ నష్టాల్లో కొనసాగుతున్నాయి.అమెరికా దాడులు నిలిపివేస్తే.. తాము కూడా ఆపేస్తామని ఇరాన్ ప్రకటించడంతో చమురు మంటలు కాస్త తగ్గాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 92 డాలర్లకు దిగొచ్చింది. ఇంధన దిగుమతులపై ఆధారపడిన భారత్‌కు ఇది సానుకూలాంశం కావడంతో సూచీల సెంటిమెంట్ బలపడింది. ఇక, టాటా కన్జూమర్, ఎన్‌టీపీసీ, ఐడీఎఫ్‌సీ బ్యాంక్, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ షేర్లలో ర్యాలీ మార్కెట్లకు కలిసొచ్చింది. ఫెడ్ వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచుతారన్న అంచనాలు కూడా లాభాలకు కారణమయ్యాయి.

## మళ్లీ ధరలు పెంచిన షావోమీ

మెమొరీ చిప్‌ల కొరత, విడిభాగాల తయారీ ఖర్చు భారంగా మారడంతో టెక్ కంపెనీలు ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నాయి. వరసపెట్టి స్మార్ట్‌ఫోన్ ధరలను పెంచేస్తున్నాయి. శాంసంగ్, వివో, వన్‌ప్లస్ వంటి కంపెనీలు ఇప్పటికే పలుమార్లు తమ స్మార్ట్‌ఫోన్ ధరలను పెంచాయి. మరోసారి ప్రముఖ స్మార్ట్‌ఫోన్ కంపెనీ షావోమీ తన 5 మోడళ్ల ధరలను పెంచుతున్నట్లు ప్రకటించింది. మోడల్‌ను బట్టి రూ.5 వేల వరకు ధరల పెంపు చేపట్టింది. ఇటీవల వివో కూడా ఎతిలనీ చీ300 ఖతీనీ ధరను ఏకంగా రూ.10 వేల వరకు పెంచడం గమనార్హం.



## బ్యాంక్ ఆఫ్ బరోడాలో భారీగా డేటా లీక్..

### స్పష్టతనిచ్చిన అధికారులు

**న్యూఢిల్లీ:**బ్యాంక్ ఆఫ్ బరోడాలో భారీగా డేటా లీక్ అయినట్లు వచ్చిన వార్తలపై బ్యాంకు అధికారికంగా స్పందించింది. బ్యాంకులోని ఓ అధికారి ఇ-మెయిల్ ఖాతాను హ్యాక్ చేయడం ద్వారా హ్యాకర్లు కొంత డేటాను యాక్సెస్ చేశారని తెలిపింది. ఈ ఘటనను వెంటనే గుర్తించి.. తక్షణ నివారణ చర్యలు చేపట్టామని వెల్లడించింది. బ్యాంక్ కోర్ బ్యాంకింగ్ సిస్టమ్‌లలోకి ఎవరూ ప్రవేశించలేదని..అవి సురక్షితంగానే ఉన్నాయని పేర్కొంది. ఈ విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించడానికి సమగ్ర ఫోరెన్సిక్ దర్యాప్తు చేపట్టామంది. వినియోగదారుల డేటా భద్రతే తమకు అత్యంత ప్రధాన్యమని తెలిపింది.

Bank of Baroda

**గుడ్ల ధరలు**

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

**బంగారం ధరలు** (10 గ్రాములు)
హైదరాబాద్

| ₹ 1,54,236 (22 క్యారెట్లు) | ₹ 1,67,180 (24 క్యారెట్లు) |
|---|---|


**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 2,40,000

# ఇరాన్ కాచుకో..!

### ఆ దేశాన్ని హెచ్చరిస్తూ.. ఏఐ చిత్రాలు పోస్ట్ చేసిన ట్రంప్




**వాషింగ్టన్:**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి వివాదాస్పద పోస్టు పెట్టారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతోన్న వేళ తన 'ట్రూత్ సోషల్' ఖాతాలో షేర్ చేసిన ఏఐ జనరేటెడ్ ఫొటోలు చర్చనీయాంశంగా మారాయి. "గార్డియన్స్ ఆఫ్ ద వరల్డ్" పేరుతో షేర్ చేసిన తొలి ఫొటోలో ట్రంప్ ప్రపంచాన్ని పరిశీలిస్తున్నట్లుగా కనిపించారు. ముందు భాగంలో అమెరికా యుద్ధవిమానాలు ఎగురుతుండగా, రెండు వైపులా ఇరాన్‌పై భారీ పేలుళ్లు, మంటలు ఎగిసిపడుతున్న దృశ్యాలు ఉన్నాయి. సముద్రంలో అమెరికా యుద్ధనౌకలు మోహరించినట్లు కూడా ఈ ఫొటోలో చూడొచ్చు. "స్ట్రైక్ ఆన్ ఖర్గ్" పేరుతో ఉన్న మరో చిత్రంలో ఖర్గ్ ద్వీపంలోని ప్రధాన చమురు ఎగుమతి టెర్మినల్‌పై అమెరికా యుద్ధ విమానాలు దాడి చేస్తున్నట్లుగా చూపించారు. చమురు నిల్వ ట్యాంకులు పేలిపోవడం, సముద్రంలో నౌకల మధ్య భారీ అగ్నికీలలు ఎగిసిపడడం వంటి దృశ్యాలతో ఈ ఫొటోను రూపొందించారు. ఇరాన్ చమురు ఎగుమతికి కీలకమైన ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకుంటామని ట్రంప్ ఎప్పటినుంచో హెచ్చరిస్తున్న విషయం తెలిసిందే. మరో చిత్రంలో ట్రంప్ అమెరికా జెండా పట్టుకుని ఇరాన్ చమురు ట్యాంకర్‌పై నిలబడి ఉండగా.. పక్కనే అమెరికా సైనికులు ఆయుధాలతో ఉంటారు. కొందరు వ్యక్తులు సముద్రంలోకి దూకుతున్నట్లు ఆ ఫొటోలో ఉంది. దీంతో ఇరాన్ ఓడను అమెరికా స్వాధీనం చేసుకుందనే భావన కల్పించే ప్రయత్నం చేశారు. అలాగే, ట్రంప్ 2028, అమెరికా ఫస్ట్, ప్లాన్ ట్రస్టెడ్ వంటి నినాదాలతో పోస్టర్లను షేర్ చేశారు. ట్రంప్ పంచుకున్న ఈ ఏఐ చిత్రాలు వాస్తవాల కంటే రాజకీయ ప్రచారానికే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చే విధంగా ఉన్నాయని పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. తాజా పోస్టులతో ఇరాన్‌పై అమెరికా సైనిక చర్య కొనసాగుతుందని అగ్రరాజ్య అధ్యక్షుడు సంకేతాలిచ్చారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, దీనిపై వైట్‌హౌస్ గానీ, అమెరికా విదేశాంగ శాఖ గానీ ఇప్పటివరకు స్పందించలేదు.



## ఐఓటీ మార్కెట్‌లోకి శాటిలియాట్

దిల్లీ: ఐరోపా శాటిలైట్ ఆపరేటర్ శాటిలియాట్, భారత మార్కెట్‌లో అడుగుపెడుతున్నట్లు ప్రకటించింది. లో ఎర్త్ ఆర్బిట్ ఆధారిత న్యారోబ్యాండ్ ఐఓటీ (ఎన్‌బీ-ఐఓటీ) కనెక్టివిటీ సేవలు అందించడంలో ప్రత్యేకత కలిగిన ఈ సంస్థ.. ఇటీవల భారతీయ అనుబంధ సంస్థను ఏర్పాటు చేసింది. భారత్‌ను కీలక మార్కెట్‌గా సంస్థ అభివర్ణించింది. రాబోయే సంవత్సరాల్లో భారత్‌లో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) పరికరాలు, కనెక్షన్‌లు వేగంగా పెరుగుతాయని శాటిలియాట్ రెగ్యులేటరీ అఫైర్స్ లీడ్ (ఆసియా, ఆఫ్రికా, పశ్చిమాసియా) ఈథన్ ముదవాన్హ తెలిపారు. నియంత్రణపరమైన అంశాలు ఈ ప్రత్యేక సేవల రంగాన్ని ప్రోత్సహిస్తే, వ్యవసాయం, రవాణా, గనులు, యుటిలిటీస్ వంటి వాటికి తక్కువ ఖర్చుతో కూడిన అనుసంధానత అందించడానికి శాటిలైట్ ఐఓటీకి అవకాశాలను సృష్టిస్తుందని పేర్కొన్నారు.వ్యవసాయంలో వాడే మట్టి తేమ సెన్సార్లు, రవాణా వాహనాల ట్రాకర్లు, స్మార్ట్ విద్యుత్ మీటర్లు వంటి పరికరాలను ఇంటర్నెట్‌తో అనుసంధానం చేసి, స్వల్ప పరిమాణంలో డేటా బదిలీ చేయడాన్ని ఐఓటీగా పరిగణిస్తారు.

## విద్యార్థులపై ఏకే 47తో కాల్పులు

మీడియాలో వైరల్ అయ్యింది. నిరసనకారులపై తీవ్రమైన ఆయుధాన్ని ఉపయోగించినందుకు గాను, సదరు కానిస్టేబుల్‌ను బీహార్ పోలీస్ శాఖ వెంటనే సస్పెండ్ చేసింది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదని ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. కాంగ్రెస్ నాయకులు ప్రియాంకా గాంధీ, కేసీ వేణుగోపాల్ తదితరులు పార్లమెంటులో ఈ అంశాన్ని లేవనెత్తుతూ, నిరసనలు తెలుపుతున్న నిరాయుధులైన విద్యార్థులను ఉగ్రవాదుల్లా చూస్తున్నారా అని ప్రశ్నించారు. ఈ ఆరోపణలను బీజేపీ తీవ్రంగా ఖండించింది. రాహుల్ గాంధీ దేశంలో అరాచకత్వాన్ని సృష్టించడానికి తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని, ఆయన వెంటనే క్షమాపణ చెప్పాలని బిజెపి ఎంపి సంబిత్ పాత్ర డిమాండ్ చేశారు.

## దర్యాప్తు పురోగతిపై నివేదిక సమర్పించండి

నిష్పాక్షికంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకోవాలని ధర్మాసనం స్పష్టం చేసింది. విచారణ సందర్భంగా పిటిషనర్ తరపు న్యాయవాది ఆలయానికి వచ్చిన విరాళాల వివరాలను ప్రజలకు అందుబాటులో ఉండేలా అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచాలని కోరారు. అయితే.. ప్రస్తుతం తాము దర్యాప్తును పూర్తి చేయడంపైనే ప్రధానంగా దృష్టి సారిస్తున్నామని న్యాయస్థానం పేర్కొంది. ఈ నేపథ్యంలో సదరు వివరాలను వెలువరించడంపై ఎలాంటి ఆదేశాలూ ఇవ్వలేదు. సిట్ సమర్పించే నివేదికను పరిశీలించాకే తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసింది. దీంతో ఈ కేసు దర్యాప్తు మరింత వేగవంతం కానుంది.

## జెన్ టెక్నాలజీస్ నుంచి తేలికపాటి యాంటీ

### సరికొత్త హై-ఆల్టిట్యూడ్ మ్యాన్- పోర్టబుల్ యాంటీ- డ్రోన్ వ్యవస్థ ఆవిష్కరణ



**హైదరాబాద్:**హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగించే రక్షణ రంగ తయారీ సంస్థ జెన్ టెక్నాలజీస్.. కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా సరికొత్త హై-ఆల్టిట్యూడ్ మ్యాన్- పోర్టబుల్ యాంటీ- డ్రోన్ వ్యవస్థను ఆదివారం ఆవిష్కరించింది. ఎత్తైన పర్వతాలు, సరిహద్దు ప్రాంతాల్లో విధుల్లో ఉండే సైనిక బలగాలను శత్రుదేశాల డ్రోన్‌ల ముప్పు నుంచి రక్షించడానికి ఈ తేలికపాటి వ్యవస్థ ఉపయోగ పడుతుంది. పూర్తిగా స్వదేశీ సాంకేతికతతో దీన్ని రూపొందించారు. కార్గిల్ యుద్ధంలో భారత సాయుధ బలగాలు చూపించిన ధైర్యసాహసాలు, త్యాగాలకు నివాళిగా. పర్వత ప్రాంతాల్లో సైనికులకు డ్రోన్‌ల ద్వారా ఎదురవుతున్న సవాళ్లను తిప్పికొట్టేలా ఈ వ్యవస్థను తీసుకొచ్చారు. సాధారణంగా యాంటీ-డ్రోన్ వ్యవస్థలు భారీ వాహనాలపై తీసుకెళ్లగలిగేలా ఉంటాయి. కఠినమైన పర్వత ప్రాంతాలకు వీటిని తీసుకెళ్లడం దాదాపు అసాధ్యం. ఈ సమస్యను అధిగమించడానికి జెన్ టెక్నాలజీస్ కాంపాక్ట్ డిజైన్‌తో ఈ వ్యవస్థను రూపొందించింది. దీన్ని సైనికులు స్వయంగా వీపుపై మోసుకెళ్లొచ్చు. జంతువులు, ఆల్-టెరెయిన్ వాహనాలు, అన్‌మ్యాన్డ్ గ్రౌండ్ వెహికల్స్ ద్వారా కూడా తరలించొచ్చు.400 మెగాహెర్ట్జ్ నుంచి 6 గిగాహెర్ట్జ్ స్పెక్ట్రమ్ వరకు నిరంతర వైడ్‌బ్యాండ్ ఆర్ఎఫ్ స్కాన్ చేయడం ద్వారా 5 కిలోమీటర్ల పరిధిలోని శత్రు డ్రోన్‌లను ఈ వ్యవస్థ గుర్తించగలదు. 3 కిలోమీటర్ల దూరం వరకు ఆమ్ని-డైరెక్షనల్ జామింగ్‌తో డ్రోన్ కమాండ్ లింక్‌లను, జీఎన్ఎస్ఎస్ సిగ్నళ్లను ఒకేసారి నిలిపివేసి వాటిని నిర్వీర్యం చేయగలదు .ఏకకాలంలో వచ్చే బహుళ డ్రోన్‌లు లేదా సమన్వయంతో జరిగే స్వార్మ్ డ్రోన్ దాడులను తట్టుకుని నిరోధించగలదు. మైనస్ ఉష్ణోగ్రతలు, ఏ రకమైన వాతావరణంలోనైనా నిరంతరాయంగా 24 గంటలూ పనిచేసే స్వదేశీ ఆర్కిటెక్చర్‌ను కలిగి ఉంది. ఈ వ్యవస్థలో జెన్ తయారుచేసిన ఆర్ఎఫ్ ఆధారిత డ్రోన్ డిటెక్టర్ కీలక పాత్ర పోషిస్తుంది.సరిహద్దుల్లో పెరుగుతున్న డ్రోన్‌ల సవాళ్లను ఎదుర్కొంటూ భారత్ తన స్వదేశీ రక్షణ వ్యవస్థను బలోపేతం చేసుకోవడానికి ఈ వ్యవస్థ దోహదపడుతుందని జెన్ టెక్నాలజీస్ తెలిపింది.

### ప్రపంచ వైన్ రాజధాని వైపు

## దూసుకొస్తోన్న అగ్ని కీలలు..!



పారిస్:ప్రపంచ వైన్ రాజధానిగా పేరుగాంచిన బోర్డోను కార్చిచ్చు భయపెడుతోంది. ఫ్రాన్స్‌లోని నైరుతి ప్రాంతంలో మొదలైన ఈ అగ్నికీలలు.. ఇప్పుడు బోర్డో శివార్ల వైపు వేగంగా వ్యాపిస్తున్నాయి. "మా నగర గేట్ల నుంచి.. సుమారు 15 కిలోమీటర్ల దూరంలో అగ్నికీలలు ఉన్నాయి" ఉన్నాయని ఈ నగర మేయర్ ఆందోళన వ్యక్తంచేశారు. వాటిని శివార్లలోనే అదుపు చేసేందుకు అగ్నిమాపక సిబ్బంది ప్రయత్నిస్తున్నారు.బోర్డోకు ప్రపంచవైన్ రాజధానిగా గుర్తింపు పొందింది. శతాబ్దాల క్రితమే బోర్డో-వైన్ ఒకదానికొకటి పర్యాయపదాలుగా మారాయి ఇక్కడ తయారుచేసే వైన్‌లు ప్రపంచవ్యాప్తంగా ఎంతో పేరుగాంచాయి. ఈ ప్రాంతంలో రోమన్ల కాలం (రెండు వేల ఏళ్లకుముందు) నుంచే ద్రాక్ష సాగు చేస్తున్నారు. సమ శీతోష్ణ పరిస్థితులు ద్రాక్ష సాగుకు అనుకూలంగా ఉన్నాయని రోమన్లు గుర్తించడంతో ఇది వైన్ తయారీ కేంద్రంగా మారింది. తర్వాత ఆంగ్లేయుల పాలనలోకి వెళ్లాక.. ఇంగ్లీష్ ఛానల్ మీదుగా ఎగుమతులు ఊపందుకున్నాయి. వ్యాపారాల ఆలోచనలు, నదులు, అనుకూల వాతావరణం అన్నీ కలిసి బోర్డో నగర స్థితిగతులనే మార్చివేశాయి.ఈ నగరం వేలాదిగా ద్రాక్ష తోటలు, వైన్ ఎస్టేట్లతో నిండిపోయింది. వైన్ చరిత్ర, నగర సాంస్కృతిక ప్రాముఖ్యతను వివరించే డిజైన్లతో కూడిన ప్రపంచస్థాయి వైన్ మ్యూజియం కూడా ఇక్కడ ఉంది.పోర్ట్ ఆఫ్ ది మూన్.. బోర్డో నగరంలోని ప్రముఖ నౌకాశ్రయం. గరోన్ నది నెలవంక ఆకారం కారణంగా దానికి 'పోర్ట్ ఆఫ్ ది మూన్' అని పేరు వచ్చింది. 2007లో దీనికి యునెస్కో ప్రపంచవారసత్వ ప్రదేశంగా గుర్తింపు వచ్చింది. ఈ నదిపై నిర్మించిన రారి వంతెన, వాటర్ మిర్రర్ పర్యాటకులను ప్రత్యేకంగా ఆకట్టుకుంటున్నాయి. 3,450 చదరపు మీటర్ల ఈ కట్టడంలో అక్కడి రాజభవనాలు ప్రతిబింబిస్తుంటాయి. 362కు పైగా చారిత్రక, స్మారక కట్టడాలున్నాయి.ఇక్కడి ఆహారానికి ప్రత్యేకత ఉంది. సీఫుడ్, రకరకాల వైన్‌లను జతచేసి చేసే వంటలకు ఈ నగరం ప్రసిద్ధి చెందింది. రమ్, వెనీలాతో చేసే కనలె పేస్ట్రీ ఫేమస్. నడుస్తూ నచ్చిన వస్తువులు కొనుగోలు చేసేలా.. 1.2 కిలోమీటర్ల మేర విస్తరించిన షాపింగ్ హబ్, ఐరోపాలోనే ఎత్తైన ఇసుక దిబ్బ ఈ బోర్డోకు ప్రత్యేక ఆకర్షణ. ఆహార, పానీయ ప్రియులకు ఈ నగరం బెస్ట్ ప్లేస్ అని చెప్తుంటారు.ఐరోపా ఖండంలోని ఫ్రాన్స్, స్పెయిన్ దేశాలను గత కొన్ని రోజులుగా కార్చిచ్చు వణికిస్తోంది. అగ్నికీలలు వేగంగా విస్తరిస్తుండటంతో ఫ్రాన్స్‌లో 2,20,000 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు (ఈతీజేనిఇవ లితిశ్రీటటతితీవబ). కార్చిచ్చు ముప్పు పొంచి ఉన్న 75 వేల మందిని ఇళ్లు విడిచి వెళ్లిపోవాలని స్పెయిన్ ప్రభుత్వం హెచ్చరించింది.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
28 జూలై 2026



దాడిని ఖండిస్తూ జిల్లాలోని వివిధ మత్స్య సహకార సంఘాల నాయకులు సోమవారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు అల్లోజి, నాయకులు వెంకటయ్య తదితరులు దాడిని ఖండిస్తూ మాట్లాడారు. పెత్తందారుల దౌర్జన్య కాండను ఖండిస్తున్నామని రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని అన్నారు. దాడిలో మత్స్య సహకార సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణతో పాటు అజ్మీర్ కృష్ణ, పర్వతాలు, జయరాములు, సదానంద్, కురుమయ్య, బాలచందర్ తదితరులు తీవ్ర గాయాలపాలైనట్లు తెలిపారు.

# గుడిపల్లి రిజర్వాయర్‌లో మత్స్యకారులపై దాడి

- 30 ఏళ్లుగా చేపల వేటే జీవనాధారం
- పెత్తందారుల అండతో విచక్షణారహిత దాడులు జరిగాయి
- కలెక్టరేట్ వద్ద మత్స్య కారుల ధర్నా

**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, జూలై 27 (జనంసాక్షి):** నాగర్‌కర్నూల్ మండలంలోని గుడిపల్లి రిజర్వాయర్‌లో చేపల వేట విషయంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సుమారు 30 సంవత్సరాలుగా మత్స్య సహకార సంఘం సభ్యులుగా చట్టబద్ధంగా చేపల వేట సాగిస్తూ జీవనోపాధి పొందుతున్న తమపై ఆదివారం కొందరు వ్యక్తులు పెత్తందారుల అండతో విచక్షణారహితంగా దాడి చేశారని గుడిపల్లి, గౌరిదేవిపల్లి గ్రామాలకు చెందిన మత్స్యకారులు కన్నీటి పర్యంతమయ్యారు.

ప్రతి సంవత్సరం ప్రభుత్వానికి లక్షన్నర రూపాయలకు పైగా రుసుము చెల్లిస్తూ సహకార సంఘం ద్వారా చేపల వేట నిర్వహిస్తు న్నామని, మాకు తెలియకుండా కొందరు రిజర్వాయర్‌లో వలలు వేసి చేపలు పడుతుండటాన్ని ప్రశ్నించగా, కర్రలు, గడ్డపారలు, గుద్దలతో దాడి చేసి తీవ్రంగా కొట్టారని మండిపడ్డారు. కాళ్లపై, శరీరంపై దారుణంగా దాడి చేసినా కనికరం చూపలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. గాయపడిన వారిని స్థానిక ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు నాగర్‌కర్నూల్ ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు.

కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భాగంగా కాట్రేన్‌కుంటను గుడిపల్లి రిజర్వాయర్‌గా మార్చి, శ్రీశైలం తిరుగు జలాలను మళ్లించారు. ఈ రిజర్వాయర్ ఆధారంగా గుడిపల్లి, గౌరిదేవిపల్లి గ్రామాలకు చెందిన మత్స్యకారులు జీవనం సాగిస్తున్నారు. గుడిపల్లి పరిధిలో నర్సాయిపల్లి, గన్యాగుల గ్రామాలు ఉండగా, గౌరిదేవిపల్లి పరిధిలో నాగాపూర్, శానాయిపల్లి గ్రామాల మత్స్యకారులు ఉన్నారు. గుడిపల్లి, గౌరిదేవిపల్లి మత్స్యకార సహకార సంఘంలో మొత్తం 191 మంది సభ్యులు, అధ్యక్షుడు, కార్యదర్శితో పాటు తొమ్మిది మంది డైరెక్టర్లు సంఘాన్ని నిర్వహిస్తున్నారు. ప్రత్యక్షంగా వెయ్యికిపైగా కుటుంబాలు చేపల వృత్తిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. మత్స్యకారుల ఆరోపణల ప్రకారం.. నర్సాయి పల్లి గ్రామానికి చెందిన శరభంద మల్లయ్య, కురువ శ్రీశైలం, నాగమల్లయ్య, నాగరాజు, పిట్టల రామకృష్ణ, గొల్ల రామకృష్ణ, కురుమయ్య, కిష్టయ్య, మహేష్ తదితరులు కలిపి సుమారు 50 మంది దాడికి పాల్పడ్డారని పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్ కూడా అక్కడే ఉన్నప్పటికీ దాడిని అడ్డుకునేందుకు చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. గతంలో ఒకటి, రెండు ఎకరాల భూములు ఉన్నా అవన్నీ గుడిపల్లి రిజర్వాయర్ ముంపులో కలిసిపోయాయని, దీంతో పూర్తిగా చేపల వేటపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. గుడిపల్లి రిజర్వాయర్‌తో పాటు ఊర చెరువు, నరసమ్మకుంట, కొండేటికుంటల్లో చేపలు వదిలి వాటి ద్వారా జీవనం సాగిస్తున్నామని వివరించారు. ప్రతి సంవత్సరం రుసుము చెల్లిస్తూ చేపల వేట నిర్వహిస్తున్నప్పటికీ, కొందరు పెత్తందారులు చెరువుల్లో చేపలపై కన్నేసినట్టు వాపోయారు.

**చేపల వృత్తి చేసుకోవడం నేరమా? : జయరాములు**

గుడిపల్లి మత్స్య సహకార సంఘం గ్రామ అధ్యక్షుడు జయరాములు మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా చేపల వృత్తిపైనే జీవిస్తున్నాం. గుడిపల్లి, గౌరిదేవిపల్లి గ్రామాల మత్స్యకారులకు ఇదే జీవనాధారం. సుమారు 500 మందికి పైగా ఈ వృత్తి ద్వారా ఉపాధి పొందుతున్నారు. కొందరు కావాలనే గ్రామస్తులను రెచ్చగొట్టి మత్స్యకారులపై దాడులు చేయిస్తున్నారు. ఆదివారం జరిగిన దాడిలో కాళ్లు పట్టుకుని వేడుకున్నా కనికరం చూపలేదు.

**మేం ఎలా బతకాలి? : రామకృష్ణ**

గౌరిదేవిపల్లికి చెందిన మత్స్యకారుడు రామకృష్ణ మాట్లాడుతూ, మాకు రెండు రెక్కలు తప్ప భూములు లేవు. ఉదయం చేపలు పట్టి మార్కెట్‌లో అమ్మి వచ్చిన డబ్బుతో కుటుంబాన్ని పోషిస్తున్నాం. వలలు ఎందుకు వేశారని అడిగినందుకు రక్తం కారేలా కొట్టారు.

**మా భూములు మునిగిపోయాయి : నర్సాయిపల్లి సర్పంచ్ రాములు**

గుడిపల్లి రిజర్వాయర్ నిర్మాణంతో మా గ్రామానికి చెందిన అనేక మంది రైతుల భూములు ముంపునకు గురయ్యాయి. ఉపాధి కోల్పోయిన వారు చేపల వేట ద్వారా జీవనం సాగించాలనే ప్రయత్నం చేస్తున్నారు. గత పది సంవత్సరాలుగా ఇలాంటి వివాదాలు జరుగుతున్నాయి. శాంతియుతంగా పరిష్కారం చేసుకోవాలని చెప్పినా ఇరు వర్గాలు వినలేదు.

# నంచర్ల రైతు వేదికలో విత్తన మేళా

- నాణ్యమైన విత్తనాలతో శాస్త్రీయ సాగు చేయాలి..
- మండల వ్యవసాయశాఖ అధికారి ఏవో, నరేందర్




**మహమ్మదాబాద్,జూలై 27 (జనంసాక్షి):** మహమ్మదాబాద్ మండలం నంచర్ల రైతు వేదికలో సోమవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విత్తన మేళా నిర్వహించారు. ఈసందర్భంగా మండల వ్యవసాయ అధికారి ఏవో,నరేందర్ మాట్లాడుతూ.. రైతులు ధృవీకరించిన నాణ్యమైన విత్తనాలను వినియోగించి శాస్త్రీయ సాగు పద్ధతులను అనుసరించాలని సూచించారు. ప్రస్తుతం నెలకొన్న వాతావరణ పరిస్థితులు, ముఖ్యంగా ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని పెసర, మినుములు, నువ్వులు, పొద్దుతిరుగుడు, కూరగాయల వంటి పంటల సాగు అనుకూలమని తెలిపారు. తక్కువ వర్షపాతం పరిస్థితులకు తగిన పంటలను ఎంపిక చేసుకోవడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చన్నారు.

ప్రభుత్వ గుర్తింపు పొందిన విత్తన విక్రయ కేంద్రాల నుంచే ధృవీకరించిన విత్తనాలను కొనుగోలు చేయాలని,విత్తే ముందు విత్తన శుద్ధి చేపట్టడం ద్వారా మొలక శాతం పెరగడంతో పాటు విత్తనాల ద్వారా వ్యాపించే తెగుళ్లను నివారించవచ్చని వివరించారు.నంచర్ల గ్రామ సర్పంచ్ ఎస్.గాయత్రిదేవి మాట్లాడుతూ..వ్యవసాయ శాఖ సూచనలను పాటిస్తూ శాస్త్రీయ సాగు ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించాలని ఆకాంక్షించారు.వ్యవసాయ విస్తరణ అధికారులు దీపిక, నిఖిత, రక్షిత రైతులకు వివిధ పంటలకు అనువైన విత్తన రకాలు,విత్తన శుద్ధి విధానాలు, విత్తన మోతాదు,విత్తే సమయం,పంట యాజమాన్య పద్ధతులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నారాయణ, డిప్యూటీ సర్పంచ్ చెన్నారెడ్డి, తిరుమల్ రెడ్డి, వెంకటయ్య, అంజిలయ్య, పాండు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టానికి స్పందన కరువు

- కొందుర్గు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో చట్టాన్ని దుర్వినియోగ పరుస్తున్న అధికారులు
- కొందుర్గ్ ఎంపీడీఓ ఆఫీసులో ఏం జరుగుతోంది?
- షాద్ నగర్ ఆర్డీవో ప్రజావాణిలో పిర్యాదు




**కొందుర్గు (జనంసాక్షి) :** మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) కార్యాలయంలో పారదర్శకత లోపించిందని, సమాచార హక్కు చట్టం ప్రకారం వివరాలు అడిగితే అధికా రులు భయపడుతున్నారని ఎమ్మార్పీఎస్ కొందుర్గు మండల అధ్యక్షులు ఆనేగాళ్ళ ఆనంద్ మాదిగ ఆరోపించారు. ప్రభుత్వ నిధుల వినియోగానికి సంబంధించిన అధికారిక రికార్డులు, (ఐఎఫ్ఎంఐఎస్) అకౌంట్ స్టేట్‌మెంట్లు, బిల్లులు, వోచర్లు, 15వ ఆర్థిక సంఘం నిధుల వివరాలు, జీరో అకౌంట్ల లావాదేవీలు, (ఎస్ఈపీఈసీ) సర్వే చెల్లింపుల వివరాలు కోరుతూ తాము దరఖాస్తు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. అయితే, చట్ట ప్రకారం సర్టిఫై చేసిన అధికారిక రికార్డులను ఇవ్వకుండా, కేవలం ఎక్సెల్‌లో టైప్ చేసిన వివరాలను ఒక సాధారణ తెల్ల కాగితంపై ముద్రించి ఇవ్వడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై ఎంపీడీఓను వివరణ కోరితే సూపరింటెండెంట్‌ను అడగాలని బాధ్యతారాహిత్యంగా సమాధానం ఇస్తున్నారని, తీరా సూపరింటెండెంట్‌ను అడిగితే పొంతన లేని సమాధానాలు చెబుతూ కాలయాపన చేస్తున్నార ని మండిపడ్డారు.

అధికారుల మధ్య సమన్వయ లోపం, సమాచారం దాచాలనే ప్రయత్నాల వల్ల ఆఫీసులో పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయనే అనుమానాలు ప్రజల్లో బలపడుతున్నాయని ఆయన విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన సంబంధిత శాఖల అధికారుల ముందు పలు కీలక ప్రశ్నలను ఉంచారు:ఎన్నికల డిపాజిట్లు ఏవి?: గ్రామ పంచాయతీలకు తిరిగి రావాల్సిన ఎలక్షన్ డిపాజిట్ నిధులు ప్రస్తుతం ఎక్కడ ఉన్నాయి?సర్వే నిధుల మళ్లింపు?: SEPEC సర్వే కోసం ప్రభుత్వం విడుదల చేసిన నిధులు ఎవరి ఖాతాల్లోకి వెళ్లాయి? ఎవరెవరికి ఎంతెంత చెల్లించారు?సిబ్బందికి అన్యాయం? డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎన్యూమరేటర్లకు పూర్తి స్థాయిలో జీతాలు, చెల్లింపులు జరిగాయా లేదా?ఖాతాల వివరాలేవి?: ప్రభుత్వం విడుదల చేసిన ప్రజాధనం ఏయే ఖాతాల్లో జమ అయింది? ఎంత ఖర్చు చేశారు? మిగిలిన నిధుల నిల్వ ఎంత?ప్రజాధనానికి సంబంధించిన ప్రతి రూపాయి లెక్కను ప్రజలకు తెలుసుకునే పూర్తి హక్కు ఉందని ఆనంద్ మాదిగ స్పష్టం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, ఆర్టీఐ చట్టం ప్రకారం పూర్తి రికార్డులను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.

# చిలకనగర్‌లో మౌలిక వసతుల పనులకు శ్రీకారం

## బోనాల ముందే పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆదేశం



**ఉప్పల్, జూలై 27 (జనంసాక్షి):** చిలకనగర్ డివిజన్‌లో ఎన్నాళ్లుగానో పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ, వర్షపు నీటి అవుట్‌లెట్, రహదారి సమస్యల పరిష్కారానికి చర్యలు ప్రారంభమయ్యాయి. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చొరవతో జీహెచ్ఎంసీ అధికారులు పనులు ప్రారంభించారు. వర్షాకాలంలో నీరు నిలిచిపోవడం, డ్రైనేజీ సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే ఇటీవల జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ రాధిక గుప్తా దృష్టికి తీసుకెళ్లారు. అలాగే హనుమాన్ ఆలయం నుంచి మైసమ్మ గుడి వరకు అసంపూర్తిగా ఉన్న రహదారిని వెంటనే పూర్తి చేయాలని కోరారు.

ఎమ్మెల్యే విజ్ఞప్తికి స్పందించిన జీహెచ్ఎంసీ అధికారులు డ్రైనేజీ, వర్షపు నీటి అవుట్‌లెట్, రహదారి పనులను ప్రారంభించారు. బోనాల పండుగకు ముందే పనులు పూర్తి చేసి భక్తులు, స్థానికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. వర్షపు నీరు నిల్వ కాకుండా శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని, పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని స్థానికులు కోరారు. ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పనులు ప్రారంభమయ్యేలా చేసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, వెంటనే స్పందించిన జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ రాధిక గుప్తాకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# రూ.270 కోట్ల రహదారి అభివృద్ధి

## పనులను పరిశీలించిన మంత్రి శ్రీధర్ బాబు

**నిజాంపేట్, జూలై 27 (జనంసాక్షి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో రూ.270 కోట్ల వ్యయంతో చేపట్టిన ప్రధాన రహదారుల అభివృద్ధి పనులను తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సోమవారం పరిశీలించారు. కొంపల్లి-బహదూర్‌పల్లి రహదారి విస్తరణకు రూ.130 కోట్లు, గండిమైసమ్మ-మియాపూర్ రహదారి నిర్మాణానికి రూ.140 కోట్లతో చేపట్టిన పనుల పురోగతిని అధికారులతో కలిసి సమీక్షించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గత పదేళ్లుగా అటవీ శాఖ అనుమతుల సమస్యతో నిలిచిపోయిన రహదారి పనులకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అవసరమైన అనుమతులు సాధించి వేగం తీసుకొచ్చిందన్నారు. కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ప్రత్యేక కృషితో ఈ ప్రాజెక్టులు ముందుకు సాగుతున్నాయని తెలిపారు. అనంతరం బౌరంపేట్ రోడ్డులో జరుగుతున్న విస్తరణ పనులను జిల్లా కలెక్టర్, సంబంధిత శాఖ కమిషనర్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, టీపీసీసీ నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు.

పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు మంత్రి ఆదేశించారు. అటవీ, రెవెన్యూ తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఈ రహదారి పనులు పూర్తయిన తర్వాత కొంపల్లి, బహదూర్‌పల్లి, గండిమైసమ్మ, బాచుపల్లి, మియాపూర్ ప్రాంతాల మధ్య ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గి, ప్రజలకు వేగవంతమైన, సురక్షితమైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, మాజీ సర్పంచ్‌లు, కాంగ్రెస్ నాయకులు, ఐఎన్‌టీయూసీ, ఎన్ఎస్‌యూఐ ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులు మంచి లక్ష్యాలను ఎంచుకోవాలి

- విద్యార్థులు నీట్ ర్యాంకులు సాధించాలి
- విద్యార్థులకు ప్రేరణ కలిగించాలి
- మహేశ్వరం మోడల్ స్కూల్ ను ఆకస్మిక తనిఖీ చేసిన స్టేట్ చీఫ్ సెక్రెటరీ సంజయ్ జాజు



**మహేశ్వరం,జూలై27(జనంసాక్షి):** విద్యార్థులు జీవితంలో మంచి లక్ష్యాలను ఏర్పరచుకోవాలని స్టేట్ చీఫ్ సెక్రెటరీ సంజయ్ జాజు అన్నారు. సోమవారం మహేశ్వరం మండలం కేసితండాలోని మహేశ్వరం మోడల్ స్కూల్ ను ఆకస్మిక తనిఖీ చేశారు.ఈ సందర్భంగా స్టేట్ చీఫ్ సెక్రెటరీ సంజయ్ జాజు మాట్లాడుతూ... ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రేరణ కలిగించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులు ఏదైనా అనుకుంటే సులభంగా సాధిస్తారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలోనాణ్యమైన విద్యను అందిస్తుందన్నారు.ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులు తప్పనిసరిగా ఐఐటీ,నీట్ ర్యాంకులను సాధించాలన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న ఫిజిక్స్ వాలా, ఖాన్ అకాడమీ క్లాసులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం తరగతులు ఎలా జరుగుతున్నాయని,టీచర్లు పాఠాలు బాగా చెబుతున్నార అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మోడల్ స్కూల్‌లో ఉన్న సమస్యలను ప్రిన్సిపల్ గోపిని అడిగి తెలుసుకున్నారు.మోడల్ స్కూల్ సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఇండస్ట్రీస్ అండ్ కామర్స్ సెక్రెటరీ కృష్ణ ఆదిత్య, ఎఫ్సిడిఏ కమిషనర్ శశాంక,డీఈవో వెంకటేశ్వర్లు,ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి,మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ గోపి,పలు శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# అగ్రహారం వద్ద పగిలిన మిషన్ భగీరథ పైప్‌లైన్

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జూలై 27 (జనంసాక్షి)**

వేములవాడ అర్బన్ మండలంలోని అగ్రహారం సమీపంలో మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్ సోమవారం పగిలి పోయింది. ఈ క్రమంలో భారీగా నీరు ఉవ్వెత్తున ఎగిసిపడింది. పైప్‌లైన్ పగిలిన విషయాన్ని గమనించిన స్థానికులు వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించగా మిషన్ భగీరథ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.నీరు వృథా కాకుండా వెంటనే సరఫరాను నిలిపివేసి మరమ్మత్తు పనులు చేస్తున్నారు.

# కనీస వేతనాలు చెల్లించని యాజమాన్యాలపై చర్యలు తీసుకోండి

- కలెక్టర్‌కు సీఐటీయూ వినతిపత్రం
- జీఓలను అమలు చేయని పరిశ్రమలపై ఆగ్రహం

**శామీర్‌పేట్, జూలై 28 (జనంసాక్షి):** రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస వేతనాల జీవోలను అమలు చేయకుండా కార్మికులను తక్కువ వేతనాలతో పని చేయిస్తున్న పరిశ్రమలు, ప్రైవేట్ విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ శామీర్‌పేట్ మండల కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం మండల కార్యదర్శి కిష్టప్ప ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిష్టప్ప మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాలపై స్పష్టమైన జీవోలు జారీ చేసినప్పటికీ అనేక పరిశ్రమలు, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు వాటిని అమలు చేయకుండా కార్మికులతో వెట్టిచాకిరీ చేయిస్తున్నాయని ఆరోపించారు.

తక్కువ వేతనాలతో ఎక్కువ గంటలు పనిచేయించడం వల్ల కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తున్న సంస్థలపై కార్మిక శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి, కనీస వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించి, వారి హక్కులను పరిరక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ఫ్లైఓవర్ కింద ఇండోర్ సబ్‌స్టేషన్‌కు శ్రీకారం

- స్థలాభావానికి టీజీఎస్పీడీసీఎల్ వినూత్న పరిష్కారం
- ముషీరాబాద్‌లో ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించిన సీఎండీ జితేష్ వి. పాటిల్



**ముషీరాబాద్, జూలై 28 (జనంసాక్షి) :** గ్రేటర్ హైదరాబాద్‌లో పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు, కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణానికి ఎదురవుతున్న స్థలాభావ సమస్యకు వినూత్న పరిష్కారంగా టీజీఎస్పీడీసీఎల్ ఫ్లైఓవర్లు, స్టీల్ బ్రిడ్జిల కింద ఉన్న ఖాళీ స్థలాల్లో ఆధునిక ఇండోర్ సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో టీజీఎస్పీడీసీఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జితేష్ వి. పాటిల్, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ఐటీ) వి. శివాజీలు ముషీరాబాద్ బస్‌డిపో సమీపంలోని నాయని నర్సింహారెడ్డి స్టీల్ ఫ్లైఓవర్ కింద ప్రతిపాదిత 33/11 కేవీ ఇండోర్ సబ్‌స్టేషన్ స్థలాన్ని పరిశీలించారు. సబ్‌స్టేషన్ లేఅవుట్, 33 కేవీ ఇన్‌కమింగ్ లైన్లు, 11 కేవీ ఫీడర్లు, అండర్‌గ్రౌండ్ కేబుల్ మార్గాలు, భద్రతా ప్రమాణాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. నగరంలో భూముల కొరత, అధిక భూవిలువల కారణంగా కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణం కష్టతరంగా మారిన నేపథ్యంలో, ఫ్లైఓవర్ల కింద ఉన్న స్థలాలను సాంకేతికంగా వినియోగించేందుకు నిపుణుల కమిటీ అధ్యయనం చేసి అనుకూల ప్రాంతాలను గుర్తించింది.

ముషీరాబాద్‌లో నిర్మించనున్న 33/11 కేవీ ఇండోర్ సబ్‌స్టేషన్‌లో రెండు 8 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు, ఎనిమిది 11 కేవీ ఫీడర్లకు అవసరమైన స్విచ్‌గేర్ ఏర్పాటు చేయనున్నారు. తొలి దశలో నాలుగు ఫీడర్లను అనుసంధానించి, భవిష్యత్ అవసరాలకు మరో నాలుగు ఫీడర్లకు అవకాశం కల్పిస్తారు. జవహర్‌నగర్, విద్యానగర్, బౌద్ధనగర్, ఎల్ఎన్ నగర్, సిటీ సెంట్రల్ లైబ్రరీ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా చేసే ఫీడర్లను దీనికి అనుసంధానించనున్నారు. ఈ సబ్‌స్టేషన్ అందుబాటులోకి వస్తే ప్రస్తుతం అధిక లోడ్‌తో పనిచేస్తున్న ఐదు 33/11 కేవీ సబ్‌స్టేషన్లపై భారం తగ్గి, ముషీరాబాద్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా మరింత స్థిరంగా, విశ్వసనీయంగా మారనుంది. రెండు వైపుల నుంచి 33 కేవీ విద్యుత్ సరఫరా అందేలా ప్రత్యామ్నాయ వ్యవస్థను ఏర్పాటు చేయడంతో, ఒక మార్గంలో అంతరాయం ఏర్పడినా మరో మార్గం ద్వారా సరఫరా కొనసాగుతుంది. సబ్‌స్టేషన్‌ను పూర్తిస్థాయి మానవ రహిత విధానంలో నిర్వహించేలా ఆర్టీయూ ఇంటిగ్రేషన్, రిమోట్ మానిటరింగ్ సదుపాయాలు, ఆధునిక స్విచ్‌గేర్, ఎక్స్ఎల్‌పీఈ అండర్‌గ్రౌండ్ కేబుళ్లు, రక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేయనున్నారు.

సీఎండీ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ, భూమి కొరత ఉన్న నగరాల్లో ఫ్లైఓవర్ల కింద ఇండోర్ సబ్‌స్టేషన్ల ఏర్పాటు సమర్థవంతమైన ప్రత్యామ్నాయమన్నారు. ముషీరాబాద్ ప్రాజెక్టును మోడల్ సబ్‌స్టేషన్‌గా అభివృద్ధి చేసి, విజయవంతమైతే నగరంలోని ఇతర ప్రాంతాల్లోనూ అమలు చేస్తామని తెలిపారు. సుమారు 10-12 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఈ ప్రాజెక్టు భూసేకరణ వ్యయాన్ని తగ్గించడంతో పాటు స్థలాభావ సమస్యకు శాశ్వత పరిష్కారంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రజల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇస్తూ అంతర్జాతీయ ప్రమాణాల మేరకు ఎర్తింగ్, ఇన్సులేషన్, రక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేసి, అన్ని సాంకేతిక పరీక్షలు పూర్తయ్యాకే సబ్‌స్టేషన్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు.

# విదేశీ యువతిపై వేధింపులు

## గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు

**శేరిలింగంపల్లి, జూలై 27 (జనంసాక్షి):** హైదరాబాద్‌లో ఓ విదేశీ యువతిపై అసభ్యంగా ప్రవర్తించిన ఘటన కలకలం రేపింది. నెదర్లాండ్స్‌కు చెందిన యువతి తనపై లైంగిక వేధింపులకు యత్నించారని ఆరోపిస్తూ గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేపట్టారు. సమాచారం ప్రకారం, నెదర్లాండ్స్‌కు చెందిన యువతి తన స్నేహితుడిని కలిసేందుకు హైదరాబాద్‌కు వచ్చి మాదాపూర్‌లోని ఓ కొలివింగ్ హాస్టల్‌లో బస చేసింది. అదే హాస్టల్‌లో ఉంటున్న ఆదిత్య అనే వ్యక్తి తనతో అసభ్యంగా ప్రవర్తించి లైంగిక వేధింపులకు యత్నించాడని యువతి ఆరోపించింది. తొలుత ఈ విషయాన్ని నెదర్లాండ్స్‌లోని భారత రాయబార కార్యాలయానికి తెలియజేసిన ఆమె, అనంతరం హైదరాబాద్‌కు తిరిగి వచ్చి తన స్నేహితుడి సహకారంతో గచ్చిబౌలి పోలీసులను ఆశ్రయించింది.

ఫిర్యాదు స్వీకరించిన గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడు ఆదిత్యను అదుపులోకి తీసుకుని విచారణ కొనసాగిస్తున్నట్లు తెలిపారు. విదేశీ పర్యాటకులు, మహిళల భద్రతకు భంగం కలిగించే ఇటువంటి ఘటనలు దేశ ప్రతిష్టను దెబ్బతీసే అవకాశముందని సామాజికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విదేశీయుల భద్రత విషయంలో ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని, మహిళలపై వేధింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు సీనియర్ సిటిజన్లు, ప్రజా సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.

# నారాయణపూర్‌ను ముంపు గ్రామంగా ప్రకటించాలి

## అన్ని ఇళ్లకు నష్టపరిహారం చెల్లించాలని గ్రామస్తుల డిమాండ్

- కరీంనగర్-జగిత్యాల ప్రధాన రహదారిపై ధర్నా, రాస్తారోకో
- గంటపాటు స్తంభించిన రాకపోకలు.. కిలోమీటర్ల మేర వాహనాల నిలిచివేత
- డిమాండ్లు నెరవేర్చకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరిక



**గంగాధర, జూలై 27 (జనంసాక్షి):** నారాయణపూర్ గ్రామాన్ని పూర్తిస్థాయి ముంపు గ్రామంగా ప్రకటించి గ్రామంలోని అన్ని ఇళ్లకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు సోమవారం కరీంనగర్–జగిత్యాల ప్రధాన రహదారిపై మధురానగర్ ఎక్స్‌రోడ్డు చౌరస్తాలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. దీంతో గంటపాటు రాకపోకలు స్తంభించి, కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ధర్నా సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నారాయణపూర్ రిజర్వాయర్‌లోకి నీటిని నింపి అక్కడి నుంచి చొప్పదండి నియోజకవర్గంతో పాటు వేములవాడ ప్రాంతాలకు సాగునీరు అందిస్తున్నా రని తెలిపారు. రిజర్వాయర్ నిండిన ప్రతిసారీ కట్ట ప్రమాదకరంగా మారడంతో గ్రామ ప్రజలు భయాందోళనల మధ్య జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నీరు నిల్వ ఉన్నంతకాలం గ్రామమంతా బురదమయంగా మారి ఇళ్లలో నివసించడమే కాకుండా వ్యవసాయ పనులు కూడా చేసుకోలేని పరిస్థితి ఏర్పడుతోందని చెప్పారు. రిజర్వాయర్ కట్ట ఎత్తు పెంపు పనుల కోసం సమీపంలోని కొన్ని ఇళ్లను మాత్రమే స్వాధీనం చేసుకుని పరిహారం చెల్లించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారని, అయితే కొన్ని ఇళ్లకే కాకుండా మొత్తం గ్రామాన్ని ముంపు గ్రామంగా గుర్తించి అందరికీ నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఇప్పటికే కరీంనగర్ ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించామని, అనంతరం అప్పటి ఆర్డీవో మహేశ్వర్, కరీంనగర్ రూరల్ ఏసీపీ విజయ్‌కుమార్ గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారని తెలిపారు. ఆ సందర్భంగా గ్రామాన్ని పూర్తిస్థాయి ముంపు గ్రామంగా ప్రకటించాలని కోరినట్లు పేర్కొన్నారు. అధికారులు కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తామని చెప్పినా, ప్రస్తుతం మళ్లీ కొన్ని ఇళ్లకే మార్కింగ్‌లు వేస్తూ పరిమిత పరిహారం చెల్లించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు.

గ్రామ పంచాయతీ కార్యాలయంలో కొన్ని ఇళ్లకు మాత్రమే పరిహారం చెల్లించేందుకు గ్రామసభ నిర్వహిస్తున్నట్లు నోటీసులు అంటించడం పట్ల గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి నారాయణపూర్ గ్రామాన్ని పూర్తిస్థాయి ముంపు గ్రామంగా ప్రకటించి, గ్రామంలోని అన్ని ఇళ్లకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.





### ఫిర్యాదుపై అరగంటలోనే కలెక్టర్ స్పందన..

# గురుకులంలో ఆకస్మిక తనిఖీ

- ప్రజావాణి ఫిర్యాదుతో చిన్న బోనాల గురుకులానికి చేరుకున్న కలెక్టర్
- నీటి సమస్యలు వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశం
- నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ప్రిన్సిపాల్‌కు హెచ్చరిక
- నాణ్యమైన భోజనం, పరిశుభ్రత, చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని విద్యార్థులకు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచన

**రాజన్న సిరిసిల్ల బ్యూరో, జులై 27 (జనం సాక్షి):** సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన ప్రజావాణిలో పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు సిరిసిల్ల మున్సిపల్ పరిధి చిన్న బోనాలలోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో నీటి సరఫరాలో ఇబ్బందులు, ఇతర సమస్యలపై జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు వచ్చిన అరగంటలోనే స్పందించిన జిల్లా కలెక్టర్ ఆ విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.నేరుగా డైనింగ్ హాల్ కి వెళ్లి విద్యార్థులు భోజనం చేస్తుండగా,వారితో మాట్లాడారు.మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా? నాణ్యతా ఎలా ఉంది? అని ఆరా తీశారు.బియ్యం, పప్పులు, కోడిగుడ్లు, నూనె ఇతర ఆహార పదార్థాల నాణ్యత,గడువు తేదీని తనిఖీ చేశారు.అక్కడి నుంచి విద్యార్థుల వసతి గదులకు వెళ్లి,టాయిలెట్లు పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యాలయంలో నీటి సరఫరాలో ఇబ్బందులను వెంటనే పరిష్కరించాలని సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా ను పిలిపించి,జిల్లా కలెక్టర్ ఆదేశించారు.జిల్లాలోని వేములవాడ మహాత్మ జ్యోతి బాపూలే బాలుర గురుకుల రెసిడెన్షియల్ విద్యాలయంలో జిల్లా కలెక్టర్ ఇటీవల తనిఖీ చేసి, నిర్వహణలో లోపాలను గుర్తించారు. విచారణ నివేదిక ఆధారంగా ప్రిన్సిపాల్ ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయాన్ని కలెక్టర్ గుర్తు చేశారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చిన్న బోనాల సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ ను జిల్లా కలెక్టర్ హెచ్చరించారు.

విద్యార్థులు, మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. విద్యాలయం ఆవరణ పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సూచిం చారు. విద్యార్థులు చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, ప్రతి పాఠ్యాంశం కీలకమని ప్రణాళిక ప్రకారం చదవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. వసతులను సద్వినియోగం చేసుకొని, విద్యలో రాణించాలని ఆకాంక్షిం చారు. ప్రతి విద్యార్థి వ్యక్తిగత,పరిసరాల పరిశుభ్రత అవగాహనతో ఉండాలని స్పష్టం చేశారు.

### వరి ధాన్యం డబ్బులు రాక

# దళారి ఇంటి వద్ద రైతులు నిరసన



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జులై 27 (జనంసాక్షి) :** ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యం పంటను మర్రిపల్లి, నూకలమర్రి కొనుగోలు కేంద్రాల్లో అమ్మిన రైతులకు నేటికీ డబ్బులు తమ ఖాతాలో జమ కాకపోవడంతో సోమవారము దళారి మధుకర్ ఇంటి వద్ద రైతులు ఆందోళన నిర్వహించారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని మార్కండేయ నగర్‌లో ధాన్యం కుంభకోణంలో ప్రధాన పాత్ర పోషించిన మధుకర్ ఇంటి రెండవ అంతస్తుపైకి నిరసన తెలిపారు. వెంటనే జిల్లా కలెక్టర్, డీసీవోలు ఘటనాస్థలికి వచ్చి తమ సమస్యను పరిష్కరించాలని నినాదాలు చేశారు.మర్రిపల్లి, నూకలమర్రి, మల్లారం ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించిన ధాన్యానికి సంబంధించిన చెల్లింపులు ఇప్పటికీ తమ బ్యాంకు ఖాతాల్లో జమ కాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని వారు ఆరోపించారు. సుమారు 20 మంది రైతులు నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో అమ్మిన 6 లారీల వరి ధాన్యం జిల్లా కేంద్రంలోని గోదాంలోకి తరలించకుండా దళారి మధుకర్ మరోచోట అమ్ముకున్న విషయం తెలిసిందే. తమకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించి, ధాన్యం కొనుగోలు వ్యవహారంలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టాలని రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ధాన్యం విక్రయించి నెలలు గడిచినా డబ్బులు రాకపోవడంతో ఆందోళన నిర్వహించామన్నారు.జిల్లా అధికారులు వెంటనే స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఈ వ్యవహారంపై జిల్లా అధికార యంత్రాంగం ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.

### బీసీ వెల్ఫేర్ గురుకుల విద్యాసంస్థలలో ఇంటర్ స్పాట్ అడ్మిషన్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

#### జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**పెద్దపల్లి, జూలై 27(జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లాలోని మహాత్మా జ్యోతిరావు పూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల విద్యాసంస్థల (బీసీ వెల్ఫేర్ గురుకుల ఎడ్యుకేషనల్ సొసైటీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలుర జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు జిల్లా సమన్వయకర్త మాగదీప్తి ఒక ప్రకటనలో తెలిపారు.గురుకుల బాలుర జూనియర్ కళాశాలలో ఎంపీసీ బైపీసీ (బైపీసి) గ్రూపులు, బాలికల జూనియర్ కళాశాలలో ఎంపీసీ (ఎంపిసి), బైపీసీ (బైపీసి) సీఈసీ (సిఇసి) గ్రూపులలో పరిమిత సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మార్చి–2026లో పదో తరగతి (ఎస్ఎస్‌సి) ఉత్తీర్ణులై, 450 లేదా అంతకంటే ఎక్కువ మార్కులులిలి సాధిం చిన విద్యార్థులు స్పాట్ అడ్మిషన్లకు అర్హులని పేర్కొన్నారు.ప్రవేశాలకు హాజరయ్యే విద్యార్థులు ఎస్ఎస్‌సి మార్కుల మెమో జిరాక్స్, ఆధార్ కార్డు ఒరిజినల్‌తో పాటు జిరాక్స్, ఎస్ఎస్‌సి బోనాఫైడ్ సర్టిఫికెట్ తప్పనిసరిగా వెంట తీసుకురావాలని సూచించారు.జూలై 28, 2026 (మంగళవారం) ఉదయం 10.00 గంటలకులిలి భూపతిపూర్ (క్రాస్ రోడ్), రాజీవ్ రహదారి, సుల్తానాబాద్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల బాలుర జూనియర్ కళాశాల ప్రాంగణంలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు..అర్హత కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నిర్ణీత తేదీన అవసరమైన ధ్రువపత్రాలతో స్పాట్ అడ్మిషన్లకు హాజరుకావాలని, అడ్మిషన్లకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం 9550446246 నంబర్‌ను సంప్రదించవచ్చుని జిల్లా సమన్వయకర్త కోరారు.

# ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలని స్పష్టం

- ప్రజా సమస్యల పరిష్కారం నుంచి విద్య, వైద్యం, వ్యవసాయం వరకు.. అధికారులకు కలెక్టర్ కోయ శ్రీహర్ష కీలక ఆదేశాలు
- లింగ నిర్ధారణకు పాల్పడితే కఠిన చర్యలు.. స్కానింగ్ కేంద్రాలపై నిఘా
- ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యకు ఆధునిక బోధన అవసరం
- ఎల్‌నినో పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి



**పెద్దపల్లి, జూలై 27 (జనంసాక్షి):** జిల్లా అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, వైద్య సేవలు, విద్యా ప్రమాణాల మెరుగుదల, వ్యవసాయ రంగంలో ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహంపై జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులకు దిశానిర్దేశం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో వరుసగా నిర్వహించిన ప్రజావాణి, పీసీపీఎన్‌డీటీ జిల్లా సలహా కమిటీ, విద్యాశాఖ శిక్షణ కార్యక్రమం, వ్యవసాయ శాఖ సమీక్ష సమావేశాల్లో పాల్గొన్న ఆయన పలు కీలక సూచనలు చేశారు. ముందుగా నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించిన కలెక్టర్, ప్రతి అర్జీకి అత్యంత ప్రాధాన్యతనిస్తూ పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఉద్యోగం, భూ వారసత్వ హక్కులు, ఆస్తి వివాదాలకు సంబంధించిన దరఖాస్తులను సంబంధిత శాఖలకు పంపిస్తూ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం జరిగిన పీసీపీఎన్‌డీటీ జిల్లా సలహా కమిటీ సమావేశంలో గర్భంలోని శిశువు లింగ నిర్ధారణ చట్టవిరుద్ధమని, అలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి స్కానింగ్‌కు సంబం ధించిన ఎఫ్–ఫారాన్ని తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, స్కానింగ్ కేంద్రాలపై నిరంతర తనిఖీలు నిర్వహించి చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. సహజ ప్రసవాలను ప్రోత్సహిస్తూ, అనవసర సిజేరియన్ శస్త్రచికిత్సలను తగ్గించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

పెద్దపల్లి జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో నిర్వహిస్తున్న సమగ్ర సేవా శిక్షణ కార్యక్రమాన్ని సందర్శించిన కలెక్టర్, ప్రభుత్వ పాఠశాలలను నాణ్యమైన విద్యా కేంద్రాలుగా తీర్చిదిద్దడంలో ప్రధానోపాధ్యాయుల పాత్ర కీలకమని అన్నారు. రోబోటిక్స్, కృత్రిమ మేధస్సు (ఏఐ), డిజిటల్ లిటరసీ వంటి ఆధునిక సాంకేతిక అంశాలపై ఉపాధ్యా యులు అవగాహన పెంపొందించుకుని, వాటిని బోధనలో భాగం చేయాలని సూచించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాఠశాలల్లో అమలు చేసి విద్యార్థుల అభ్యసన ప్రమాణాలను మరింత మెరుగుపరచాలని తెలిపారు. వ్యవసాయ శాఖ సమీక్ష సమావేశంలో సూపర్ ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలో నీటి లభ్యత తగ్గే అవకాశం ఉన్నందున రైతులు వరికి బదులుగా కందులు, పెసలు, మినుములు, నువ్వులు, పొద్దుతిరుగుడు, ఆయిల్‌పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లేలా విస్తృత అవగాహన కల్పించాలని వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు. ఖరీఫ్ సాగు లక్ష్యాలను తప్పనిసరిగా సాధించాలని, భూములను సాగు చేయకుండా వదిలేస్తే ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు కోల్పోయే అవకాశం ఉందని పేర్కొన్నారు. భూగర్భ జలాల పరిరక్షణ కోసం ఫార్మ్ పాండ్ల నిర్మాణాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించి, వాటి చెల్లింపులను 15 రోజుల్లో పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారం నుంచి వైద్య సేవలు, విద్యా నాణ్యత, వ్యవసాయ అభివృద్ధి వరకు ప్రతి శాఖ సమర్థవంతంగా పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష స్పష్టం చేశారు.

### చెక్‌డ్యాం భూమి కబ్జాపై క్రిమినల్

# కేసులు నమోదు చేయాలి

#### వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకరి సంపత్ డిమాండ్



మానకొండూర్, జూలై 27, (జనం సాక్షి) : మానకొండూరు మండలం పెద్దూరుపల్లి గ్రామ శివారులో ప్రభుత్వ చెక్‌డ్యాంను కూల్చివేసి భూమిని అక్రమంగా పట్టా చేసుకున్న వారిపై, అలాగే ప్రభుత్వ భూమిని నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు వ్యక్తులకు బదిలీ చేసిన రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకరి సంపత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. సుంకరి సంపత్ మాట్లాడుతూ, 2010లో పెద్దూరుపల్లి గ్రామ సర్వే నంబర్లు 641, 642లో చెక్‌డ్యాం నిర్మాణం కోసం ప్రభుత్వం రైతు తణుకు రాజేశం నుంచి 2 ఎకరాల 35 గుంటల భూమిని సేకరించి నష్టపరిహారం చెల్లించిందని తెలిపారు. అనంతరం అక్కడ చెక్‌డ్యాం నిర్మించి పరిసర రైతులకు సాగునీటి సౌకర్యం కల్పించిందన్నారు.అయితే ఆ చెక్‌డ్యాంను పూర్తిగా కూల్చివేసి తప్పుడు పత్రాలతో ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తుల పేరిట పట్టా చేశారని ఆరోపించారు. ప్రభుత్వ భూమి బదిలీ విషయంలో రెవెన్యూ, మైనర్ ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కాకుండా, అక్రమాలకు సహకరించారనే ఆరోపణలు చేశారు.ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి అక్రమ పట్టాలను రద్దు చేయాలని, భూ కబ్జాదారులతో పాటు సంబంధిత అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. లేనిపక్షంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఈపీఎఫ్

## ఈఎస్‌ఐసీపై అవగాహన సదస్సు

**రామగిరి జూలై27 జనంసాక్షి:** సింగరేణి రామగుండం–3 ఏరియా ఎస్ఎంఎస్ ప్లాంట్‌లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కోసం ఈపీఎఫ్ (ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్), ఈఎస్ఐసీ (ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్) పథకాలపై సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఈపీఎఫ్ కరీంనగర్ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి జి. నరేష్, సీనియర్ అసిస్టెంట్ ఎన్. శ్రీధర్, రామగుండం ఈఎస్ఐసీ మేనేజర్ ఆర్. శ్రీకర్, అసిస్టెంట్ మేనేజర్ కిరణ్ కుమార్ పాల్గొని ఉద్యోగులకు ఈపీఎఫ్, ఈఎస్ఐసీ పథకాల ప్రయోజనాలు, ఉద్యోగుల హక్కులు, సామాజిక భద్రత, వైద్య సేవలు, పెన్షన్, బీమా, నామినేషన్, క్లెయిమ్ ప్రక్రియలపై సమగ్రంగా వివరించారు.ఉద్యోగులు తమ ఈపీఎఫ్ ఖాతాలను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవడం తో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో ఉద్యోగులు అడిగిన పలు సందేహాలకు సమాధానాలు ఇచ్చి, ఈపీఎఫ్–ఈఎస్ఐసీ పథకాల ద్వారా లభించే ప్రయోజనాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు.ఈ అవగాహన కార్యక్రమాన్ని ఎస్ఎంఎస్ ప్లాంట్ మేనేజర్ పీ. శరవణన్, కెమిస్ట్ కె. సంతోష్ రెడ్డి, డివైపీఎం వంశీధర్, సీనియర్ పీఓ రాజేశం ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో వి.పీ. వర్గీస్ ఇంజినీర్స్ కాంట్రాక్టర్స్ సంస్థ కాంట్రాక్టర్ వేముల శ్రీనివాస్ రావుతో పాటు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.




# రాజ్యాధికారమే బీసీల ఏకైక లక్ష్యం

## జిల్లా బీసీ జేఏసీ చైర్ పర్సన్ దాసరి ఉష

**పెద్దపల్లి,జూలై 27(జనంసాక్షి) :** బీపీ మండల్ వర్ధంతి సందర్భంగా ఆగస్టు 7న కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరు నగరంలో గల ప్రతిష్టాత్మక జ్ఞాన జ్యోతి ఆడిటోరియంలో నిర్వహించనున్న అఖిల భారత జాతీయ ఓబీసీ11వ మహాసభను విజయవంతం చేయాలని జిల్లా బీసీ జేఏసీ చైర్ పర్సన్ దాసరి ఉష పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జండా చౌరస్తా వద్ద బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నల్లవెల్లి శంకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై బీసీ నాయకులతో కలిసి 11వ మహాసభ పోస్టర్ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా బీసీ జేఏసీ చైర్ పర్సన్ దాసరి ఉష మాట్లాడుతూ దేశవ్యాప్తంగా తలపెట్టబోయే సమగ్ర జనగణనలో బీసీ కులగణనను ప్రత్యేకంగా చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఆర్థిక,సామాజిక,రాజకీయ సమానత్వం సాధించినప్పుడే సమాజంలో నిజమైన మార్పు సాధ్యమని,ఆ దిశగా బీసీలు ఐక్యంగా ముందుకు పయనించాలని ఉద్బోధించారు.ఈ సమావేశంలో బీసీ జేఏసీ మహిళా కన్వీనర్ సిరవేణి స్వప్న,రాష్ట్ర కార్యదర్శి కన్నా రమేష్,బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాలువ రమేష్,ఉపాధ్యక్షులు బొడ్డుపల్లి లక్ష్మణ్,అధికార ప్రతినిధి కంకటి శ్రీనివాస్,జిల్లా యువజన అధ్యక్షుడు శ్రీధర్,సర్పంచులు పోల్ దాసరి,కలవేని రమేష్ ముదిరాజ్,సాయికుమార్,బిజేపీ సీనియర్ నాయకులు బుర్ల లక్ష్మీనారాయణ,బీసీ జేఏసీ మీడియా ప్రతినిధి అబ్దుల్ మల్లిక్,మండల అధ్యక్ష, కార్యదర్శులు రవి, భూమన్న, బొల్లం భూమేష్, కన్నం శ్రావణ్, వినయ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌ఓబి పనులు మరింత వేగవంతం చేయండి

- సర్వీస్ రోడ్లు, భూసేకరణతో పాటు అనుబంధ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలి
- ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్ బ్యూరో, జూలై 27 (జనంసాక్షి) :** కరీంనగర్ – చొప్పదండి ప్రధాన రహదారి పై తీగలగుట్టపల్లి వద్ద నిర్మాణంలో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబి) పనులను మరింత వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఓబి నిర్మాణ పనుల ప్రస్తుత పురోగతి, ఇప్పటికే పూర్తయిన పనులు, ఇంకా చేపట్టాల్సిన పనుల పై ఆర్ అండ్ బి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా బ్రిడ్జి నిర్మాణంతో పాటు నాలుగు వైపులా నిర్మించాల్సిన సర్వీస్ రోడ్లు, భూసేకరణ ప్రక్రియ, డ్రైనేజీ, ఇతర అనుబంధ పనుల పురోగతి పై ఆరా తీశారు. పనులు వేగంగా సాగేందుకు అవసరమైన చర్యలను వెంటనే చేపట్టాలని అధికారులకు సూచించారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా ప్రతిరోజూ పర్యవేక్షణ నిర్వహించాలని, పనుల నాణ్యతలో రాజీ పడొద్దని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడకుండా ట్రాఫిక్ నిర్వహణకు తగిన చర్యలు తీసుకోవాలని, నిర్మాణ ప్రాంతంలో భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. సర్వీస్ రోడ్ల నిర్మాణం ఈ ప్రాజెక్టులో అత్యంత కీలకమని పేర్కొన్న కలెక్టర్, వాటి నిర్మాణానికి అవసరమైన భూసేకరణ పనులను వేగవం తం చేస్తున్నామని తెలిపారు. ఇందుకు సంబంధించిన రెవెన్యూ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. ఆర్‌ఓబి పూర్తయితే కరీంనగర్ – చొప్పదండి మార్గంలో ట్రాఫిక్ సమస్యలు గణనీయంగా తగ్గడంతో పాటు రైల్వే గేటు వద్ద ఏర్పడే నిరీక్షణకు ముగింపు లభిస్తుందని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ పనులను ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందన్నారు. నిర్మాణ పనుల అమలులో ఎదురయ్యే సమస్యలు ఏవైనా ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించిన కలెక్టర్, పనుల పురోగతిపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బి, ఈఈ కుమార స్వామి, డీఈ కిరణ్, ఏఈ మధు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రేమ పేరుతో మోసం చేశారని సర్పంచ్‌పై మహిళ ఆందోళన

- బోధన్ ఆర్డీవో కార్యాలయం ఎదుట బాధితురాలి నిరసన
- పెళ్లి చేస్తానని నమ్మించి మోసం చేశారని ఆరోపణ
- ఆర్ఎంపీ వైద్యుడిపైనా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి
- న్యాయం చేయాలని అధికారులకు వినతి






**బోధన్, జూలై 27 (జనంసాక్షి) :** తనను ప్రేమించి మోసం చేసిన పోతంగల్ మండలం జల్లాపల్లి ఫారం సర్పంచ్ దస్తగీర్ పై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం బాధితమైన షేక్ సీమా బేగం బోధన్ ఆర్డీవో కార్యాలయం ఎదుట గ్రామస్తులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గత 10 సంవత్సరాల క్రితం పోతంగల్ మండలం జిల్లాపల్లి ఫారం ప్రస్తుత సర్పంచ్ దస్తగిర్ ప్రేమించుకోవడం జరిగిందన్నారు. ప్రేమ వ్యవహారం నడుస్తున్న తరుణంలో దస్తగీర్ పెళ్ళికి నిరాకరించడం వల్ల నాకు నా తల్లి తండ్రులు వేరే వారితో వివాహం జరిపించారని ఆమె స్పష్టం చేశారు. అయినప్పటికీ దస్తగీర్ నేను వివాహం చేసుకున్న నా భర్తతో సంప్రదింపులు జరిపి, సీమా నేను ప్రేమించుకున్నాము నీవు ఎట్లా పెళ్లి చేసుకున్నావు అని మాయమటాలు చెప్పడం వల్ల నా భర్త నాకు విడాకులు ఇవ్వడం జరిగిందన్నారు. అలాగే రెండవ సారి కూడా నాకు తల్లిదండ్రులు వేరే చోట పెళ్ళి చేసి ఇవ్వడం జరిగింది, అయిన కూడా రెండవ భర్తను కూడా అలాగే ప్రవర్తించి నాకు విడాకులు తీసుకోమని మాయమాటలు చెప్పి నేను నీతోనే పెళ్ళి చేసుకుంటామని చెప్పి విడాకులు ఇప్పించి బోధన్ లో ఒక ఇల్లు తీసుకోని 6 సంవత్సరాల నుండి ఇక్కడే ఉంచి నాతో అక్రమ సంబందం పెట్టుకోని ఇగో రేపో మాపో అంటు కాలయాపన చేస్తూ వచ్చాడన్నారు. అయితే సర్పంచ్ గా ఎన్నికైన తరువాత నాతో పెళ్ళికి సహజీవనం సాగిస్తు నేను గర్భవతి అయిన తరువాత అబార్షన్ తో పాటు గర్భసంచికి సంబందించిన టూబును తీసివేయించి ఇప్పుడు పెళ్ళికి నిరాకరిస్తున్నారని ఆమె ఆరోపించారు. దస్తగిరితో పాటు ఆయనకు సహకరించి నా గర్భసంచిని తొలగించిన ఆర్ఎంపి డాక్టర్ ఇలియాస్‌పై తగిన చర్య తీసుకోవాలని పోలీసు అధికారులకు విన్నవించుకున్న ప్పటికీ పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఈ మేరకు తనకు న్యాయం చేయాలని సర్పంచ్ ఆర్ఎంపీలపై చర్యలు తీసుకోవాలని బాధ్యత మహిళా నసీమా బేగం అధికారులను కోరారు.



# ప్రభుత్వ వైద్య సేవలు బలోపేతం

- వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఆదిలాబాద్, కొమురం భీమ్ ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాల్లో ప్రభుత్వ వైద్య సేవలను మరింత బలోపేతం చేసి, ప్రజలకు వారి జిల్లాల్లోనే నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. ఈ మేరకు ఆయా జిల్లాల్లో ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, మౌలిక వసతులు, అభివృద్ధి పనుల పురోగతిపై సోమవారం సెక్రటేరియట్‌లోని తన చాంబర్‌లో మంత్రి సమీక్ష చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు, పాయల్ శంకర్, డాక్టర్ పాల్వాయి హరీశ్ బాబు, కోవ లక్ష్మి, రామారావు పవర్, అనిల్ జాదవ్, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ గౌరవ్ ఉప్పల్, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ, డీఎంఈ డాక్టర్ నరేంద్ర కుమార్, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్, డాక్టర్ రవీందర్ నాయక్, ఆరోగ్యశ్రీ సీఈవో హనుమంతు, ఆదిలాబాద్ రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ జయసింగ్ రాథోడ్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాల డీఎంహెచ్‌వోలు, వివిధ ప్రభుత్వ హాస్పిటళ్ల సూపరింటెండెంట్లు, ఇతర ఉన్నతాధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో ఆదిలాబాద్ రిమ్స్‌తో పాటు ఆసిఫాబాద్, నిర్మల్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, జనరల్ హాస్పిటళ్లు, జిల్లా హాస్పిటళ్లు, ఏరియా హాస్పిటళ్లు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్ల పనితీరును మంత్రి జిల్లాల వారీగా సమీక్షించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, మౌలిక వసతులు, నిర్మాణ పనుల పురోగతి, వైద్య పరికరాలు, ప్రత్యేక వైద్య సేవల విస్తరణ తదితర అంశాలపై అధికారులతో విస్తృతంగా చర్చించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో ప్రభుత్వ హాస్పిటళ్ల పనితీరు గతంతో పోలిస్తే గణనీయంగా మెరుగుపడిందని మంత్రికి తెలిపారు. డాక్టర్లు, నర్సింగ్, ఇతర వైద్య సిబ్బంది సంఖ్య పెరగడంతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని పేర్కొన్నారు. స్థానిక అవసరాలకు అనుగుణంగా మరిన్ని సౌకర్యాలు కల్పించాలని, మౌలిక వసతులను విస్తరించాలని, కొన్ని ప్రత్యేక వైద్య విభాగాలను బలోపేతం చేయాలని కోరారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా, వాటిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని గిరిజన, అటవీ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు కూడా నగరంలోని ప్రజలకు అందుబాటులో ఉన్న అన్నిరకాల వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఇందుకోసం ట్రైబల్ ఏరియాల్లో ప్రభుత్వ హాస్పిటళ్ల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని చెప్పారు. ఐటీడీఏల పరిధిలో ఉన్న అన్ని ఏరియా హాస్పిటళ్లలో దశలవారీగా సీటీ స్కాన్ సేవలను అందుబాటులోకి తీసుకొస్తామని వెల్లడించారు.

# సుందర్‌బన్స్‌లో 10 వేల మ్యాంగ్రోవ్ మొక్కలు

## నాటిన గ్రీన్ ఇండియా చాలెంజ్



- అంతర్జాతీయ మ్యాంగ్రోవ్ దినోత్సవం సందర్భంగా ఘన కార్యక్రమం
- పులి దాడుల్లో భర్తలను కోల్పోయిన మహిళలతో కలిసి మొక్కలు నాటిన జోగినిపల్లి సంతోష్ కుమార్

**హైదరాబాద్/సుందర్‌బన్స్ (జనంసాక్షి) :** అంతర్జాతీయ మ్యాంగ్రోవ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రీన్ ఇండియా చాలెంజ్ 9వ ఎడిషన్‌లో భాగంగా పశ్చిమ బెంగాల్‌లోని యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశమైన సుందర్‌బన్స్‌లో 10 వేల మ్యాంగ్రోవ్ మొక్కలను నాటారు. గ్రీన్ ఇండియా చాలెంజ్ వ్యవస్థాపకుడు, గ్రీన్ గ్లోబల్ ఐకాన్ జోగినిపల్లి సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రపంచంలోనే అతిపెద్ద అలల అటవీ ప్రాంతమైన సుందర్‌బన్స్ బెంగాల్ తీరాన్ని తుఫాన్ల నుంచి రక్షించడంతో పాటు, ప్రపంచంలోనే అత్యధిక కార్బన్‌ను నిల్వ చేసే అటవీ వ్యవస్థల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. అంతేకాకుండా రాయల్ బెంగాల్ పులులకు ఇది ప్రధాన ఆవాసంగా ఉంది. ఈ కార్యక్రమంలో 500 మందికి పైగా మ్యాంగ్రోవ్ ఆర్మీ సభ్యులు, స్థానిక గ్రామస్తులు, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, అటవీ శాఖ అధికారులు, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు. ప్రత్యేకంగా పులుల దాడుల్లో భర్తలను కోల్పోయిన 'టైగర్ విడోస్' (పులి వితంతువులు) మొక్కలు నాటడం ద్వారా అడవుల సంరక్షణలో భాగస్వాములయ్యారు. ఒకప్పుడు అడవి వల్ల తీవ్ర విషాదాన్ని చవిచూసిన ఈ మహిళలు ఇప్పుడు అదే అడవికి సంరక్షకులుగా మారడం ఈ కార్యక్రమానికి ప్రత్యేకతగా నిలిచింది. సుందర్‌బన్స్ తీర ప్రాంత పునరుద్ధరణ కోసం ఎన్నో ఏళ్లుగా కృషి చేస్తున్న ఉమాశంకర్ మండల్ (మ్యాంగ్రోవ్ మ్యాన్ ఆఫ్ సుందర్‌బన్స్) మార్గదర్శకత్వంలో మ్యాంగ్రోవ్ ఆర్మీ ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా, ఇగ్నైటింగ్ మైండ్స్ ఆర్గనైజేషన్ తరఫున కృష్ణ తేజ రెడ్డి సమన్వయం చేశారు. నిపుణుల ప్రకారం ఒక హెక్టారు మ్యాంగ్రోవ్ అడవి సాధారణ ఉష్ణమండల అటవులతో పోలిస్తే నాలుగు రెట్లు ఎక్కువ కార్బన్‌ను నిల్వ చేస్తుంది. తుఫాన్ల ఉద్ధృతిని తగ్గించడం, తీరప్రాంతాలను కోత నుంచి కాపాడడం, చేపల పెరుగుదలకు అనుకూల వాతావరణాన్ని కల్పించడం వంటి కీలక పాత్రను మ్యాంగ్రోవ్ అడవులు పోషిస్తాయి. సముద్ర మట్టం పెరగడం, తరచుగా సంభవిస్తున్న తుఫాన్లు, ఉప్పునీటి చొరబాటు కారణంగా సుందర్‌బన్స్ తీవ్ర వాతావరణ ముప్పును ఎదుర్కొంటున్న నేపథ్యంలో 10 వేల మ్యాంగ్రోవ్ మొక్కల నాటకం తీర ప్రాంత రక్షణకు, జీవవైవిధ్య పరిరక్షణకు, వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి కీలక చర్యగా నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జోగినిపల్లి సంతోష్ కుమార్ మాట్లాడుతూ 'ఈ అడవి వల్ల అత్యధిక నష్టాన్ని చవిచూసిన మహిళలే ఇప్పుడు అదే అడవిని పునర్నిర్మిస్తున్నారు. ఇది దానం కాదు.. సామాజిక న్యాయం. ఈ రోజు నాటిన ప్రతి మ్యాంగ్రోవ్ మొక్క భవిష్యత్ తరాలకు రక్షణ కవచంగా నిలుస్తుంది' అని అన్నారు. 2018లో తెలంగాణ హరితహారం స్ఫూర్తితో జోగినిపల్లి సంతోష్ కుమార్ ప్రారంభించిన గ్రీన్ ఇండియా చాలెంజ్ ప్రస్తుతం ప్రపంచంలోనే అతిపెద్ద పౌర ఆధారిత పర్యావరణ ఉద్యమాల్లో ఒకటిగా ఎదిగింది. ఇగ్నైటింగ్ మైండ్స్ ఆర్గనైజేషన్ సహకారంతో 33 దేశాల్లో పర్యావరణ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. '2031 అక్టోబర్ 15న భారతరత్న డాక్టర్ ఏపిజె అబ్దుల్ కలాం శతజయంతి నాటికి 100 కోట్ల మొక్కలు నాటాలి" అనే లక్ష్యంతో గ్రీన్ ఇండియా చాలెంజ్ ముందుకు సాగుతోంది. ఈ ఉద్యమం 'మూడు మొక్కలు నాటు – మూడు సంవత్సరాలు సంరక్షించు మరో ముగ్గురిని ప్రేరేపించు' అనే సందేశంతో కోట్లాది మందిని పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములను చేస్తోంది.







# బుల్లెట్ ట్రైన్ రూట్‌లో గద్వాల్ గయాబ్




## నడిగడ్డను నట్టేట ముంచారు..!!

- హైదరాబాద్-బెంగళూరు బుల్లెట్ ట్రైన్ రూట్‌లో కీలక మార్పులు
- గద్వాల, మహబూబ్‌నగర్‌లకు దక్కని'బుల్లెట్' స్టాప్
- సాధారణ ప్రయాణికుల సమస్యలు యథాతథం

*హైదరాబాద్ - బెంగళూరు బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు డీపీఆర్ (డీటెయిల్ ప్రాజెక్టు రిపోర్ట్) నుంచి గద్వాలను తప్పించడంపై నడిగడ్డ ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ హై-స్పీడ్ రైలు మార్గంలో గద్వాల ఒక కీలక స్టేషన్‌గా ఉండాలని తొలుత ప్రతిపాదించినప్పటికీ, తాజాగా విడుదలైన ప్రాథమిక డీపీఆర్‌లో ఈ ప్రాంతం స్థానం కోల్పోవడం చర్చనీయాంశంగా మారింది.*

– గద్వాల బ్యూరో (జనంసాక్షి) :

తొలి ప్రతిపాదనలో షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, గద్వాల, అలంపూర్ మీదుగా బుల్లెట్ ట్రైన్ మార్గం ఉంటుందని పేర్కొన్నారు. అయితే తాజా డీపీఆర్‌లో గద్వాల ప్రస్తావన లేకపోవడంతో, ఈ మార్పు వెనుక కారణాలపై పలు అనుమానాలు వ్యక్తమవుతు న్నాయి. దీనిపై గ్రౌండ్ సర్వేలు ఇంకా కొనసాగుతున్నట్లు సమాచారం. హైదరాబాద్ నుంచి గద్వాల మీదుగా వెళ్లే ప్రయాణికులకు, ముఖ్యంగా శ్రీశైలం వెళ్లే భక్తులకు ఈ మార్గం ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ఈ మార్గం మధ్యలో అలంపూర్ వద్ద ఉన్న జోగులాంబ శక్తిపీఠం కూడా ఉండటంతో, పుణ్యక్షేత్రాన్ని సందర్శించే భక్తులకు కూడా ఇది ఉపయోగకరంగా ఉంటుందని వారు అభిప్రాయపడుతున్నారు. అయితే డీపీఆర్‌లో గద్వాలను తప్పించడంతో "ఇదేం అన్యాయం" అంటూ నడిగడ్డ ప్రజలు మండిపడుతున్నారు. మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ఈ అంశంపై స్పందించి, బుల్లెట్ ట్రైన్ మార్గాన్ని గద్వాల మీదుగా మార్చాలని కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. నడిగడ్డ ప్రజలు కూడా తమ డిమాండ్‌ను వినిపిస్తూ, గద్వాలను తిరిగి మార్గంలో చేర్చాలని కోరుతున్నారు.

### ప్రయాణికులు, ఉద్యోగులు, విద్యార్థుల తీవ్ర ఇబ్బందులు

లోకల్ రైళ్లు అని వేగంగా వెళ్లే ఎక్స్‌ప్రెస్, వందే భారత్ రైళ్లకు లైన్ క్లియర్ ఇచ్చే క్రమంలో, గద్వాల స్టేషన్‌లో సాధారణ ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్లను గంటల తరబడి లూప్ లైన్లలో నిలిపివేస్తున్నారు. దీనివల్ల నిత్య ప్రయాణికులు, ఉద్యోగులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పనులలో జాప్యం మూలంగా జిల్లా కేంద్రమైన గద్వాలలో డబ్లింగ్, లైన్ పనులు అనుకున్న వేగంతో సాగకపోవడం వల్లే ఈ క్రాసింగ్ సమస్యలు తలెత్తుతున్నాయి. దక్షిణ మధ్య రైల్వే అధికారులు స్పందించి గద్వాల జంక్షన్ వద్ద కీలక రైళ్లకు స్టాపింగ్స్ మంజూరు చేయాలని, క్రాసింగ్‌ల పేరుతో రైళ్లను గంటల తరబడి నిలపకుండా చర్యలు తీసుకోవాలని గద్వాల నియోజకవర్గ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


### ప్రజల దశాబ్దాల కల



గుంటూరు – మాచర్ల – గద్వాల రైల్వే ప్రాజెక్టు కేవలం ఒక రవాణా మార్గం కాదు. ఇది ఈ వెనుకబడిన ప్రాంతాల ప్రజల దశాబ్దాల కల, సామాజిక ఆవశ్యకత. పార్టీలకతీతంగా రెండు రాష్ట్రాల ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు, పౌర సమాజం కలిసి ఒత్తిడి తెస్తేనే ఈ ఫైళ్లు ముందుకు కదులుతాయి. ప్రభుత్వాలు మారినా ప్రజల అవసరాలు మారవు. ఈ రైల్వే లైన్ రావడం వల్ల పల్నాడు మిరప రైతులు, స్థానిక గ్రానైట్ వ్యాపారులు, సామాన్య ప్రయాణికులకు దక్కే లబ్ధి అమూల్యమైనది.

– అచ్చన్న గౌడు, బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

### మాకు లాభం లేదు



మహబూబ్ నగర్,గద్వాల పట్టణ ప్రాంతాల్లో బుల్లెట్ ట్రైన్ స్టేషన్లు వచ్చే అవకాశాలు తక్కువ. వచ్చినా సాధారణ మధ్యతరగతి ప్రజలకు ఈ ధరలు కొద్దిగా భారమే. మహబూబ్ నగర్, గద్వాల ప్రజలు ఇప్పుడు బుల్లెట్ ట్రైన్ సౌకర్యాన్ని ఉపయోగించుకోవాలంటే సమీపంలోని 'ఫ్యూచర్ సిటీ' లేదా 'శంషాబాద్' స్టేషన్లకు చేరుకోవాల్సి అవసరం ఏర్పడటంతో మాకు లాభం లేదు.

– సీనియర్ సిటిజన్ ఫోరం మోహన్ రావు

# కృష్ణమ్మ మురిపెం



## జూరాలకు కొనసాగుతున్న వరద ప్రవాహం

**గద్వాల ప్రతినిధి,జూలై 27( జనం సాక్షి) :** ఎగువన కురుస్తున్న భారీ వర్షాల వల్ల జూరాల ప్రాజెక్టుకు వరద నీరు భారీగా చేరుతోంది. కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్ ఆనకట్టల నుండి నీటిని విడుదల చేయడంతో కృష్ణమ్మ పరవళ్లతో జూరాల జలాశయానికి జలకళ వచ్చింది.ప్రస్తుత నీటి మట్టం, వరద,ప్రాజెక్టు అధికారులు, అధికారిక నివేదికల ప్రకారం జూరాల తాజాగా ప్రాజెక్టులోకి ప్రస్తుతం 30,400 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తోంది. జూరాల ప్రాజెక్ట్ పూర్తి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 5.897 టీఎంసీల నీరు నిల్వ ఉంది.పూర్తి స్థాయి నీటిమట్టం 318.516 మీటర్లు కాగా, ప్రస్తుత నీటిమట్టం 316.09 మీటర్ల వద్ద కొనసాగుతోంది.జల విద్యుత్ ఉత్పత్తి వరద ప్రవాహం ఇలాగే స్థిరంగా కొనసాగితే, రాబోయే 3 రోజుల్లో జూరాల ప్రాజెక్టులో జలవిద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించనున్నట్లు అధికారులు అంటున్నారు . ఖరీఫ్ సీజన్ ప్రారంభమై సాగునీటి కోసం ఎదురుచూ స్తున్న ఉమ్మడి మహబూబ్‌నగర్, జోగులాంబ గద్వాల జిల్లా రైతులకు ఈ వరద రాక ఎంతో ఊరటనిచ్చింది.ఎగువ నుండి వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉండటంతో, రానున్న రోజుల్లో జూరాల గేట్లు ఎత్తి దిగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టుకు నీటిని విడుదల చేసే అవకాశం ఉంది.జూరాల ప్రాజెక్టు పరిధిలోని కుడి, ఎడమ కాలువలు మరియు నెట్టెంపాడు ఎత్తిపోతల ద్వారా నీటి విడుదలతో కాలువలు, ఎత్తిపోతలు, ఎగువ నుంచి వరద ప్రవాహం క్రమంగా పెరుగుతుం డటంతో, స్థానిక ఆయకట్టు రైతులకు సాగునీరు అందించేందుకు, రిజర్వా యర్లను నింపేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో రైతుల సాగునీటి అవసరాల నిమిత్తం నెట్టెంపాడు లిఫ్ట్ పరిధిలోని పంపుల ద్వారా నీటిని ఎత్తిపోసేందుకు జలవనరుల శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వరద ఉధృతి ఇదే రీతిన మరింత పెరిగితే,రాబోయే రోజుల్లో నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ లిఫ్టుల ద్వారా నీటి ఎత్తిపోతలు పూర్తి స్థాయిలో ముమ్మరం కానున్నాయి.కుడి, ఎడమ కాలువలు ప్రస్తుతానికి జూరాల ఇన్–ఫ్లో నిలకడగా పెరుగుతూ 33,900 క్యూసెక్కులకు పైగా చేరుతోంది . డ్యామ్ పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరువవుతుండటంతో, కాలువల ద్వారా ఆయకట్టుకు అధికారికంగా నీటిని విడుదల చేసేందుకు షెడ్యూల్ ఖరారు చేయనున్నారు. మహబూబ్‌నగర్ గ్రిడ్ ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా ఎంజీఎల్ఐ ద్వారా ఇప్పటికే పరివాహక ప్రాంతాల్లోని అంతర్గత రిజర్వాయర్లను నింపే ప్రక్రియ ప్రారంభమైంది.




# కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జిగా అంకం శివరాణి నియామకం



**కరీంనగర్ బ్యూరో (జనంసాక్షి) :** తెలంగాణ రక్షణ సేన కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జిగా అంకం శివరాణి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తనపై కొండంత నమ్మకంతో ఈ కీలక బాధ్యతలను అప్పగించిన పార్టీ వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవితకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. తన నియామకానికి సహకరించిన పార్టీ రాష్ట్ర బాధ్యులకు, జిల్లా అధ్యక్షులకు, జిల్లా స్థాయి నాయకులందరికీ ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టు కుంటూ కరీంనగర్ నియోజకవర్గంలో పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తానని పేర్కొన్నారు. అలాగే, నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటూ పోరాడతానని ఈ సందర్భంగా అంకం శివరాణి స్పష్టం చేశారు.




Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370